
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ప్రకాశం 5
జిల్లా వార్తలు
ఆదివారం 28, ఏప్రిల్ 2024


మార్కాపురం జిల్లా కోరుతూ తర్లుపాడులో రాస్తారోకో చేస్తున్న టీడీపీ నాయకులు (ఫైల్)

జిల్లాలోని పశ్చిమ ప్రాంత ప్రజల ఆకాంక్షల్లో ముఖ్యమైనది ప్రత్యేక మార్కాపురం జిల్లా. గత 55ఏళ్లుగా ఉన్న డిమాండ్ ఇది. పలు సందర్భాల్లో ఆప్రాంత ప్రజలు గొంతెత్తి చాటారు. వైసీపీ ప్రభుత్వం 13 జిల్లాలను 26గా విభజించిన సమయంలో తమ డిమాండ్‌ను మరింతగా వినిపించారు. రోడ్డెక్కి ఆందోళనలు చేపట్టారు. భారీ ఉద్యమమే చేశారు. అయినా వారి ఆకాంక్షను వైసీపీ ప్రభుత్వం కానీ, ఆ పార్టీ ప్రజాప్రతినిధులు కానీ పట్టించుకోలేదు. దీంతో సమయం వచ్చినప్పుడు చూద్దామనుకున్నారు కాబోలు ఎన్నికల ప్రచారం ప్రారంభమైన ప్రస్తుత తరుణంలో జనం ప్రత్యేక జిల్లా ఏది అంటూ ప్రశ్నించడం ప్రారంభించారు. ప్రభుత్వానికి నచ్చజెప్పో, ఒత్తిడితో కదిలించో జిల్లాను సాధించాల్సిన మీరు అప్పుడేమి చేశారంటూ నిలదీస్తున్నారు. ఇది పశ్చిమప్రాంతంలో ప్రచారానికి వెళ్లిన వైసీపీ అభ్యర్థులు, నాయకులకు ఇబ్బందికరంగా మారింది. అదేసమయంలో అధికారంలోకి వచ్చిన వెంటనే మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేస్తామని చంద్రబాబు ఇచ్చిన హామీతో టీడీపీ అభ్యర్థులు దూసుకుపోతున్నారు.


మార్కాపురం పట్టణం వ్యూ

మార్కాపురం జిల్లా ఏదీ?

- పశ్చిమ ప్రాంత ప్రజల సూటి ప్రశ్న
- సమాధానం లేక వైసీపీ అభ్యర్థులు విలవిల
- జిల్లాల పునర్విభజనలో పట్టించుకోని పాలకులు
- సీఎంను గట్టిగా అడగలేని స్థితిలో నేతలు
- అప్పుడు మిన్నకుండటంతో ఇప్పుడు ఇరకాటం
- జిల్లా ఏర్పాటుతో అన్ని విధాలా అభివృద్ధి చెందే అవకాశం
- అదే హామీతో దూసుకుపోతున్న టీడీపీ అభ్యర్థులు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా 1970లో ఒంగోలు జిల్లాను ఏర్పాటు చేశారు. 1972లో సమరయోధులు ప్రకాశం పంతులు పేరుమీద ప్రకాశం జిల్లాగా మార్చారు. ప్రస్తుత జిల్లాకేంద్రం ఒంగోలు, తాజాగా బాపట్ల జిల్లాలోకి వెళ్లిన చీరాల, పర్చూరు. అద్దంకి ప్రాంతాలను అప్పట్లో గుంటూరు జిల్లా నుంచి విడదీశారు. కొండపి, కందుకూరు, కనిగిరి దర్శిలోని కొంత ప్రాంతాన్ని అప్పటి నెల్లూరు జిల్లా నుంచి బయటకు తీశారు. గిద్దలూరు, మార్కాపురం, వైపాలెం నియోజకవర్గాల్లోని కొన్ని ప్రాంతాలను కర్నూలు జిల్లా నుంచి విడగొట్టారు. జిల్లా ఏర్పాటు సమయంలోనే విజ్ఞులైన అప్పటి కొందరు నాయకులు అంతో ఇంతో జిల్లాకు నడిబొడ్డున ఉన్న పొదిలిని జిల్లాకేంద్రంగా చేయాలని డిమాండ్ చేశారు. అయితే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో చక్రంతిప్పుతున్న ఒక నాయకుడి పలుకుబడితో ఒంగోలును జిల్లాకేంద్రంగా చేశారు. ఆతర్వాత పొదిలిని కనీసం డివిజన్ కేంద్రగానైనా చేయాలని డిమాండ్ వచ్చినా పట్టించుకోలేదు. ఒకప్పుడు మార్కాపురం కేంద్రంగా ఉన్న లోక్‌సభ నియోజకవర్గం కూడా పునర్విభజనలో రద్దయింది. అయితే రాయలసీమ నుంచి ప్రకాశం జిల్లాలో చేరిన తర్వాత ఆ ప్రాంత ప్రజల మనోభావాల్లో మార్పు వచ్చింది. ఆయా దశల్లో పాలనా వికేంద్రీకరణ జరిగిన సందర్భాల్లో జిల్లాకేంద్రం సుదూరంగా ఉండటం సమస్యగా మారి పశ్చిమ ప్రాంతాన్ని ప్రత్యేక జిల్లా చేయాలనే డిమాండ్ ఉద్భవించింది.

సమాధానం చెప్పలేని పరిస్థితిలో వైసీపీ నేతలు

ప్రస్తుతం పశ్చిమప్రాంతంలో గిద్దలూరు నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న నాగార్జునరెడ్డి మార్కాపురం ఎమ్మెల్యేగా ఉన్నారు. మార్కాపురంలో పోటీలో ఉన్న అన్నా రాంబాబు గిద్దలూరు ఎమ్మెల్యే. దర్శి నుంచి పోటీలో ఉన్న శివప్రసాద్‌రెడ్డి అప్పుడు మాజీ ఎమ్మెల్యేగా రాజకీయంగా క్రియాశీలకంగా ఉన్నారు. కనిగిరి నుంచి పోటీలో ఉన్న నారాయణ విభజన సమయంలో వైసీపీ జడ్పీటీసీగా ఉన్నారు. వైపాలెం నుంచి పోటీలో ఉన్న చంద్రశేఖర్ స్థానికేతరుడు. అప్పట్లో వైపాలెం ఎమ్మెల్యేగా ఉండి మంత్రిగా ఉన్న సురేష్ ఇప్పుడు జిల్లాలోని కొండపి నుంచి పోటీ చేస్తున్నారు. దీంతో పశ్చిమప్రాంత వైసీపీ ఎమ్మెల్యేలు నియోజకవర్గానికి వెళ్లినప్పుడు మార్కాపురం జిల్లా ఏమైంది. మీరు అప్పుడు ఎందుకు నోరు మెదపలేదు? ఎందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తేలేదు? అని కొందరు సూటిగానే ప్రశ్నిస్తున్నారు. ఇటీవల కొనకనమిట్ల మండలం, దొనకొండ అడ్డరోడ్డు వద్ద జరిగిన సిద్ధం సభలో జగన్ మాట్లాడుతూ కొత్త జిల్లాల ఏర్పాటు ప్రక్రియను ఘనంగా చెప్పుకున్నారు. కానీ మార్కాపురం జిల్లా ఏర్పాటు గురించి ప్రస్తావించలేదు. ఆ సభలో ఉన్న వైసీపీ ఎమ్మెల్యే, ఎంపీ ప్రజల సంతృప్తి కోసమైనా ఈ అంశాన్ని ప్రస్తావించ లేదు. ఈ విషయాన్ని ప్రచారంలోకి వెళ్లిన అభ్యర్థులను వైసీపీ శ్రేణులు కూడా సూటిగా ప్రశ్నిస్తున్నారు. దీంతో వైసీపీ అభ్యర్థులు నీళ్లు నములుతున్నారు. మరోవైపు టీడీపీ అభ్యర్థులు మాత్రం తమ ప్రభుత్వం రాగానే మార్కాపురం జిల్లా ఏర్పాటు చేస్తామన్న చంద్రబాబు హామీని ప్రస్తావిస్తూ ముందుకు సాగుతున్నారు.

సుదూరంలో జిల్లాకేంద్రం

ఇప్పటికీ పశ్చిమప్రాంతంలోని మారుమూల గ్రామాలకు వెళ్లాలంటే అధికారులకు, ప్రజాప్రతినిధులకు రోజంతా సరిపోతుంది. ఒంగోలుకు గిద్దలూరు 140 కి.మీ, పుల్లలచెరువు మండలం 120 కి.మీ దూరంలో ఉన్నాయి. ఇక అటవీ ప్రాంత గ్రామాలకు అధికారులు కానీ, ఆయా సందర్భాల్లో పాలక ప్రజాప్రతినిధులు వెళ్లి రావాలంటే రెండు రోజులు పడుతుంది. దీంతో క్రమేపీ పశ్చిమ ప్రాంతవాసులు తమ ప్రాంతాన్ని ప్రత్యేక జిల్లా చేయాలని కోరుతున్నారు.

కొత్త రాష్ట్రం.. కొత్త జిల్లాలు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయి నవ్యాంధ్ర ఏర్పడిన తర్వాత కొత్త జిల్లాల ఏర్పాటుపై అందరూ దృష్టి కేంద్రీకరించారు. కొత్త రాష్ట్రం ఏర్పడిన అనంతరం తొలిసారి అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం జిల్లాల విభజన జోలికి వెళ్లలేదు. దీంతో మార్కాపురం కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పాటుపై ప్రజల ఆకాంక్ష పాలకులకు తెలియజేయడమే తప్ప ఉద్యమాలు జరగలేదు. కానీ స్థానికంగా అన్ని పార్టీల నాయకులు పశ్చిమప్రాంతంలో నడిబొడ్డున ఉన్న మార్కాపురం కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేస్తామని హామీలు ఇవ్వడం పరిపాటైంది.

జగన్ మాటతో పెరిగిన విశ్వాసం

గత ఎన్నికల ముందు ప్రతిపక్ష నాయకుడిగా జగన్ కొత్త జిల్లాల ఏర్పాటుకు హామీ కూడా ఇచ్చారు. దీంతో ఆప్రాంత ప్రజల్లో ఆశలు చిగురించాయి. పైగా ఒక్క చాన్స్ అని చెప్పిన ఆయన్ను నమ్మి ఆ ప్రాంత వాసులు గత ఎన్నికల్లో వైసీపీకి భారీ ఆధిక్యం ఇచ్చారు. టీడీపీ జిల్లాలోని తూర్పుప్రాంతంలోని నాలుగు స్థానాల్లో గెలుపొందగా, పశ్చిమప్రాంతాల్లో అన్ని స్థానాలను వైసీపీ కైవసం చేసుకుంది. ప్రతిచోటా భారీ ఆధిక్యం లభించింది. ఎమ్మెల్యేలంతా ఆ పార్టీ వారే. వైసీపీ ప్రభుత్వం వచ్చిన రెండున్నరేళ్ల తర్వాత కొత్త జిల్లాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టగా ఆప్రాంత ప్రజలు తమ డిమాండ్‌ను బయటపెట్టారు. మార్కాపురంతోపాటు గిద్దలూరు, వైపాలెం, దర్శి, కనిగిరి నియోజకవర్గాలను కలిపి ప్రత్యేక జిల్లాగా చేయాలని డిమాండ్ చేశారు. ఆ సమయంలో అధికార వైసీపీ నేతలు మౌనవ్రతం పాటించారు. టీడీపీ నాయకులు అటు మార్కాపురం, ఇటు ఒంగోలు కేంద్రంగా ఆరు నియోజకవర్గాలకు ఒక జిల్లాను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆ మేరకు ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పించారు. కానీ వీటన్నింటినీ వైసీపీ సర్కారు పెడచెవిన పెట్టింది.

పార్టీలకతీతంగా ఐక్య ఉద్యమం


మార్కాపురం జిల్లా కోరుతూ కాగడాల ప్రదర్శన చేస్తున్న కందుల, జేఏసీ నాయకులు (ఫైల్)

మార్కాపురం జిల్లా సాధన సమితి పేరుతో పార్టీలకతీతంగా ప్రజలు ఐక్యకార్యాచరణతో ఆందోళన చేపట్టారు. కొన్నినెలల పాటు ఉద్యమం సాగింది. ఆ సమయంలో లోక్‌సభ నియోజకవర్గాల వారీగానే కొత్త జిల్లాల ఏర్పాటు జరుగుతుందని ఒకచోట గాడితప్పితే మిగిలిన చోట ఇబ్బంది వస్తుందని జగన్ చెప్పిన మాటలను వైసీపీ నాయకులు ప్రజలకు వల్లెవేయడం ప్రారంభించారు. అయితే 25 పార్లమెంట్ నియోజకవర్గాలు రాష్ట్రంలో ఉండగా ఒక జిల్లా అదనంగా ఏర్పాటు చేశారు. స్థానికుల డిమాండ్‌కు అనుగుణంగా లోక్‌సభలతో సంబంధం లేకుండా కొన్ని నియోజకవర్గాలను మార్చారు. ఉదాహరణకు బాపట్ల లోక్‌సభలో ఉన్న ఎస్ఎన్‌పాడును ప్రకాశం జిల్లాలో కలిపారు. వెంకటగిరి నియోజకవర్గంలోని కొన్ని మండలాలను నెల్లూరు జిల్లాలో ఉంచి మరికొన్ని మండలాలను కొత్తగా ఏర్పడిన తిరుపతి జిల్లాలోకి మార్చారు. ఈ రెండు అంశాలను పశ్చిమప్రాంత ప్రజలు ప్రస్తావిస్తూ స్థానిక వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు అన్యాయం చేశారని దుమ్మెత్తిపోశారు. మంత్రిగా ఉన్న బాలినేని ఎస్ఎన్‌పాడు విషయంలో అంత శ్రద్ధ తీసుకొని మార్కాపురం ప్రజల ఆకాంక్షను గాలికొదిలేశారని విమర్శించారు. ప్రజల అసంతృప్తిని అప్పట్లోనే వైసీపీ ప్రజాప్రతినిధులు గుర్తించినా కనీసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే చర్యలు కూడా తీసుకోలేదు.

ధర ధగధగ

- పొగాకు మార్కెట్లో రికార్డు స్థాయి రేట్లు
- మేలు రకం కిలో రూ.294, బ్రౌన్ రకం రూ.270కు కొనుగోలు
- బోర్డు చరిత్రలోనే దక్షిణాదిన ఇదే అధికం
- ఇప్పటి వరకూ 32 మిలియన్ కేజీల విక్రయం
- కిలోకు రూ.231 లభించిన సగటు ధర

ఒంగోలు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : దక్షిణాది పొగాకు మార్కెట్ రోజురోజుకూ మరింత హాట్‌హాట్‌గా సాగుతోంది. ఒకవైపు మేలు రకం, మరో వైపు లోగ్రేడ్‌లో నాణ్యమైనదిగా భావించే బ్రౌన్ రకం ధరలు పైపైకి చేరుతున్నాయి. శనివారం మార్కెట్లో రికార్డు స్థాయి ధరలు లభించాయి. మేలు రకం గరిష్ఠ ధర కిలో రూ.294పలికింది. బ్రౌన్ రకం రూ.270 లభించింది. పొగాకు బోర్డు చరిత్రలో దక్షిణాది వేలం కేంద్రాలలో ఈ స్థాయి ధరలు లభించడం ఇదే ప్రథమం. రెండు నెలల క్రితం ప్రస్తుత సీజన్ పొగాకు కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. తొలిరోజు కిలో రూ.230 గరిష్ఠ ధర లభించింది. అలా దాదాపు నెలరోజులపైనే నిలకడగా సాగింది. అనంతరం కొద్దికొద్దిగా పెరుగుతూ వచ్చింది. అదే సమయంలో లోగ్రేడ్ బేళ్లపై వ్యాపారులు దృష్టిపెట్టడంతో వాటి ధరలు కూడా పెరుగుతూ వచ్చాయి. అలా నెల క్రితం వరకూ మేలు రకం గరిష్ఠ ధర కిలో రూ.230 నుంచి 235 వరకూ ఉండగా.. లోగ్రేడ్‌లో కాస్త నాణ్యత కలిగిన వాటి ధరలు కిలో రూ.225 నుంచి 230 వరకూ పలికాయి. ఆ సమయంలో గ్రేడ్ ఏదైనా ఒకే ధర అన్నట్లుగా మార్కెట్ సాగడంతో ఎక్కువ మంది రైతులు మేలు రకం బేళ్లను కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ ఉంచి లోగ్రేడ్‌ను వేలం కేంద్రాలకు తెచ్చారు. ఇప్పుడు కూడా ఎక్కువ కేంద్రాల్లో అలాగే వస్తున్నాయి.



మేలు రకం కోసం వ్యాపారుల పోటీ

పక్షం రోజులుగా మేలు రకం బేళ్ల కోసం వ్యాపారులు పోటీ పడుతుండటంతో క్రమంగా వాటి ధరలు పెరుగుతున్నాయి. 15 రోజుల క్రితం మేలు రకం పొగాకు గరిష్ఠ ధర కిలో రూ.250కు అటుఇటు ఉండగా సోమవారం నాటికి అది రూ.270కి చేరింది. ఐదారు రోజులుగా రోజూ కొంత పెరుగుతుండగా శనివారం ఒంగోలు-1, వెల్లంపల్లి కేంద్రాల్లో ఏకంగా గరిష్ఠ ధర కిలో రూ.294 పలికింది. మిగిలిన వాటిలో ఎక్కువ చోట్ల కిలో రూ.290పైన లభించింది. అదేసమయంలో లోగ్రేడ్‌లో నాణ్యతమైనదిగా భావించే బ్రౌన్‌రకం ధరలు కూడా ఇలాగే పెరుగుతున్నాయి. పక్షం క్రితం ఆ రకం ధర కిలో రూ.230 ఉండగా క్రమంగా పెరుగుతూ శనివారం రూ.270కి చేరింది. ప్రస్తుతం వేలం కేంద్రాల్లో బేళ్ల కోసం బయ్యర్లు పోటీపడుతున్న తీరును చూస్తే గరిష్ఠ ధర కిలో రూ.300 దాటే అవకాశం ఉంది. దక్షిణాదిలో ఇప్పటి వరకు 32 మిలియన్ కిలోల పొగాకు విక్రయాలు జరిగాయి. సగటున కిలోకు రూ.231లభించింది. ఇప్పటి వరకు అమ్మకం జరిగిన పొగాకులో మూడొంతులు లోగ్రేడ్ కాగా రానున్న రోజుల్లో సగటు ధర కిలోకు రూ.250 దాటుతుందని సమాచారం.



టీడీపీ అభ్యర్థుల వినూత్న ప్రచారం

టీడీపీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి శనివారం కనిగిరిలో వినూత్నంగా ప్రచారం నిర్వహించారు. కొద్దిసేపు స్కూటీపై, మరికొద్దిసేపు సైకిల్‌పై ఇద్దరూ పర్యటించారు. ఈసందర్భంగా స్థానికులతో మమేకమయ్యారు. వారితో కొద్దిసేపు సరదాగా గడిపారు. పలు దుకాణాలు, బడ్డీకొట్లు, తోపుడు బండ్ల వారి వద్దకు వెళ్లి ముచ్చటించారు. వ్యాపారులతో మాట్లాడారు. అందరి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాగుంట, ఉగ్ర మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే పట్టణంలో తాగునీటి సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇంటింటికీ తాగునీటి కొళాయి ఏర్పాటు చేస్తామని చెప్పారు. - కనిగిరి

మాజీ మంత్రి శిద్దా ఇంట్లో దోపిడీకి యత్నం

- వాచ్‌మన్ గొంతుకోసే ప్రయత్నం
- భద్రతా సిబ్బంది అప్రమత్తమవడంతో పరారైన ఆగంతుకులు
- సీసీ ఫుటేజీలో దృశ్యాలు

ఒంగోలు (క్రైం), ఏప్రిల్ 27 : మాజీ మంత్రి, వైసీపీ నేత శిద్దా రాఘవరావు ఇంట్లో దోపిడీకి ఇద్దరు ఆగంతుకులు విఫలయత్నం చేశారు. ఒంగోలు లాయర్‌పేట ఎక్స్‌టెన్షన్‌లోని ఆయన ఇంట్లోకి గోడదూకి ప్రవేశించిన వారు కత్తులతో వాచ్‌మన్ గొంతు కోసేందుకు ప్రయత్నించారు. ప్రతిఘటించిన ఆయన కిందపడటంతో అలికిడికి పక్కనే నిద్రిస్తున్న భద్రతా సిబ్బంది అప్రమత్తమవడంతో ఆగంతుకులు పరారయ్యారు. ఈ సంఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. అయితే విషయాన్ని శనివారం మధ్యాహ్నం వరకూ రహస్యంగా ఉంచారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో రంగంలోకి దిగిన వారు దర్యాప్తు ప్రారంభించారు.


సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్న ఏఎస్పీ శ్రీధర్‌రావు

గోడదూకి ఇంట్లోకి ప్రవేశం

ముఖాలకు మాస్కులు ధరించి ఉన్న ఇద్దరు ఆగంతుకులు శిద్దా ఇంటికి ఉత్తరం వైపు ఉన్న గోడ దూకి లోపలకు ప్రవేశించారు. అనంతరం నేరుగా శిద్దా దంపతులు ఉండే మొదటి అంతస్తుకు వెళ్లేందుకు ప్రయత్నించారు. తలుపులు మూసిఉండటంతో తిరిగి కింద భాగాన ఉన్న కార్యాలయం లోపలికి వచ్చారు. అక్కడ వాచ్‌మన్ దుర్గారావు కుర్చీలో కూర్చొని కన్పించాడు. దీంతో ఆగంతుకులు దుర్గారావు పైదాడి చేశారు. కత్తులతో గొంతు కోసే ప్రయత్నం చేయగా ప్రతిఘటించాడు. ఆ సమయంలో ఆయన కిందపడిపోయాడు. అలికిడి విన్న శిద్దా గన్‌మన్ అప్రమత్తమయ్యారు. ఆయన కేకలు వేయడంతో ఇరువురు ఆగంతుకులు తిరిగి గోడ దూకి పరారయ్యారు. ఈ దృశ్యాలన్నీ సీసీ ఫుటేజీలో కనిపించాయి. ఇదంతా జరుగుతున్న సమయంలో శిద్దా దంపతులు ఇంట్లోనే ఉన్నారు. విషయం తెలుసుకున్న వారు భయాందోళనకు గురయ్యారు. కొన్నేళ్ల క్రితం కూడా చీమకుర్తిలోని శిద్దా ఇంట్లో చోరీ జరిగింది. మరలా ఒంగోలులోని ఆయన నివాసంలోకి ఇద్దరు ఆగంతుకులు కత్తులతో ప్రవేశించడం చర్చనీయాంశమైంది. వారు దొంగతనం కోసం వచ్చారా? ఏదైనా ఆఘాయిత్యానికి పాల్పడటానికి వచ్చారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.


వాచ్‌మన్‌పై దాడి చేస్తున్న ఆగంతకులు

రంగంలోకి పోలీసులు

మాజీ మంత్రి శిద్దా ఇంట్లో దోపిడీయత్నం గురించి సమాచారం అందుకున్న పోలీసులు రంగంలోకి దిగారు. అదనపు ఎస్పీ (క్రైమ్స్) ఎస్.వి.శ్రీధర్‌రావు, ఒంగోలు వన్‌టౌన్ సీఐ లక్ష్మణ్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సీసీ ఫుటేజీని చూశారు. అనంతరం విచారణ ప్రారంభించారు. ఆగంతుకులు ఎటువైపు నుంచి వచ్చారు? ఎటువైపు నుంచి వెళ్లారు? వాహనం వినియోగించారా? అన్నదానిపై దృష్టి సారించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ (క్రైమ్స్) శ్రీధర్‌రావు విలేకరులతో మాట్లాడుతూ సీసీ ఫుటేజీతోపాటు, వేలిముద్రల ఆధారంగా కేసును దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. ఆగంతుకులు ముఖాలకు మాస్కులు వేసుకొని, కత్తులు చేతబట్టి ఉన్నట్లు గుర్తించామన్నారు. వారిని త్వరలోనే పట్టుకుంటామన్నారు.

అంగన్‌వాడీలకు ఎన్నికల విధులు

- జిల్లాలో పోలింగ్ సిబ్బంది కొరత
- అవసరానికంటే 1,100 మంది తక్కువ
- కార్యకర్తలు, కాంట్రాక్టు ఉద్యోగుల నియామకం
- వారి కోసం పోస్టల్ బ్యాలెట్ గడువు కూడా పెంపు

ఒంగోలు (కలెక్టరేట్), ఏప్రిల్ 27 : సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొనే పోలింగ్ సిబ్బంది (ఓపీఎస్) కొరత ఏర్పడింది. ఇప్పటికే ఈ బాధ్యతల్లో నియమితులైన వారికి మొదటి విడత శిక్షణ కూడా పూర్తి చేశారు. వీరిలో పలువురు వివిధ కారణాల వల్ల ఎన్నికల విధుల్లో ఉండలేమని విన్నవిస్తూ లేఖలు రాశారు. మరికొంత మంది అనారోగ్య సమస్యలు ఉన్నందున తమకు మినహాయింపు ఇవ్వాలని ఉన్నతాధికారులను కలిసి వేడుకున్నారు. దీంతో పోలింగ్ సిబ్బంది కొరత ఏర్పడింది. దీన్ని అధిగమించేందుకు ఈసీ జిల్లా ఎన్నికల అధికారులకు కీలక ఆదేశాలు ఇచ్చింది. అంగన్‌వాడీ కార్యకర్తలతోపాటు కాంట్రాక్టు ఉద్యోగుల సేవలను అవసరమైన ప్రాంతాల్లో ఎన్నికల విధులకు వినియోగించుకోవాలని సూచించింది. తదనుగుణంగా జిల్లా అధికారులు చర్యలు చేపట్టారు. ఎన్నికల నిర్వహణ కోసం అవసరమైన సిబ్బందిలో 1,100 మంది తక్కువగా ఉన్నట్లు సమాచారం. దీంతో అంగన్‌వాడీ కార్యకర్తలు, కాంట్రాక్టు ఉద్యోగులను పోలింగ్ విధులకు నియమించినట్లు తెలిసింది. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం గడువును కూడా పెంచుతూ ఈసీ ఉత్తర్వులు ఇచ్చింది. తొలుత ప్రకటించిన ప్రకారం ఈనెల 26వతేదీతో పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు గడువు ముగిసింది. సిబ్బంది కొరత నేపథ్యంలో కొత్తవారిని నియమించాల్సి రావడంతో వచ్చేనెల 1వతేదీ వరకు గడువు పెంచింది. ఎన్నికల విధులకు నియమితులైన అంగన్‌వాడీ కార్యకర్తలు, కాంట్రాక్టు ఉద్యోగులు నియోజకవర్గ కేంద్రాల్లోని రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో పోస్టల్ బ్యాలెట్ల కోసం దరఖాస్తులు చేసుకుంటున్నారు.


పోస్టల్ బ్యాలెట్ కోసం పేర్లు నమోదు చేసుకునేందుకు ఒంగోలు ఆర్డీవో కార్యాలయానికి వచ్చిన అంగన్‌వాడీలు

సైకతం.. చైతన్యం..

కొత్తపట్నం (ఒంగోలు నగరం), ఏప్రిల్ 27 : ఓటు ఎంతో ప్రాధాన్యమైనదంటూ తీర్చిదిద్దిన సైకతశిల్పం అందరినీ ఆలోచింపజేసింది. శనివారం కొత్తపట్నం మండలం పల్లెపాలెంలో ఏర్పాటు చేసిన ఓటర్ల అవగాహన సదస్సులో భాగంగా బీచ్‌లో ఏర్పాటు చేసిన సైకత శిల్పం, సెల్ఫీ పాయింట్, మత్స్యకారుల బోట్లతో ఏర్పాటు చేసిన స్వీప్ ప్రదర్శన ఆకట్టుకుంది. ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దినేష్‌కుమార్ ఓటుహక్కును అందరూ వినియోగించుకునే విధంగా ప్రతిజ్ఞ చేయించారు. సైకత శిల్పం వద్ద బెలూన్లు ఎగురవేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ శౌర్యమన్, స్వీప్ జిల్లా నోడల్ ఆఫీసర్ బి.రవి, ఒంగోలు ఆర్డీవో జి.వి.సుబ్బారెడ్డి పాల్గొన్నారు.





టీజేఆర్ అవినీతిపై చర్చకు సిద్ధం

● రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ రవి

ఒంగోలు(క్రైం), ఏప్రిల్27: సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్.సుధాకర్‌బాబు అవినీతిపై ఎక్కడైనా చర్చకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ దాసరి రవి సవాల్ విసిరారు. ఒంగోలులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీసీసీ చీఫ్ షర్మిలారెడ్డిపై అనుచిత వ్యాఖలు చేసిన ఎమ్మెల్యే సుధాకర్‌బాబు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. చీమకుర్తి మునిసిపాలిటీలో 20 మంది బినామీ పేర్లతో లక్షల రూపాయలు డ్రా చేసిన విషయంపై చర్చకు సిద్ధమన్నారు. గ్రానైట్ లారీ యజమానల వద్ద రూ.5వేల చొప్పన తీసుకున్న సుధాకర్‌బాబు రామతీర్థం గుడి వద్ద చర్చకు వస్తారా అని ప్రశ్నించారు. అవినీతిపరుడైన సుధాకర్‌బాబు, తమ నాయకురాలిని విమర్శించడం సిగ్గు చేటని హితవు పలికారు.

నేడు మాగుంట కార్యక్రమాలు

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 27 : టీడీపీ కూటమి ఒంగోలు లోక్‌సభ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి ఆదివారం నగరంలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఉదయం 8గంటలకు మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. 9 గంటలకు వెంగముక్కలపాలెంలో ఇలవల లింగారెడ్డి ఆధ్వర్యంలో జరిగే ఆత్మీయ సమావేశంలోను, పది గంటలకు గొర్రెపాటి అర్జునరావు ఇంటి వద్ద జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం ఐదు గంటలకు ఆస్టోనా ఫంక్షన్‌హాలులో న్యాయవాదులతో జరిగే ఆత్మీయ సమావేశానికి మాగుం హాజరవుతారు. రాత్రి ఏడు గంటలకు సీఆర్పీ క్వార్టర్స్ సమీపంలోని దర్గా సెంటర్‌లో అన్నవరప్పాడు రైల్వే గుడిసెవాసుల అసోసియేషన్ సభ్యులతో జరిగే సమావేశంలో పాల్గొంటారు.

39 బాటిళ్ల మద్యం పట్టివేత

ఒంగోలు(క్రైం), ఏప్రిల్ 27: పోలీసులు వాహన తనిఖీలలో భాగంగా 35 క్వార్టర్ బాటిళ్ళు, నాలుగు ఫుల్ బాటిళ్ళ మద్యం స్వాధీనం చేసుకొని ఇరువురిని అదుపులోకి తీసుకున్నారు. శనివారం ఒంగోలు వన్‌టౌన్ సీఐ లక్ష్మణ్ తన సిబ్బందితో స్థానిక బండ్లమిట్ట సెంటర్‌లో తనిఖీలు చేస్తుండగా టంగుటూరు వాజీనగర్‌కు చెందిన బిళ్ళా అనీల్‌కుమార్, బిళ్ళా మనోజ్ కుమార్‌ల వద్ద మద్యం బాటిళ్ళు ఉన్నట్లు గుర్తించి వారిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

ఇంజినీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య

ఒంగోలు(క్రైం), ఏప్రిల్ 27: పరీక్షలలో ఫెయిల్ అయినందుకు మనస్తాపం చెందిన ఓ ఇంజినీరింగ్ విద్యార్థిని ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన ఒంగోలు నగరం గొడుగుపాలెంలో జరిగింది. ఇంజనీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్న షేక్ ఆరీఫా సుల్తానా (19) ఇంట్లో తల్లిదండ్రులు లేని సమయంలో శుక్రవారం రాత్రి ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ మేరకు ఆమె తల్లి రేహనా సుల్తానా వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆరీఫాసుల్తాన మొదటి సంవత్సరానికి సంబంధించి రెండు సబ్జెక్టుల్లో ఫెయిల్ కావడంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేసవి భత్యం ఏదీ..?

● ఉపాధి కూలీల ఆవేదన

మద్దిపాడు, ఏప్రిల్ 27: ఉపాధి కూలీల పరిస్థితి రోజురోజుకు దయనీయంగా మారుతోంది. ఏటా ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి కొత్త వేతనాలు అమలు చేస్తూ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. అయితే రెండేళ్లుగా వేసవి భత్యాలు నిలిపివేసింది. ఫిబ్రవరిలో 20, మార్చిలో 25, ఏప్రిల్, మేలో 30, జూన్‌లో 20 శాతం అదనంగా అందేది. రెండేళ్ల కిందట కేంద్ర ప్రభుత్వం కొత్త సాఫ్‌వేర్‌ను అమల్లోకి తెచ్చింది. అందులో వేసవి భత్యానికి సంబంధించిన వివరాలు పొందుపరచకపోవటంతో అప్పటి నుంచి అదనపు భత్యం నిలిచిందని అధికారులు చెబుతున్నారు. ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డులు ఉన్న ప్రతి కూలీకి గతంలో పని ప్రదేశంలో ఎండ వేడిమి తట్టుకునేందుకు టెంట్లు ఏర్పాటు చేసి, తాగునీటి సౌకర్యం కల్పించేవారు. అనారోగ్యానికి గురైతే ప్రథమ చికిత్స చేసి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేసేవారు. వేసవిభత్యం కింద అదనపు కూలి అందజేయటానికి ఒకరిని నియమించే వారు. అయితే ప్రస్తుతం ఈ విధానానాకి స్వస్తి పలికారు. వ్యవసాయ భవన నిర్మాణ పనులకు వెళితే రూ.500 రూ.600 వస్తుందని, ఉపాధి హామీ పనికి తగిన వేతనం అందడం లేదని కూలీలు వాపోతున్నారు. పనులు చేసిన చోట నీడ కోసం ఏర్పాటు చేసిన టెంట్లు కొన్ని పనికిరాకుండా పోయాయి. వాటి మంజూరుకు ఇంకా మార్గదర్శకాలు వెలువడలేదు.

మద్యం అక్రమ అమ్మకాలపై దాడులు

పొదిలి, ఏప్రిల్ 27 : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పొదిలి సెబ్ స్టేషన్ పరిధిలో అక్రమ మద్యం అమ్మకాలపై శుక్రవారం దాడులు నిర్వహించినట్లు ఎస్ఈబీ సీఐ ఈశ్వరరావు తెలిపారు. ఈ దాడుల్లో హనుమంతునిపాడు మండలానికి చెందిన చిన్న ఉమ్మనపల్లి గ్రామంలో 25మద్యం సీసాలు కలిగిన ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించారు. ప్రభుత్వ మద్యం దుకాణంలో పనిచేస్తున్న సూపర్‌వైజర్, సేల్స్‌మేనేజర్‌లు సీసాపై రూ.10 అదనంగా తీసుకొని మద్యం సీసాలు సరఫరా చేశారని తెలిపారు. దీంతో వారు ఇరువురిని అదుపులోకి తీసుకొని ముగ్గురిపై కేసునమోదు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా పొదిలి ఎస్ఈబీ పరిధిలోని మర్రిపూడి మండలం కూచిపూడి గ్రామానికి చెందిన వ్యక్తి వద్ద 75 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. వారిని విచారించగా పొదిలి పరిధిలో ప్రభుత్వ దుకాణంలో సేల్స్‌మెన్ బాటిల్‌పై రూ.10 అదనంగా తీసుకొని సీసాలు ఇచ్చారని తెలిపారు. దీంతో సేల్స్‌మెన్‌ను అదుపులోకి తీసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మొత్తం 100 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో ఎవరు అక్రమంగా మద్యం అమ్మకాలు చేయవద్దని ఆయన సూచించారు. దాడుల్లో డీటీఎఫ్ ఎస్ఐ ఏ శ్రీనివాసరావు, సిబ్బంది ఉన్నారు.

సేల్స్‌మన్‌పై కేసు

అద్దంకి: మండలంలోని కలవకూరు లో శనివారం ఎస్ఈబీ ఎస్ఐ సైమన్ ఆధ్వర్యంలో దాడులు చేయగా తన్నీరు బ్రహ్మయ్య వద్ద 128 మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయి. ఈ బాటిళ్లను పల్నాడు జిల్లా కాకానిలోని ప్రభుత్వ మద్యం దుకాణంలో సేల్స్‌మన్ బాబుల్‌రెడ్డి వద్ద కొనుగోలు చేసినట్లు చెప్పడంతో బ్రహ్మయ్యతో పాటు బాబుల్‌రెడ్డి లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఫిర్యాదులు చేసినా చర్యలేవి...!

పొదిలి, ఏప్రిల్ 27 : డ్వామాపీడీ శీనారెడ్డి అవినీతి అక్రమాలపై ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని పొదిలి పట్టణానికి చెందిన ఇనుగంటి రాజశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023లో అక్టోబర్ 20న మొదటిసారి కలెక్టర్ దినేష్‌కుమార్‌కు, 2024 మార్చి 4న జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అయినా వాటిపై ఎలాంటి స్పందన లేకపోవడంతో మరోసారి వాట్సాప్ మెసేజ్, ఫోన్ ద్వారా కూడా విచారించాలని కోరినట్లు తెలిపారు. ఈ క్రమంలో కలెక్టర్ స్పందించి విచారణ చేయిస్తానని చెప్పినట్లు రాజశేఖర్ చెప్పారు. మొదటి ఫిర్యాదు 7నెలలు, రెండవ ఫిర్యాదు 2నెలలు అయినా ఎలాంటి విచారణ చేయలేదన్నారు. చివరి ప్రయత్నంగా 2024 ఏప్రిల్ 20వ తేదీన ఐఏఎస్ తాడేపల్లి కె.కన్నబాబుకు, కలెక్టర్ దినేష్‌కుమార్‌కు, మెజిస్ట్రేట్ బి అర్జున్‌రావుకు, డ్వామా పీడీకి రిజిస్టర్ పోస్ట్‌ద్వారా శీనారెడ్డి అవినీతి అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు రాజశేఖర్ తెలిపారు. ఈ ఫిర్యాదులన్నిటిపైన 20 రోజుల్లో విచారణ చేపట్టకపోతే హైకోర్టును ఆశ్రయించనున్నట్లు తెలిపారు. పూర్వ డ్వామా పీడీ శీనారెడ్డి అవినీతిపై రిట్‌ఆఫ్ మాండమస్ పిటీషన్ దాఖలు చేస్తానని ఇనగంటి రాజశేఖర్ తెలిపారు.

విద్యుత్ తీగలు తెగిపడి గేదెలు మృతి

కొనకనమిట్ల, ఏప్రిల్ 27: విద్యుత్ తీగలు తెగిపడి ఏడు గేదెలు మృతిచెందిన ఘటన మండలంలోని ంబాపురం గ్రామ సమీప పొలాల్లో చోటుచేసుకొంది. విద్యుత్ వైర్లు తెగిపడి ఏడు గేదెలు మృత్యువాత పడ్డాయి. వివరాల్లోకి వెళితే అంబాపురం గ్రామ సమీప పొలాల్లో గేదెలు మేత మేస్తుండగా ఎండ వేడికి ప్రమాద వశాత్తు విద్యుత్ తీగలు తెగి గేదెలపై పడ్డాయి. దీంతో ఏడు గేదెలు మృతి చెందాయని బాధితులు చెప్పారు. గ్రామానికి చెందిన చెందిన పెరికే పుల్లయ్య 2 గేదెలు, పెరికే దానియేలు 2, సువార్తమ్మ, కొండయ్య, అబ్రహంలకు చెందిన ఒక్కోగేదె మృతిచెందింది. వీటి విలువ సుమారు రూ3లక్షలు ఉంటుందని బాధితులు వాపోయారు. విద్యుత్ అధికారులు తమకు ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని వారు కోరుతున్నారు. సమాచారం తెలుసుకున్న విద్యుత్ అధికారులు సంఘటన స్థలం చేరుకొని పరిశీలించి ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. బాధితుల వద్ద నుంచి వివరాలు సేకరించారు.

ఉపసంహరణలు నిల్

గిద్దలూరు, ఏప్రిల్ 27 : గిద్దలూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి తొలిరోజు ఉపసంహరణలు జరుగలేదు. మొత్తం 28 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా అందులో వివిధ కారణాలతో నలుగురి నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. దీంతో 24 మంది నామినేషన్లు సక్రమంగా ఉండగా తొలిరోజు శనివారం ఒకరు కూడా నామినేషన్లు ఉపసంహరించుకోలేదని రిటర్నింగ్ అధికారి నాగజ్యోతి తెలిపారు.

జగన్ మేనిఫెస్టో

పాత చింతకాయపచ్చడే..!

టీడీపీ కూటమి సంతనూతలపాడు అభ్యర్థి విజయ్‌కుమార్ ● గురువారెడ్డిపాలెంలో ఎన్నికల ప్రచారం



గురువారెడ్డిపాలెంలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్



పార్టీలోకి చేరిన ఇలపావులూరువాసులతో బీఎన్

సంతనూతలపాడు, ఏప్రిల్ 27: సీఎం జగన్‌రెడ్డి ప్రకటించిన మేనిఫెస్టో పాతచింతకాయపచ్చడేనని, ప్రజలు నమ్మరని టీడీపీ కూటమి అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. సంతనూతలపాడు మండలం గురువారెడ్డిపాలెంలో శనివారం రాత్రి జరిగిన ఎన్నికల ప్రచార సభలో పాల్గొని ప్రసంగించారు. జగన్‌ను ప్రజలు ఇక నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి ప్రజల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడతాయని అయన చెప్పారు. వైసీపీ నాయకుల ప్రలోభాలకు లొంగవద్దని, చంద్రబాబు వస్తే ప్రజల భవిష్యత్తుకు గ్యారంటీ ఉంటుందని బీఎన్ పేర్కొన్నారు. జగన్ ముఖ్యమంత్రి అయితే రాష్ట్రం అప్పుల ఊబిలో పూర్తిగా కూరుకుపోవడం ఖాయమన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసమైన టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని చెప్పారు. రెండు వారాల్లో ఎన్నికలు రాబోతున్నాయని, వైసీపీ మాయమాటలకు లొంగవద్దని ప్రజలకు సూచించారు. కూటమి అభ్యర్థినైన తనకు ఓటువేయాలని కోరారు. చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని, సైకిల్ గుర్తుపై వేసి తనను మరోసారి గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బాపట్ల ఎంపీ అభ్యర్థి తేనేటి కృష్ణప్రసాద్ భార్య తేనేటి శిరీష, టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, నాయకులు కె.శరత్, సుబ్బారెడ్డి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



అరుణోదయకాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

కాగా పేర్నమిట్ట 39వ డివిజన్ అరుణోదయకాలనీలోటీడీపీ కూటమి అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ గెలుపు కోసం శనివారం రాత్రి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, సుమతి, మన్సూర్, పురుషోత్తం, అజయ్, వెంకటకాశీ తదితరులు పాల్గొన్నారు.

30కుటుంబాలు టీడీపీలో చేరిక

చీమకుర్తి: మండలంలోని ఇలపావులూరు గ్రామానికి దాదాపు 30కుటుంబాలు వైసీపీని వీడి తెలుగుదేశంపార్టీలోకి చేరాయి. వీరందరికీ పార్టీ కండువా కప్పిన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి బీఎస్.విజయ్‌కుమార్ సాదరంగా స్వాగతం పలికారు. కూటమి అభ్యర్థుల గెలుపుకోసం కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యకర్తలకు అన్ని వేళలా అండగా నిలుస్తానని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తేనేటి శిరీష, గొట్టిపాటి రాఘవరావు, వేల్పుల శ్రీనివాసరావు, మణిమేల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

తెలుగుదేశం పార్టీ కూటమి ఒంగోలు అభ్యర్థి దామచర్ల ● హైదరాబాద్‌లో నివసిస్తున్న ఒంగోలువాసులతో ఆత్మీయ సమావేశం





సదస్సుకు హాజరైన ఒంగోలువాసులు, మాట్లాడుతున్న దామచర్ల జనార్దన్

ఒంగోలు(కార్పొరేషన్), ఏప్రిల్ 27 : ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నపుడు హైదరాబాద్‌ను అభివృద్ధి చేసిన ఘనత చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని, అలాగే విడిపోయిన ఆంధ్ర రాష్ట్రంలో అభివృద్ధి జరగాలన్నా, పరిశ్రమలు, ఐటీ రంగం విస్తరించాలంటే మరలా చంద్రబాబు ముఖ్యమంత్రిగా రావాల్సిన అవసరం ఉందని తెలుగుదేశం పార్టీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న ఒంగోలువాసులు కూకట్‌పల్లిలోని ఎస్‌కేఎస్ఆర్ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమాశానికి దామచర్ల ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ త్వరలో జరిగే ఎన్నికలు ఎంతో ప్రతిష్టాత్మకమైనవని చెప్పారు. అరాచక పాలనకు, అభివృద్ధికి మధ్య జరుగుతున్న పోటీలో అభివృద్ధి విజయం సాధించాలంటే టీడీపీని గెలిపించాలని కోరారు. ఒంగోలు నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపించడానికి అందరూ కృషి చేయలన్నారు. వచ్చే నెల 13న జరిగే ఎన్నికలలో హైదరాబాద్‌లో నివసిస్తున్న నియోజకవర్గ ప్రజలు తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. అక్కడి ప్రజలు, నిర్వాహకులు మాట్లాడుతూ తామంతా దామచర్ల వెంటనే ఉంటామని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం తామంతా కష్టపడి చేస్తామని తెలిపిన వారు, తప్పకుండా పోలింగ్‌కు హాజరై దామచర్లకు ఓటు వేసి గెలిపించుకుంటామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా దామచర్లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, దామచర్ల అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆటంకాలు లేకుండా ఎన్నికలు నిర్వహించాలి

● ఎన్నికల పరిశీలకులు

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 27: జిల్లాలో ఎలాంటి ఆటంకాలు లేకుండా ఎన్నికలు స్వేచ్ఛగా, సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎన్నికల పరిశీలకులు సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో శనివారం సాధారణ ఎన్నికల పరిశీలకులు అరవింద్‌కుమార్ చౌరాసియా, మయూర్ కె మెహతా, పోలీస్ అబ్జర్వర్ హసీబ్ ఉర్ రెహ్మాన్, వ్యయ పరిశీలకులు రోహిత్ ఇందోరా, సాతే సందీప్‌ప్రదీప్‌రావు, డ్యూక్ బిశ్వాస్‌లు అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. అంతకు ముందు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్‌లు జిల్లాలో ఎన్నికలు నిర్వహణకు చేపట్టిన అంశాలను వివరించారు. జిల్లాలో 2,183 పోలింగ్ కేంద్రాలు ఉండగా 486పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకమైనవిగా గుర్తించామన్నారు. అయినప్పటికి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలు ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకున్నామని దినేష్‌కుమార్ తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. అనంతరం పరిశీలకులు అరవింద్‌కుమార్ మాట్లాడుతూ స్ట్రాంగ్ రూముల వద్ద చేపట్టాల్సిన చర్యలలో ఎలాంటి లోపాలు లేకుండా చూసుకోవాలన్నారు. అగ్నిమాపక పరికరాలను పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచడంతో పాటు అవి సమర్థవంతంగా పనిచేసే స్థితిలో ఉంచకోవాలని చెప్పారు. అనంతరం అంశాల వారీగా దిశానిర్దేశం చే శారు. కార్యక్రమంలో ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ ఆఫీసర్లు ఆర్.గోపాలకృష్ణ, రాహుల్‌మీనా, ఏఎస్పీ నాగేశ్వరరావు డీఆర్వో శ్రీలత తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోలు రూమును వారు పరిశీలించారు. అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

మహిళ మెడలో బంగారు గొలుసు అపహరణ

బైక్‌పై అడ్డగించి చోరీకి పాల్పడిన దుండగులు ● గత నెలలో యువకుడిని కొట్టి దారి దోపిడీ ● వరుస ఘటనలతో ప్రజలు బెంబేలు

పర్చూరు, ఏప్రిల్ 27: ద్విచక్రవాహనంపై వస్తున్న దంపతులపై దాడిచేసి గాయపరిచి మహిళ మెడలో ఉన్న బంగారు గొలుసును అపహరించి పరారైన సంఘటన శుక్రవారం రాత్రి పర్చూరు-చీరాల అర్‌అండ్‌బీ రహదారిలో, స్థానిక పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో జరిగింది. బాధితులు తెలిపిన సమాచారం మేరకు పర్చూరుకు చెందిన గాదే రాజేష్ తన భార్యతో కలసి చీరాల నుంచి పర్చూరు వస్తుండగా ఇద్దరు యువకులు బైక్‌ను ఢీకొట్టి గాయపరిచి చోరీకి పాల్పడ్డారు. ఇదే రహదారిలో పర్చూరు నుంచి రెవెన్యూ కార్యాలయంలో విధులు ముగించుకొని కారంచేడు వైపు వెళుతున్న వీఆర్వోను అడ్డగించి అతని వద్ద ఉన్న సెల్‌ఫోన్‌తో దుండగులు పరారైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత నెలలలో వాడరేవు - పిడుగురాళ్ల రహదారిలోని స్థానిక దర్గా సమీపంలోని ఓ వెంచర్‌లో బహిర్భూమికి వెళ్లిన పర్చూరుకు చెందిన ఆకుల మధుబాబు అనే యువకుడునిపై దాడిచేసి గాయపరచి అతని వద్ద ఉన్న రూ.40వేల నగదు, సెల్‌ఫోన్‌తోపాటు, బైక్‌తో పరారయ్యారు. అదేరోజు రాత్రి వంట పని ముగించుకొని పర్చూరు నుంచి చిలకలూరిపేట వెళుతున్న దంపతులపై దాడిచేసి గాయపరిచి నగదుతో దుండగులు పరారయ్యారు. దీనికి సంబంధించి బాధితులు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వరుస దారి దోపిడీలతో ప్రజలు రాత్రి సమయాల్లో ప్రయాణాలు సాగించాలంటే ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సందట్లో సడేమియా...

ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసులు ఎన్నికల విధుల్లో ఉన్నారు. దీన్ని అదునుగా తీసుకున్న దుండగులు యధేచ్ఛగా చోరీలకు పాల్పడుతున్నారు. ఇలా దాడి చేసి గాయపరిచి చోరీలకు పాల్పడుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

రైతులకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలి

● జిల్లా వ్యవసాయశాఖాధికారి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న డీఏవో శ్రీనివాసరావు

పొదిలి, ఏప్రిల్ 27 : ఎరువులు, పురుగు మందులు, విత్తనాల దుకాణాల్లో రైతులు కొనుగోళ్లపై బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని జిల్లా వ్యవసాయశాఖధికారి ఎస్.శ్రీనివాసరావు సూచించారు. శనివారం పొదిలిలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో ఎరువుల దుణాల డీలర్లతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నకిలీవిత్తనాల విషయంలో డీలర్లు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డీలర్లకు ఎరువుల చట్టంలో వచ్చిన కొత్త విధివిధానాలను వివరించారు. రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలను విక్రయించాలని చెప్పారు. నకిలీ విత్తనాలు, బయో పురుగుమందులు విక్రయించినట్లు తెలిస్తే షాపు సీజ్ చేయడంతో పాటు చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. డీలర్లు నిర్వహించాల్సిన స్టాకురిజిస్టర్లు, బిల్లు పుస్తకాలు, ఇన్వాయిస్‌లు గురించి తెలిపారు. కార్యక్రమంలో దర్శి ఏడీఏ బాలజీనాయక్, టెక్నికల్ ఏవో ఎస్ శ్రీనివాసనాయక్, సాంకేతిక వ్యవసాయాధికారి రమేష్, ఏవోలు జైన్ లుబ్దీన్, ప్రసన్న లక్ష్మీ, లక్ష్మీనారాయణ, డీలర్లు పాల్గొన్నారు.

మసాచు సెట్స్ వర్సిటీ ఎన్నికలో పంగులూరు విద్యార్థి

● విద్యార్థి సంఘు అధ్యక్షునిగా ఎన్నిక



బాచిన రోహిత్‌శ్రీసాయి

పంగులూరు, ఏప్రిల్ 27 : అమెరికాలోని వర్సిటీలో జరిగిన ఇండయన్ విద్యార్థి సంఘ ఎన్నికలలో పంగులూరు విద్యార్థి బాచిన రోహిత్ శ్రీసాయి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. యూనివర్శిటీ ఆఫ్ మసాచుసెట్స్ లోవెల్ మసాచుసెట్స్ రాష్ట్రంలో ఉంది. అమెరికాలోని ఈ వర్సిటీలో నిర్వహించిన ఇండియన్ స్టూడెంట్స్ అసోషియేషన్ ఎన్నికలో 75 శాతం ఓట్లు సాధించి అధ్యక్షునిగా బాచిన రోహిత్ ఎంపికయ్యారు. రోహిత్ పంగులూరుకు చెందిన హైకోర్టు న్యాయవాది బాచిన హనుమంతరావు కుమారుడు. బాచిన హనమంతరావు ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ అడ్వకేట్‌గా ఏపీ హైకోర్టులో విధులు నిర్వహిస్తున్నారు. పంగులూరుకు చెందిన విద్యార్థి అమెరికా వర్సిటీ అధ్యక్షునిగా ఎంపికావడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

అవీ..ఇవీ..

ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు

● ఎస్ఈబీ సీఐ మారయ్యబాబు



కొలచనకోట రీచ్‌ను పరిశీలిస్తున్న సీఐ మారయ్యబాబు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మద్దిపాడు, ఏప్రిల్ 27: గుండ్లకమ్మ పరివాహక ప్రాంతంలో ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఈబీ సీఐ మారయ్యబాబు హెచ్చరించారు. శనివారం గుండ్లకమ్మ పరివాహక ప్రాంతంలోని మల్లవరం, కొలచనకోట ఇసుక రీచ్‌లను ఆయన పరిశీలించారు. గుండ్లకమ్మ ప్రాంతంలో ఇసుకను తరలిస్తే వారిపై కేసు నమోదు చేస్తామన్నారు. ఇక్కడ నుంచి ఇసుక తవ్వకాలకు అనుమతులు లేవని చెప్పారు. అక్రమంగా ఇసుకను తరలిస్తూ ట్రాక్టర్ పట్టుబడితే వాహనాన్ని సీజ్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్స్ షరీఫ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాలపై ప్రత్యేక నిఘా

మద్దిపాడు, ఏప్రిల్ 27: గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్ చెక్‌పోస్ట్ వద్ద జాతీయ రహదారిపై గట్టి నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్సై మహేష్ తెలిపారు. శనివారం ఆయన చెక్‌పోస్ట్ వద్ద పలు వాహనాను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో భాగంగా అక్రమంగా మద్యం, నగదు, బంగారు ఆభరణాలు సరఫరా చేయకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రాజకీయ నాయకులు ఓటర్లను ప్రలోభ పెట్టకుండా అవసరమైన కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామన్నారు.

బ్రాహ్మణ ఆత్మీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఒంగోలు(కల్చరల్), ఏప్రిల్ 27: తెలుగుదేశం పార్టీకి మద్దతుగా మే 3వ తేదీన ఒంగోలులో నిర్వహించనున్న బ్రాహ్మణ ఆత్మీయ సదస్సు పోస్టర్‌ను శనివారం పలువురు బ్రాహ్మణ నాయకులు ఆవిష్కరించారు. స్థానిక లాయర్‌పేటలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ బ్రాహ్మణ సంఘటన రాష్ట్ర నాయకులు టీవీ.శ్రీరామమూర్తి మాట్లాడుతూ మే 3న ఉదయం 10 గంటల నుంచి స్థానిక గోల్డ్ మర్చంట్స్ అసోసియేషన్ హాలులో జరిగే ఆత్మీయ సదస్సులో జిల్లాలోని బ్రాహ్మణులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. టీడీపీ నాయకురాలు కామరాజుగడ్డ కుసుమకుమారి మాట్లాడుతూ తెలుగుదేశం హయంలోనే బ్రాహ్మణులకు అన్ని విధాల మేలు జరిగిందని, కనుక బ్రాహ్మణులు సదస్సుకు హాజరై మద్దతు తెలపాలన్నారు. కార్యక్రమంలో వ్యామజాల ప్రసన్నకుమార్‌శర్మ, గంజాం శ్రీరంగనాథ్, ధేనువకొండ వెంకటసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మ్యూజిక్ ప్లాజా సంగీత విభావరి

ఒంగోలు(కల్చరల్), ఏప్రిల్ 27: బీఏఎస్‌కేఆర్ మ్యూజిక్ ప్లాజా ఆధ్వర్యంలో ఆదివారం సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు సంస్థ నిర్వాహకులు బాలాజీ, అశోక్, స్వర్ణలత, కోటీ, రంగాలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలులోని తాతా బిల్డింగ్స్ ఎదురుగా ఉన్న మ్యూజిక్ ప్లాజా భవనంలో మధ్యాహ్నం ఒంటిగంట నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో దాదాపు 30 మంది గాయకులు పాల్గొంటారన్నారు. ఒంగోలుకు చెందిన వారే కాకుండా జిల్లాలోని వివిధ ప్రాంతాలు, నెల్లూరు జిల్లా నుంచి కూడా అనేకమంది గాయకులు హాజరయ్యే ఈ కార్యక్రమంలో సంగీతాభిమానులు పాల్గొనాలని వారు కోరారు.

పేస్‌లో ట్రామాపై అవగాహన సదస్సు



విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 27: ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో ట్రామా అండ్ ఎమర్జెన్సీపై ఇంజనీరింగ్ విద్యార్థులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఆస్టర్ రమేష్ హాస్పటల్ డాక్టర్ సీహెచ్.శ్రీవాణి సీపీఆర్ గురించి విద్యార్థులకు వివరించారు. కార్డియాక్ అరెస్ట్‌లో సీపీఆర్‌తో బ్రెయిన్, శరీరంలోని ముఖ్య అవయవాలకు రక్తప్రసరణ కొనసాగించవచ్చన్నారు. మన పరిసరాల్లో ఎవరైనా అత్యవసర పరిస్థితుల్లో ఉంటే సీపీఆర్ ఎలా చేయాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, డీన్ వీరాంజనేయులు, ఏవో రమణబాబు, హెల్త్ వాచ్ కో ఆర్డినేటర్ బ్రహ్మం పాల్గొన్నారు.


4లోపు రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులు

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 27: ఒంగోలు ఆంధ్రకేసరి యూనివర్సిటీ పరిధిలోని వ్యాయామ విద్యా కళాశాలల్లో చదువుతున్న బీపీఈడీ, డీపీఈడీ ప్రథమ సంవత్సరం మొదటి సెమిస్టర్ ఫలితాల్లో ఫెయిలైన విద్యార్థులు వచ్చేనెల 4వ తేదీలోపు రీవాల్యువేషన్, పర్సనల్ వెరిఫికేషన్, జవాబుపత్రాల జెరాక్స్ కోసం దరఖాస్తులు చేసుకోవాలని యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి కేఎస్.రాజు శనివారం ఓ ప్రకటనలో కోరారు. రీవాల్యువేషన్, పర్సనల్ వెరిఫికేషన్‌కు ఒక్కొక్క పేపర్‌కు రూ.1,248, జవాబుపత్రాల జెరాక్స్ కోసం ఒక్కొ పేపర్‌కు రూ.1,700 చెల్లించాలి. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రశాంతంగా పాలిసెట్

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 27: ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో వివిధ డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన పాలిసెట్ ప్రవేశపరీక్ష శనివారం ప్రశాంతంగా ముగిసింది. ఒంగోలులో ఎనిమిది, మార్కాపురంలో నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరిగింది. ఉదయం పది గంటల నుంచి విద్యార్థులను పరీక్ష హాలులోకి అనుతించారు. పాలిసెట్ పరీక్షకు 4,930 మంది దరఖాస్తు చేయగా 4,235 మంది పరీక్షకు హాజరయ్యారు. కాగా మొత్తం 85.9శాతం మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు ఒంగోలు ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ శివప్రసాద్ తెలిపారు.


క్విస్‌లో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 27: ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో స్థానిక రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. సుమారు 50 మంది అధ్యాపకులు, విద్యార్థులు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారిని కళాశాల ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి సూర్యకళ్యాణ్‌చక్రవర్తి, వైస్‌ఛైర్మన్ డాక్టర్ ఎన్.శ్రీగాయత్రి, ప్రిన్సిపాల్ వైవీ.హనుమంతరావు అభినందించారు.

చెక్‌పోస్ట్‌ను పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

నాగులుప్పలపాడు ఏప్రిల్ 27: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా నాగులుప్పలపాడులోని వ్యవసాయ మార్కెట్ కమిటీ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను శనివారం తహసీల్దార్ అద్దేటి శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆయన సూచించారు. విధుల్లో అలసత్వం వహిస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్ఐ ప్రమోద్, రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల విధులపై శిక్షణ

నాగులుప్పలపాడు ఏప్రిల్ 27: ఉప్పుగుండూరులో శనివారం ఎన్నికల విధుల నిర్వహణపై అదనపు పోలింగ్ అధికారులకు మాస్టర్ ట్రైనర్స్ గుండ్లాపల్లి సూర్యనారాయణ, నాయుడు శ్రీనివాసులు, చుండూరి రఘుబాబు, శంకరరావు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో మహాలక్ష్మి, ఎంఈవో ఈమని రమణయ్య తదితరులు పాల్గొన్నారు.


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న దామచర్ల సత్య

బాలకృష్ణ పర్యటనను విజయవంతం చేయాలి

టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య

మర్రిపూడి, ఏప్రిల్ 27 : యువరత్న నందమూరి బాలకృష్ణ పర్యటన మర్రిపూడి చరిత్రలో నభూతో నభవిష్యత్‌లా ఉండేవిధంగా పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య పిలుపునిచ్చారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో నియంతపాలనకు అంతం పలికేందుకు ఓటర్లు ఎదురు చూస్తున్నారని చెప్పారు. జగనాసుర పరిపాలనకు చరమగీతం పాడాలని ఆయన పిలుపు నిచ్చారు. ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు హిందూపురం శాసనసభ్యులు బాలకృష్ణ మర్రిపూడికి రావడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సభకు దీటుగా బాలకృష్ణ పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. గ్రామగ్రామాన టీడీపీ శ్రేణులు జాతరలో పాల్గొనేందుకు వచ్చే విధంగా తరలిరావాలన్నారు. మండలస్థాయి నాయకులు అన్ని గ్రామాల్లో పర్యటించి పార్టీ శ్రేణులను సమాయత్తం చేయాలని కోరారు. ఎన్డీఏ తరుపున ఒంగోలు పార్లమెంటుకు పోటీచేస్తున్న మాగుంట శ్రీనివాసులరెడ్డి, కొండపి శాసనసభ అభ్యర్థి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామితోపాటు టీడీపీ అగ్ర నేతలు పాల్గొంటారని వెల్లడించారు. అంతకు ముందు పృథులగిరి రహదారి పక్కనే హెలిప్యాడ్ ఏర్పాటు చేసే స్థలాన్ని ఆయన పరిశీలించారు. బస్టాండ్ కూడలిలో రోడ్‌షో ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని నాయకులను కోరారు. సమావేశంలో తెలుగురైతు రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి యర్రమోతు శ్రీనివాసులు, టీడీపీ మండ అధ్యక్షుడు చేరెడ్డి నర్సారెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త రేగుల వీరనారాయణ, జడ్పీటీసీ మాజీ సభ్యులు తుళ్ళూరి నరసింహారావ్, మండలపరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు గొంటు హనుమారెడ్డి, టీడీపీ నాయకులు బంగారయ్య, చేరెడ్డి నర్సారెడ్డి, వై. వెంకటరెడ్డి, సారెడ్డి యోగిరెడ్డి, బూదాల యోసుదాస్ తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరు పొగాకు కిలో గరిష్ఠ ధర రూ. 292

టంగుటూరు, ఏప్రిల్ 27 : టంగుటూరు పొగాకు వేలం కేంద్రంలో శనివారం జరిగిన వేలంలో మేలురకం పొగాకు గరిష్ఠ ధర రూ. 292 పలికింది. వేలం కేంద్రానికి మల్లవరప్పాడు, శివపురం, గొర్లమిట్ట, మట్టిపాడు రైతులు 926 పొగాకు బేళ్లను వేలంకు అనుమతించారు. ఇందులో 827 బేళ్లు కొనుగోలు జరుగగా మిగిలిన బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. ఆబేళ్లలో 42 బేళ్లు ఎన్‌బీ కాగా 7 బేళ్లు ఆర్‌ఆర్ అయ్యాయి. 39 బేళ్లు సీఆర్ అయ్యాయి. జరిగిన వేలంలో గరిష్ఠ ధర రూ.292 కాగా కనిష్ఠ ధర రూ. 218 రైతులకు దక్కింది. సరాసరి ధర రూ. 252.99 లభించింది. కొనుగోళ్లలో 17 కంపెనీల వ్యాపారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్

ముస్లింల సంక్షేమాన్ని విస్మరించిన జగన్

● **శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్**

కనిగిరి, ఏప్రిల్ 27: ఐదేళ్ల పాలనలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింల సంక్షేమాన్ని గాలికొదిలేశారని శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్ అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో శనివారం రాత్రి జరిగిన ముస్లింల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్నికలు ఇంకా పక్షం రోజులు మాత్రమే ఉన్నాయన్నారు. వైసీపీ సైకో పాలనను సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో ముస్లింలపై దాడులు, అత్యాచారాలు, హత్యలు పెరిగిపోయాయన్నారు. అందుకు మిస్బాలాంటి ముక్కుపచ్చలారని చిన్నారి ఆత్మహత్య ఓ నిదర్శనమని ఆవేదన వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వంపై ముస్లిం కుటుంబాలు అపోహలకు పోవద్దన్నారు. నాలుగు శాతం రిజర్వేషన్ ముస్లింలకు ఎత్తివేస్తారనే తప్పుడు సమాచారాలను ప్రచారం చేస్తున్న వైసీపీ కుయుక్తులను తిప్పికొట్టాలన్నారు. అలాంటి నిర్ణయం మోదీ ఎప్పుడూ తీసుకోబోరన్నారు. చంద్రబాబు పాలనలో ముస్లిం సంక్షేమం కోసం దాదాపు 45వేల మంది ముస్లిం కుటుంబాల ఆర్థిక పురోగతికి రుణాలు ఇప్పించిన విషయాన్ని గుర్తు చేశాడు. జగన్ అధికారంలోకి రాకముందు ఇస్లామిక్ బ్యాంకు ఏర్పాటు చేస్తామని చెప్పి మోసం చేశారన్నారు. దుల్హన్ పథకాన్ని తుంగలో తొక్కి అడ్డమైన నిబంధనలను పెట్టారన్నారు. జగన్ పాలనలో ముస్లిం సంక్షేమానికి ఒక్క పైసా కూడా ఇవ్వలేదన్నారు. పాలనాదక్షత కల్గిన నేత చంద్రబాబు అని, ఆయన లాంటి వ్యక్తిని సీఎంగా చేసుకోకపోతే రాష్ట్రాన్ని బాగుచేయటం ఎవరివల్లా కాదని షరీఫ్ పేర్కొన్నారు. మంచి వ్యక్తిత్వం, రాష్ట్రం, ప్రజల ఉజ్వల భవిష్యత్తుకై అనునిత్యం తపనపడే జనసేనాని పవన్‌కల్యాణ్, చంద్రబాబు కలయిక ఓ చరిత్ర అన్నారు. చంద్రబాబుకు ఓ కన్ను ముస్లిం అయితే, మరో కన్ను హిందువు అన్నారు. అలాంటి వ్యక్తిపై జగన్ తప్పుడు కేసులు బనాయించి 53 రోజులు జైలులో ఉంచారని అన్నారు. జగన్‌ను ప్రజలు నమ్మితే నట్టేట్లో మునిగినట్లేనని చెప్పారు. ముస్లింలకు ఎప్పుడూ అండగా ఉండేది చంద్రబాబు ఒక్కరే అని అన్నారు. ఆయనను ముస్లిం కుటుంబాలు నమ్మాలని కోరారు. చంద్రబాబు సీఎం కావాలంటే ఎంపీ అభ్యర్థిగా మాగుంట శ్రీనివాసులరెడ్డిని, ఎమ్మెల్యే అభ్యర్థిగా డాక్టర్ ఉగ్రను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. తొలుత షరీఫ్‌ను ఎంపీ మాగుంట, డాక్టర్ ఉగ్ర ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ రాష్ట్ర నాయకులు రోషన్‌సంధాని, జంషీర్, గుడిపాటి ఖాదర్, అహ్మద్, ఫిరోజ్, నజీముద్దీన్, షరీఫ్, బడేబాయి, ఫారూక్, తెలుగుమహిళలు షేక్ వాజిదాబేగం, సమీరా, ఫాతిమా, జనసేన నాయకులు రహీముల్లా, తదితరులు పాల్గొన్నారు.

ఆగిన సాగర్ జలాలు

మార్టూరు, ఏప్రిల్ 27 : రెండవ దఫా వచ్చిన సాగర్ జలాలు శుక్రవారం రాత్రితో ఆగిపోయాయి. కోనంకి సబ్ డివిజన్ పరిధిలో మార్టూరు, పర్చూరు, కారంచేడు, యద్దనపూడి, ఇంకొల్లు మండలాల్లో 68 మంచి నీటి చెరువులు ఉండగా, వాటిలో 58 చెరువులకు నీళ్లు చేరినట్లు ఎన్నెస్పీ అధికారులు చెప్తున్నారు. వాస్తవంగా మొదటి దఫా సాగర్ జలాలు వచ్చినపుడు కేవలం రెండు మూడు రోజులు మాత్రమే సాగర్ జలాలు వచ్చాయి. దాంతో కోనంకి సబ్ డివిజన్ పరిధిలోని చాలా చెరువులకు నీళ్లు చేరలేదు. ఈ నెల 21 నుంచి రెండవ దఫా సాగర్ జలాలు చేరడంతో చాలా చెరువులకు నీళ్లు చేరినట్లు అధికారులు చెప్తున్నారు. చెరువులకు పూర్తి స్థాయిలో కాకపోయినప్పటికీ ప్రతి చెరువుకు ఎంతో కొంత సాగర్ జలాలు చేరినట్లు అధికారులు తెలిపారు. మార్టూరు మండలంలో మేజర్ పంచాయతీ మార్టూరు చెరువుకు మాత్రం 50 శాతం సాగర్ జలాలు చేరాయి. దాంతో ఈ వేసవి కాలంలో జూన్ వరకు గ్రామంలో తాగునీటికి ఇబ్బంది ఉండదని పంచాయతీ అధికారులు చెప్తున్నారు.

ఎస్సీ, బీసీల పథకాలకు కోత- అభివృద్ధికి వాత

వైసీపీ పాలనపై స్వామి విమర్శలు

ప్రచారంలో అడుగడుగునా స్పందన

30 కుటుంబాలు టీడీపీలో చేరిక


చిర్రికూరపాడు ప్రచారంలో ఓట్లను అభ్యర్థిస్తున్న స్వామి

జరుగుమల్లి (కొండపి), ఏప్రిల్ 27: ఒక్కసారి అవకాశం కావాలని అడిగిన సీఎం జగన్ ఎస్సీ బీసీ సంక్షేమ పథకాలకు పూర్తిగా కోతేసి, రాష్ట్రాభివృద్ధికి వాతేశాడని కొండపి ఎమ్మెల్యే, కూటమి బలపరుస్తున్న టీడీపీ కొండపి నియోజకవర్గ అభ్యర్థి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా స్వామి శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు మండలంలోని చిర్రికూరపాడు, నర్సింగోలు, రామచంద్రాపురం, పైడిపాడు, అక్కచెరువుపాలెం, రెడ్డిపాలెం, చతుకుపాడు, కామేపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి ప్రచార వాహనంపై నుంచి మాట్లాడుతూ వందకు పైగా ఎస్సీ సంక్షేమ పథకాలను వైసీపీప్రభుత్వం రద్దు చేసిందని విమర్శించారు. మునుపెన్నడూ లేని విధంగా బీసీలు, మైనార్టీలపై వైసీపీ ప్రభుత్వంలో దాడులు పెరిగాయని స్వామి విమర్శించారు. అదేవిధంగా వైసీపీ ఐదేళ్ల పాలనలో గ్రామాలను పాడుబెట్టేశారని, ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేయలేదని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు, మహిళా, బీసీ, ఎస్సీ, మైనార్టీల సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతాయని స్వామి అన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని స్వామి అన్నారు. కొండపి నియోజకవర్గ అభివృద్ధిలో పెద్దాయన దామచర్ల ఆంజనేయులు పాత్ర ఎనలేనిదన్నారు. ఆయన చూపిన మార్గంలో కొండపి అభివృద్ధిని తాను కొనసాగిస్తున్నానని స్వామి అన్నారు.

భారీ చేరికలు...

ఎన్నికల ప్రచారంలో స్వామి సమక్షంలో పలు గ్రామాల నుంచి భారీగా వైసీపీని వీడి ప్రజలు చేరారు. చిర్రికూరపాడు, నర్సింగోలు, రామచంద్రాపురం గ్రామాల్లో 30 కుటుంబాలు టీడీపీలో చేరాయి. స్వామి వారందరికీ పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. నర్సింగోలు గ్రామంలో గోన లాబాను, గోన సుశీల, పాలేటి రూబెన్, పాలేటి ఆమోస్, ఎండ్లూరి నాగరాజు, ఏజర్ల వెంకటేశ్వర్లు కుటుంబాలతోపాటు మరో పది కుటుంబాల వారు, రామచంద్రాపురంలో నేతి రామకృష్ణ, నేతి నారాయణ, నేతి రవిబాబు, మాదినేని జనార్దన్, మాదినేని నరసింహారావు, తొట్టెంపూడి హరిబాబు, చెన్నారెడ్డి చిన్న నరసింహం, తొట్టెంపూడి మధులతోపాటు 15 కుటుంబాలు పార్టీలో చేరాయి. ప్రచారంలో భాగంగా చిర్రికూరపాడులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి స్వామి పూలమాల వేసి నివాళులర్పించారు. పలు గ్రామాల్లోని దివంగత ఎన్టీఆర్, దామచర్ల ఆంజనేయులు విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రచార కార్యక్రమంలో జనసేన నాయకులు కనపర్తి మనోజ్‌కుమార్, గూడా శశిభూషణ్, బీజేపీ నాయకుడు బాలకోటయ్య, పార్టీ మండల అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు, టీడీపీ సీనియర్ నాయకుడు పోటు పెదబాబు, మాజీ ఎంపీపీలు పోటు పద్మావతి, పేముల విజయనిర్మల, దాసరి వెంకటేశ్వర్లు, నాయకులు నంబూరి వీరరాఘవులు, గొర్రెపాటి మాధవ, రామారావు, గుండపనేని వెంకటేశ్వర్లు, ఆరికట్ల రమణయ్య, పాతూరి కోటేశ్వరరావు, రావి నాగేశ్వరరావు, కొమ్మాలపాటి కృష్ణ, కామేపల్లి మాజీ సర్పంచ్ ఏలూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


నర్సింగోలులో పార్టీలోకి వచ్చిన వారికి కండువా కప్పి చేర్చుకుంటున్న స్వామి

రేపటి నుంచి టంగుటూరు మండలంలో ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం

టంగుటూరు, ఏప్రిల్ 27 : టంగుటూరు మండలంలో ఈనెల 29 నుంచి మూడు రోజులు ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కామని విజయకుమార్ శనివారం తెలిపారు. తొలిరోజైన 29న ఉదయం 7.30 నుంచి 9.30 వరకు పొందూరు, ఉదయం 9.45 నుంచి 11.45వరకు ఎం నిడమలూరు, మధ్యాహ్నం 12గంటల నుంచి 2గంటల వరకు మర్లపాడులో ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. మధ్యాహ్నం లంచ్ ముగించుకొని 2.30 నుంచి సాయంత్రం 6.30వరకు కందులూరు, సాయంత్రం 6.30 నుంచి 7.30 వరకు మల్లవరప్పాడు, రాత్రి 7.30 నుంచి రాత్రి 10గంటల వరకు కారుమంచిలో ఎమ్మెల్యే ప్రచార కార్యక్రమం కొనసాగుతుంది. 30న మర్రిపూడిలో హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ పర్యటన ఉన్నందున మండలంలో ఎమ్మెల్యే ప్రచార కార్యక్రమానికి విరామం ప్రకటించారు. మే 1న ఆలకూరపాడులో ఉదయం 7.30 నుంచి 9.30 వరకు, అనంతవరంలో ఉదయం 9.30 నుంచి 10.45వరకు, తాళ్లపాలెం ఉదయం 11 గంటల నుంచి 12గంటల వరకు, వెలగపూడిలో మధ్యాహ్నం 12.15 నుంచి 1.30 వరకు ప్రచారం కొనసాగుతుంది. మధ్యాహ్నం లంచ్ ముగిశాక తిరిగి ప్రచారం ప్రారంభమవుతుంది. జయవరంలో సాయంత్రం 4.30 నుంచి 5.30 వరకు, కాకుటూరివారిపాలెంలో సాయంత్రం 5.30 నుంచి 7.30వరకు, జమ్ములపాలెంలో రాత్రి 7.45 నుంచి రాత్రి 10గంటల వరకు ఎమ్మెల్యే ప్రచారం కొనసాగుతుంది. మరుసటి రోజైన మే 2న వాసేపల్లిపాడులో ఉదయం 7.30 నుంచి 9.30 గంటల వరకు, వల్లూరులో ఉదయం 10 గంటల నుంచి 11.30 వరకు, సూరారెడ్డిపాలెంలో ఉదయం 11.45 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు ప్రచారం ఉంటుంది. మధ్యాహ్నం భోజనాలు ముగిశాక శివపురంలో సాయంత్రం 4.30 నుంచి 5.30 వరకు, కొణిజేడులో సాయంత్రం 6గంటల నుంచి రాత్రి 10గంటల వరకు ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం కొనసాగుతుంది. ఎమ్మెల్యేతోపాటుగా మండల పార్టీ పాలకవర్గం, ముఖ్యనాయకులు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని విజయకుమార్ వెల్లడించారు.

వైసీపీని వీడి టీడీపీ గూటికి..

ఎమ్మెల్యే స్వామి సమక్షంలో పార్టీలో చేరిక

సింగరాయకొండ, ఏప్రిల్ 27 : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ రోజురోజుకి సింగరాయకొండ మండలంలో టీడీపీలోకి వలసల పరంపర కొనసాగుతోంది. మండలంలోని పాకల గ్రామ వైసీపీకి చెందిన 20 కుటుంబాల వారు ఆపార్టీని వీడారు. టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలో శనివారం ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరా ంజనేయ స్వామి సమక్షంలో పార్టీలో చేరారు.

వారికి కండువాలు కప్పి సాదరంగా ఆయన పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలోకి వచ్చిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. పార్టీలో చేరిన వారిలో ఆళ్ల రమణారెడ్డి, ఉల్చి రామారావు, పిరకాల విజయ్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, షేక్ మస్తాన్‌బాషా, ఫయాజ్, వలి, శ్రీనుబాషా, చిన్న శ్రీను, పలు కుటుంబాల వారు ఉన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు గోళ్లమూడి శ్రీనివాసులరెడ్డి, బత్తుల రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.


కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే స్వామి

గ్రామాలను చుట్టేస్తున్న స్వామి

నామినేషన్ అనంతరం మరింత స్పీడ్

వారంలో మూడు మండలాల్లో పర్యటన

అంతకుముందే ఆత్మీయ సమావేశాలు పూర్తి

30న మర్రిపూడికి బాలకృష్ణ

కీలకంగా వ్యవహరిస్తున్న యువ నేత సత్య

తెరవెనుక వ్యూహంలో సీనియర్ నేత డీపీఆర్

కేడర్‌లో జోష్, వైసీపీ నుంచి భారీగా వలసలు


మర్రిపూడి మండలం జువ్విగుంటలో స్వామి ప్రచారం

ఒంగోలు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కొండపి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఈనెల 19న నామినేషన్ దాఖలు చేసిన అనంతరం ఒక్క గంట కూడా వృథా కాకుండా ఊరూరా తిరుగుతున్నారు. ఈ వారం రోజుల్లో బీఫాం కోసం అధినేత చంద్రబాబు నివాసంలోని సమావేశానికి వెళ్లిన 21వతేదీ మినహా మిగిలిన రోజులంతా ఉదయం 8 గంటల నుంచి రాత్రి 11గంటల వరకు గ్రామాల్లోనే గడుపుతున్నారు. స్వామికి రాజకీయంగా, ఆర్థికంగా సంపూర్ణ అండదండలు అందించే సీనియర్ నేత దామచర్ల పూర్ణచంద్రరావు, ఆయన కుమారుడు, టీడీపీ యువనేత దామచర్ల సత్యలు ఆయన ప్రచారానికి అదేస్థాయిలో అవసరమైన తోడుగా నిల్చున్నారు. ఎన్నికలకు ఆరు నెలల ముందు నుంచే ముగ్గురు ఒక వ్యూహం ప్రకారం పార్టీశ్రేణులను ఎన్నికలకు సన్నద్ధం చేసే పని చేపట్టి పూర్తిస్థాయిలో సక్సెస్ అయ్యారు. ఎమ్మెల్యేగా రోజువారీ కార్యక్రమాలతోపాటు నియోజకవర్గంలోని ముఖ్యమైన మండల, గ్రామస్థాయి నాయకులతో నిరంతరం సమన్వయంతో డాక్టర్ స్వామి పని చేస్తు రాగా నాయకులకు భరోసా ఇస్తూ యువకులను ఉత్సాహపరుస్తూ యువనేత సత్య మరింత కీలకంగా పనిచేయగా సీనియర్ నేత దామచర్ల పూర్ణచంద్రరావు అంతర్గతంగా చేసే పనులు చక్కబెడుతూ వచ్చారు. అవన్నీ సక్సెస్ అయి ఎన్నికల కోడ్ వచ్చేనాటికి మొత్తం నియోజకవర్గంలోని కేడర్ ఎన్నికలకు సన్నద్ధం కాగా నామినేషన్లకు ముందుగా పలుచోట్ల ప్రధాన సామాజికవర్గాల వారీ ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. వాటన్నింటి ప్రభావం ఈ నెల 19న కొండపిలో స్వామి నామినేషన్ కార్యక్రమం సందర్భంగా జరిగిన ర్యాలీ, సభల్లో ప్రతిబింబించింది. ఈ క్రమంలో 20వతేదీ నుంచే గ్రామాల వారీ ఎన్నికల ప్రచారాన్ని స్వామి ప్రారంభించారు. గతంలో మర్రిపూడి మండలం చిలంకూరు నుంచి ప్రచారం చేపట్టిన స్వామి మూడు రోజులు ఆ మండలంలో తరువాత రెండు రోజులు పొన్నలూరు మండలంలో తాజాగా ఈ నెల 25 నుంచి శనివారం వరకు జరుగుమల్లి మండలంలో 50కిపైగా గ్రామాలలో ప్రచారం పూర్తిచేశారు. ప్రతి గ్రామంలో పేదల కాలనీల్లో అవకాశం ఉన్న మేర ఇళ్లకు వెళ్లడం, ఇతర కాలనీల్లో ప్రచారరథంపై తిరిగి గ్రూపు మీటింగ్‌లు నిర్వహణకు ప్రాధాన్యత ఇస్తున్నారు. గతంలో దివంగత దామచర్ల ఆంజనేయులు మంత్రిగా నియోజకవర్గ అభివృద్ధికి చేసిన కృషి, తాను ఎమ్మెల్యేగా 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వ కాలంలో చేసిన పనులను ప్రజలకు వివరిస్తూ అదే రీతిలో ఈసారి కూడా పనిచేస్తానని హామీ ఇస్తున్నారు. అదే సమయంలో వైసీపీ ప్రభుత్వ అవినీతి, అరాచక పాలనపై విరుచుకుపడుతున్నారు. జగన్ తీరుతోపాటు నియోజకవర్గంలో వైసీపీ నేతల దోపిడీని ప్రజల్లో చర్చకు పెడుతున్నారు. ప్రత్యేకించి పోటీ చేసే ప్రతిసారి నియోజకవర్గం మారడం, ఐదేళ్లు మంత్రిగా ఉండి జిల్లాకు ఏమీ చేయలేని సురేష్ వ్యవహారాన్ని ప్రజల్లో ఎండగడుతున్నారు. ఓడిపోతే ఇక్కడ ప్రజలకు అందుబాటులో ఉంటాడా, వచ్చే ఎన్నికల్లో తిరిగి ఇక్కడ నుంచే పోటీచేస్తారా, అలాంటి వారు కావాలా, మూడు దశాబ్దాలు అండగా ఉంటున్న దామచర్ల కుటుంబం వారి మద్దతుతో వరుసగా నాలుగోసారి పోటీచేస్తున్న నన్ను ఆశీర్వదిస్తారా.. అంటూ స్వామి చేస్తున్న ప్రసంగాలు ప్రజలను ఆలోచింపజేస్తున్నాయి. ఈక్రమంలో పలు గ్రామాల్లో ఓటర్లను ప్రభావితం చేసే వైసీపీ ముఖ్య నాయకులు అనేకమంది టీడీపీలో చేరిపోతున్నారు.


జరుగుమల్లి మండలం బిట్రగుంటలో డాక్టర్ స్వామి ఎన్నికల ప్రచారం

కనిగిరి అభివృద్ధికి పక్కా ప్రణాళిక

» ఎంపీ మాగుంట

కనిగిరి, ఏప్రిల్ 27: సూపర్‌సిక్స్ పథకాలతో ప్రజలకు సంక్షేమాన్ని అందించి ఏపీని అభివృద్ధి అందించేందుకు చంద్రబాబు, సూపర్ ఫైవ్ కార్యక్రమాలతో ప్రణాళికా బద్ధంగా కనిగిరి ప్రాంత అభివృద్ధికి డాక్టర్ ఉగ్ర కృత నిశ్చయంతో ఉన్నారని ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో శనివారం టీడీపీ నాయకులు, కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ పాలనలో అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. ఎన్నికలు కేవలం 15 రోజులు మాత్రమే ఉన్నాయన్నారు. ప్రతి నాయకుడు ప్రజలకు మరింత చేరువై టీడీపీకి ఓట్లు వేయించేలా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలోని పశ్చిమ ప్రాంతం అభివృద్ధి కోసం తన కుటుంబం ఎంతో కృషి చేసిందని చెప్పారు.

టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ బూత్ పరిధిలో వచ్చే 15 రోజులు మెజార్టీ కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీకోసం పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటింటికి తిరిగి టీడీపీ విజయానికి కృషి చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. గ్రామాల్లో పనిచేయకుండా పార్టీ ఆఫీసుకు రావద్దన్నారు. కేవలం నాకు కనిపించాలనే నెపంతో కార్యక్రమాలు చేయకుండా ఉండేవారికి పార్టీలో సముచిత స్థానం లభించదని చెప్పారు. కొత్తగా వచ్చే వారిపట్ల అనవసరపు అపోహలకు పోవద్దన్నారు. ఐదేళ్ళు కష్టపడి పార్టీ అభివృద్ధికి కృషి చేసినవారికి ఎప్పుడూ తగిన గుర్తింపు ఉంటుందని చెప్పారు. ఎంపీ అభ్యర్థిగా తనకు తండ్రి సమానులైన మాగుంట రావటం తనకెంతో సంతోషానిచ్చిందన్నారు. ఆయన కుటుంబానికి కనిగిరి ప్రాంత ప్రజలకు ఎంతో అవినాభావ సంబంధం ఉందన్నారు. ఈసందర్భంగా జగనాసుర రక్తచరిత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, రాచమల్ల శ్రీనివాసులరెడ్డి, నాగరాజు, వీవీఆర్ మనోహరరావు, తదితరులు పాల్గొన్నారు.


వెలిగండ్ల: ప్రచార రథంపై నుంచి మాట్లాడుతున్న మాగుంట, ఉగ్ర


సమావేశంలో మాట్లాడుతున్న బీఎన్ విజయకుమార్, పక్కన శిరీష

భారీ మెజార్టీనే లక్ష్యం

● **పార్లమెంట్, అసెంబ్లీ రెండింటిలోనూ రావాలి**

● **టీడీపీ ఎస్ఎన్‌పాడు అభ్యర్థి విజయకుమార్ పిలుపు**

● **బాపట్ల ఎంపీ అభ్యర్థి తేనేటి సతీమణితో పరిచయ సమావేశం**

ఒంగోలు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): జరగనున్న ఎన్నికలలో సంతనూతలపాడు నియోజకవర్గం నుంచి అసెంబ్లీకి పోటీచేస్తున్న తనకు, అలాగే బాపట్ల ఎంపీగా పోటీ చేస్తున్న టి.కృష్ణప్రసాద్‌లకు భారీ మెజార్టీ లభించేలా పార్టీ నేతలు కృషిచేయాలని టీడీపీ సంతనూతలపాడు నియోజకవర్గ అభ్యర్థి బీఎన్ విజయకుమార్ పిలుపునిచ్చారు. క్షేత్ర స్థాయిలో పార్టీశ్రేణులు మరింత చురుకుగా పనిచేసేలా చేయడంతోపాటు కూటమిలోని ఇతర పార్టీలైన జనసేన, బీజేపీ శ్రేణులతోనూ సమన్వయంతో సాగాలన్నారు. స్థానిక మంగమూరు రోడ్డులోని తన కార్యాలయంలో శనివారం ఉదయం నియోజకవర్గంలోని మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు, క్లస్టర్ ఇన్‌చార్జీలు ఇతర ముఖ్య నాయకులతో ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్ కుటుంబసభ్యులతో పరిచయ సమావేశం బీఎన్ నిర్వహించారు. సమావేశానికి కృష్ణప్రసాద్ సతీమణి తేనేటి శిరీష మరికొందరు రాగా ముఖ్యనేతలను వారికి పరిచయం చేసిన బీఎన్ ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతున్నందున ఎంపీ అభ్యర్థి ప్రసాద్ మరికొద్దిరోజుల తర్వాత నియోజకవర్గంలో ప్రచారానికి వస్తారని తెలిపారు. వారి కుటుంబసభ్యులు ఈలోపు ప్రచారంలో పాల్గొంటారన్నారు. గతం కన్నా ఉత్సాహంగా నియోజకవర్గంలో పార్టీ కేడర్ పనిచేస్తుందన్నారు. రెండురోజుల క్రితం చీమకుర్తిలో నామినేషన్‌కు తరలివచ్చిన తీరు అందుకు నిదర్శనమన్నారు. పోలింగ్ వరకు వారంతా అదే ఉత్సాహంతో పనిచేసేలా నాయకులు చూడాలని కోరారు. జగన్ ప్రభుత్వ అవినీతి, అరాచక పాలనను అదే సమయంలో చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్ అనే అంశాలను, టీడీపీ ఎన్నికల ప్రణాళికను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు మనోజ్, మండవ జయంత్‌బాబు, మద్దినేని హరిబాబు, గొట్టిపాటి రాఘవరావు, గొల్లపూడి సుబ్బారావు, పార్టీ పరిశీలకులు చౌట శ్రీనివాసరావు, అడకా స్వాములు పాల్గొన్నారు.

30 మద్యం బాటిళ్లు పట్టివేత

దొనకొండ, ఏప్రిల్ 27: మండలంలోని చందవరం గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై సంపత్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. కాశీపురం గ్రామానికి చెందిన సాదం చిన్నయోగయ్య అనే వ్యక్తిపై అనుమానంతో పోలీసులు తనిఖీచేశారు. ఆయన దగ్గర ఎటువంటి అనుమతులు లేకుండా 30 మద్యం బాటిళ్లు ఉండగా, వాటిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.



ఒంగోలు నగరంలో ఐదేళ్లుగా అభివృద్ధి శూన్యమని ప్రతిపక్ష టీడీపీ నేతలు విమర్శిస్తున్నా వైసీపీ పాలకులు అట్టే కొట్టిపడేస్తున్నారు. వారు చెప్పేవన్నీ అబద్ధాలని, వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వందల కోట్ల రూపాయలు అభివృద్ధి కోసం ఖర్చు చేశామని గుక్కతిప్పుకోకుండా చెబుతుంటారు. ఏ వీధి చూసినా సీసీరోడ్లు కనిపిస్తాయంటూ గొప్పలకు పోయారు. వైసీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఏమిటో సీతారామపురం, శ్రీగిరి కొండ సమీప ప్రాంతాల్లోని రోడ్లను చూస్తూ తెలుస్తోందని ప్రజలు చెబుతున్నారు. టీడీపీ హయాంలో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టగా, అప్పట్లో ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఆగిపోయాయి. ఆ తర్వాత పట్టించుకున్న నాథుడే లేడు. "ఇప్పటికి ఐదుసార్లు నమ్మి ఓటు వేసి గెలిపించాము. ఇక నమ్మలేము.." అంటూ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

- ఒంగోలు (కార్పొరేషన్)

ఇదీ ఒంగోలు సొగసు..!



జన కేతనం

ప్రకాశం
జిల్లా వార్తలు

ఆదివారం 28 ఏప్రిల్ 2024

మాగుంట మయం

ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గాన్ని చుట్టేస్తున్న ఆయన కుటుంబ సభ్యులు

భార్య, కొడుకు, కోడలు, మరదలు, మేనకోడలు ఇలా అందరూ వరుసబెట్టి ఊళ్లల్లో ప్రచారం

సేవా కార్యక్రమాల లబ్ధిదారులతోనూ మాటామంతీ.. మహిళలతో మమేకం

టీడీపీ కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి



కనిగిరిలో చాయ్ దుకాణంలో టీ తాగుతున్న ఎంపీ మాగుంట, డాక్టర్ ఉగ్ర

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 27 : ఒంగోలు ఎంపీ టీడీపీ కూటమి అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి గెలుపే లక్ష్యంగా ఆయన కుటుంబ



ఒంగోలులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మాగుంట గీతాలత, దామచర్ల సత్యలత

సభ్యులు ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఒక వైపు మాగుంట కుమారుడు రాఘవరెడ్డి, ఇంకొక వైపు మాగుంట సతీమణి గీతాలత, కోడలు చందనలు పలు నియోజకవర్గాల్లో శనివారం ఎన్నికల ప్రచారం చేశారు. ఒంగోలులో చెన్నకేశవస్వామి లేఅవుట్‌లో గీతాలత, దామచర్ల నాగసత్యలతో కలిసి ఇళ్లిల్లూ తిరిగి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా చంద్రబాబు హయాంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. వచ్చే నెల 13న జరిగే ఎన్నికల్లో ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే అభ్యర్థి దామచర్ల జనార్ధన్‌ను గెలిపించాలని కోరారు. మరో వైపు రాఘవరెడ్డి సతీమణి చందన యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. వైపాలెం నియోజకవర్గంలోని మల్లవరంలో మాగుంట ట్రస్టు ఆధ్వర్యంలో మహిళలకు ఇస్తున్న కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ మహిళలతో మమేకమై మాట్లాడారు. అదే విధంగా గిద్దలూరు మండలం దంతెరపల్లిలో చందన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఎన్నికల్లో ఒంగోలు ఎంపీ అభ్యర్థి శ్రీనివాసులురెడ్డి, ఆ నియోజకవర్గాల ఎమ్మెల్యే అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సింగరాయకొండ మండలం ఈద్గా మిట్ట, పూలతోట, చంద్రబాబునగర్‌లో మాగుంట మరదలు సహనరెడ్డి, మేనకోడలు ప్రణతిరెడ్డిలు విస్తృతంగా పర్యటిస్తున్నారు. అలా జిల్లాలోని రోజుకు మూడు, నాలుగు నియోజకవర్గాల్లో మాగుంట కుటుంబ సభ్యులు ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డితోపాటు ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని ఆయా ప్రచార కార్యక్రమాల్లో కోరారు.

తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం : ఎంపీ మాగుంట

కనిగిరి, ఏప్రిల్ 27 : కనిగిరిలో శాశ్వతంగా తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి చెప్పారు. డాక్టర్ ఉగ్ర ఆధ్వర్యంలో శనివారం చాయ్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలో బైక్ మీద ఎంపీ మాగుంట, ఉగ్రలు ప్రచారం నిర్వహించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీ మాగుంట ఉదయాన్నే పట్టణంలోని ప్రధాన సెంటర్లలో టీ, కూరగాయల దుకాణాల వద్దకు వెళ్ళి ప్రజలతో మాట్లాడారు. మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న చాయ్ దుకాణం వద్ద టీ తాగుతూ ముస్లింలతో గడిపారు.. ఈసందర్భంగా ఎంపీ మాగుంట ముస్లింల కుటుంబాల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే, సుగుణావతమ్మ సెంటర్, బొడ్డుచావిడి వద్ద కూరగాయల మార్కెట్, చిరు వ్యాపారులు, తోపుడు బండ్ల నిర్వాహకులతో గడిపి వారి సమస్యలను తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో కనిగిరి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే తాగునీటి సమస్య పరిష్కారంలో భాగంగా ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటుచేసి తాగునీటి సరఫరా చేయిస్తారన్నారు. ఆ విషయంలో తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ఎంపీ మాగుంట హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

ఎన్నికల పరిశీలకుడుగా మయూర్

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 27 : యర్రగొండపాలెం, గిద్దలూరు, కనిగిరి అసెంబ్లీ నియోజకవర్గాల జనరల్ పరిశీలకులుగా మయూర్ కే. మెహతా నియమితులయ్యారు. ఒంగోలులోని ఎన్ఎస్‌పీ అతిథిగృహంలో బస చేస్తున్నారు. ఆయా నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులు లేదా వారి తరుపున ఏజెంట్లుకానీ, సాధారణ ప్రజానీకం ఏమైనా ఫిర్యాదులు, సందేహాలు ఉంటే 9281034503 నెంబర్‌కు ఫోన్ చేయవచ్చు. లేనిపక్షంలో ప్రతిరోజు ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు ఎన్ఎస్‌పి అతిథిగృహంలో అందుబాటులో ఉంటారు.

రాజకీయ సిత్ర విసిత్రాలు

వైసీపీ ప్రచారంలో ఫీల్డ్ అసిస్టెంట్, వలంటీర్



చందలూరులో బూచేపల్లితోపాటు ప్రచారంలో ఫీల్డ్ అసిస్టెంట్, వలంటీర్

దర్శి, ఏప్రిల్ 27 : ఎన్నికల నిబంధనలను తుంగలో తొక్కి ఫీల్డ్ అసిస్టెంట్లు, వలంటీర్లు, రేషన్ డీలర్లు యథేచ్ఛగా వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. ఎన్నికల కమిషన్ స్పష్టమైన ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ లెక్కచేయటం లేదు. వైసీపీ నాయకుల ఆదేశాలే శిరోధార్యంగా పనిచేస్తున్నారు. తాజాగా దర్శి మండలం చందలూరులో మూడు రోజుల క్రితం జరిగిన వైసీపీ ఎన్నికల ప్రచారంలో ఆ గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్, వలంటీర్, రేషన్ డీలర్ పాల్గొన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పక్కనే ఫీల్డ్ అసిస్టెంట్ రామాంజనేయులు ఉండి ప్రచారం చేశారు. ఆయన వెనుక వలంటీర్ సతీష్, డీలర్ శేఖర్ ఉన్నారు. వాటి తాలూకు ఫొటోలు ఆలస్యంగా వెలుగుచూడడంతో విషయం తెలుసుకొని టీడీపీ గ్రామ నాయకులు యల్లరావు, మరికొందరు వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేస్తున్నట్లు చెప్పారు.

మంత్రి నాగార్జున ప్రచారంలో వీవోప



మంత్రి నాగార్జునతో కలిసి ఎన్నికల ప్రచారంలో వీవోఏ కుమారి

చీమకుర్తి, ఏప్రిల్ 27 : ఎన్నికల నియామావళిని కొందరు ఉద్యోగులు బేఖాతరు చేస్తున్నారు. ఇటీవల చీమకుర్తి మండలం నిప్పట్లపాడు పంచాయతీ పరిధిలో మంత్రి మేరుగ నాగార్జున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆ కార్యక్రమంలో వెలుగు వీవోఏ సీహెచ్.కుమారి మంత్రి నాగార్జునతో కలిసి ప్రచారం పాల్గొన్నారు. ఈ విషయాన్ని ఆధారాలతో సహ గ్రామ టీడీపీ నాయకులు మువ్వా మహేంద్ర, నల్లూరి విష్ణు, మన్నం శేషయ్య, ముప్వా మాల్యాద్రిలు సంబంధిత శాఖ సీసీ, ఏపీఎంలకు ఫిర్యాదు చేశారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ప్రచార కార్యక్రమాల్లో రేషన్ డీలర్



వైసీపీ ప్రచార కార్యక్రమంలో రేషన్ డీలర్

పామూరు, ఏప్రిల్ 27 : సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, అంగన్‌వాడీ, రేషన్ డీలర్లు ఎటువంటి ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన వద్దని ఎన్నికల కమిషన్ ఒక వైపు హెచ్చరిస్తున్నా కొందరు మాత్రం లెక్కపెట్టడం లేదు. మండలంలోని బొట్లగూడూరు గ్రామంలో దద్దాల నిర్వహించిన ఎన్నికల ప్రచార యాత్రలో రఘునాథపురం గ్రామానికి చెందిన రేషన్ డీలర్ పోలినేని రవీంద్ర, నాయకులతో కలిసి వైసీపీకి మద్దతుగా బహిరంగా ప్రచారం నిర్వహించారు.

కప్పదాట్లు.. కాసుల బేరం..!

ద్వితీయశ్రేణి నాయకులకు ఎన్నికల పండగ

చీరాల, ఏప్రిల్ 27 : ఎన్నికల సీజన్‌లో ద్వితీయశ్రేణి నాయకులకు యమగిరాకీ పెరిగింది. వారిలో కొందరు ఏ రోజు ఏ పార్టీలో ఉంటారో వారికే తెలియడం లేదు. పార్టీలు, పార్టీ కండువాలు మార్చడం వారికి మంచినీళ్లప్రాయంగా మారింది. అందుకు అధినాయకులు కాసుల బేరం పెడుతున్నారు. ద్వితీయశ్రేణి నాయకుల బలబలాలను బట్టి కాసుల తాచు తూగుతోంది. ఎవరెవరికి ఎంతెంత ఇస్తున్నారనే విషయాన్ని గోప్యంగా ఉంచుతున్నారు. కొన్నిచోట్ల డబ్బు తీసుకున్న వ్యక్తులు వారివారి స్నేహ సంబంధాల నడుమ బయటపెట్టుకుంటున్నారు. హోటళ్ల వద్ద రహస్యంగా మాట్లాడుకుంటున్నా అవి బహిరంగ రహస్యాలవుతున్నాయి. ఇది కూడా అధినాయకులకు తలనొప్పిగా మారిందని చెప్పుకుంటున్నారు. కప్పదాట్ల ద్వితీయశ్రేణి నాయకులు మూడు ప్రధాన పార్టీలలో ఉండడం గమనార్హం. దీంతో ఏ నాయకుడు ఎప్పుడు ఏ కండువాలతో ప్రత్యక్షమవుతారో అర్థం కావడం లేదని ప్రజలు ఎద్దేవా చేస్తున్నారు.



రాజుపాలెం, కే రాజుపాలెం మధ్య ఉన్న సిమెంట్ రోడ్డు(రెండు గ్రామాలలో కనిపిస్తున్న దేవాలయాలు

సీసీరోడ్డే సరిహద్దు

రెండు గ్రామాలు.. రెండు మండలాలు.. రెండు నియోజకవర్గాలు

రాజుపాలెం, కే రాజుపాలెం ప్రత్యేకత అదే

రెండు ఆలయాలు కూడా వేర్వేరు గ్రామాల్లో



మార్టూరు, ఏప్రిల్ 27 : ఒక గ్రామం నుంచి పక్క గ్రామానికి వెళ్లాలంటే కొంత దూరం ఉంటుంది. సైకిలు, బస్సు, బైక్‌లు లేదా.. నడిచైనా వెళ్లాలి. అందుకు గంటో.. అరగంటో సమయం పడుతుంది. ఈ ఫొటోలో సీసీ రోడ్డుకు ఇరువైపులా కనిపిస్తున్న రెండు ఆలయాలు రెండు పక్కపక్క గ్రామాల్లో ఉన్నాయి. ఫొటోలో సిమెంటు రోడ్డుకు ఇరువైపులా కనిపిస్తున్న రెండు ఆలయాలు రెండు గ్రామాలలో ఉన్నాయి. రెండు గ్రామాలకు, రెండు మండలాలకు, రెండు నియోజకవర్గాలకు సీసీ రోడ్డే సరిహద్దు. ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి రెండు సెకన్ల సమయమే.

ఫొటోలో కనిపిస్తున్న ధ్వజస్తంభం ఉన్న రామాలయం పర్చూరు నియోజకవర్గంలోని మార్టూరు మండలం రాజుపాలెంలో ఉంది. ఈ గ్రామ ఓటర్లు 2400 మంది ఉన్నారు. అలాగే రామాలయానికి ఎదురుగా సీసీ రోడ్డుకు అవతల కనిపిస్తున్న ఆంజనేయస్వామి ఆలయం అద్దంకి నియోజకవర్గంలోని బల్లికురవ మండలం కే రాజుపాలెంలో ఉంది. ఈ గ్రామ ఓటర్లు 900 మంది ఉన్నారు. 2004లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల వరకు ఈ రెండు గ్రామాలు ఉన్న మార్టూరు, బల్లికురవ మండలాలు మార్టూరు నియోజకవర్గంలోనే ఉండేవి. ఆతర్వాత 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో మార్టూరు నియోజకవర్గం రద్దయింది. దీంతో మార్టూరు మండలం పర్చూరు నియోజకవర్గంలోనూ, బల్లికురవ మండలం అద్దంకి నియోజకవర్గంలోనూ చేరిపోయాయి. ఈ రెండు గ్రామాలలోని ప్రజానీకానికి దగ్గర బంధుత్వం కూడా ఉంది. రోజంతా కలిసి మెలిసి రాజకీయాలను గంటల తరబడి అరుగులపై కూర్చుని చర్చిస్తారు. ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికలు జరుగుతుండడంతో రెండు నియోజకవర్గాలలో పోటీ చేస్తున్న టీడీపీ, వైసీపీ అభ్యర్థుల బలాలపై గెలుపు ఓటమిలపై చర్చించుకుంటారు. పైగా రెండు నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో సంబంధాలను నడుపుతారు. రెండు గ్రామాలకు చెందిన రాజకీయనాయకులు ఈ రెండు గ్రామాలపై పెత్తనం కోసం చక్రం తిప్పుతుంటారు. మనలో మాట.. 2026లో జరగనున్న నియోజకవర్గాల పునర్విభజనలో మరోసారి మార్టూరు నియోజకవర్గం తెరపైకి రానున్నదని, దాంతో ఈ రెండు మండలాలు యథాస్థితిగా మార్టూరు నియోజకవర్గంలో ఉంటాయని ప్రజలు, నాయకులు రాజకీయ చర్చించుకుంటున్నారు.

పాపం పాలేరు రిజర్వాయర్

పదేపదే సీఎం నుంచి ఇన్‌చార్జిల వరకు హామీలు

ఐదేళ్లలో తట్ట మట్టి ఎత్తిందిలేదు

అటకెక్కిన నిర్మాణ పనులు



శిలాఫలకం వద్ద సెల్ఫీచాలెంజ్ విసురుతున్న ఎమ్మెల్యే స్వామి (ఫైల్)

పొన్నలూరు(కొండపి), ఏప్రిల్ 27 : పాలేరు ఆధారంగా చెన్నిపాడు సమీపంలోని సంగమేశ్వరం వద్ద 2006లో మంజూరైన సంగమేశ్వరం ప్రాజెక్ట్ (పోతుల చెంచయ్య పాలేరు రిజర్వాయర్) అసంపూర్తిగానే ఆగిపోయింది. ప్రాజెక్ట్‌కు 2009లో అప్పటి ఆర్థిక మంత్రి కొణిజేటి రోశయ్య శిలాఫలకం వేశారు. 9,500 ఎకరాలకు సాగునీరు, 15 గ్రామాలకు తాగునీరు అందించే ఈప్రాజెక్ట్ పూర్తి చేయడానికి రూ.50.50 కోట్లు అవసరమవుతాయని ప్రభుత్వం అంచనా వేసింది. అప్పటి నుంచి కొంత వరకు స్పిల్‌వే పనులు అరకొరగా ముగ్గురు కాంట్రాక్టర్లు చేశారు. 2019 ఎన్నికల్లో ఈప్రాజెక్ట్ పూర్తి చేస్తామని ఇప్పటి సీఎం, అప్పటి ప్రతిపక్షనేత తన పాదయాత్రలో పొన్నలూరు మండలంలో కొనసాగిస్తూ హామీనిచ్చారు. ఆ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఓడిపోయిన మాదాశి వెంకయ్య తర్వాత వచ్చిన నాయకులు సంగమేశ్వరం ప్రాజెక్ట్ పూర్తి చేస్తామని హామీనిచ్చి మరిచారు. ఈప్రాంత రైతాంగం ప్రాజెక్ట్ పూర్తి చేయాలని 2019 నుంచి అధికార పార్టీ నాయకులకు పదేపదే విజ్ఞప్తి చేస్తున్నా ఈప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు.

తీరిన ఓటు కష్టాలు

ధేనువకొండ పునరావాస కేంద్రాలలో పోలింగ్ కేంద్రాల ఏర్పాటు



బలరామకృష్ణాపురంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం

అద్దంకి, ఏప్రిల్ 27 : సుమారు దశాబ్దకాలం తరువాత నివాసం ఉండే ప్రాంతంలో ఓటు హక్కు కల్పించుకునే అవకాశం రెండు పునరావాస కాలనీల ఓటర్లకు కలిగింది. గుండ్లకమ్మ రిజర్వాయర్ ముంపు గ్రామంగా ఉన్న ధేనువకొండకు నాలుగైదు చోట్ల పునరావాస కాలనీలను ఏర్పాటు చేశారు. అద్దంకి పట్టణానికి సమీపంలో బలరామకృష్ణాపురం(కొంగపాడు వద్ద), వేలమూరిపాడు సమీపంలో 2012లో పునరావాస కాలనీలను ఏర్పాటు చేశారు. ఎన్నికలు వస్తే సుమారు 30 కి.మీ దూరంలో ఉన్న ధేనువకొండకు వెళ్లి ఓటు హక్కును వినియోగించుకోవలసి వచ్చేది. దీంతో వృద్ధులు, మహిళలు ఓటు హక్కును వినియోగించుకోవడానికి నానాఅవస్థలు పడే వారు. ఇలా 2014, 2019 సాధారణ ఎన్నికలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికలలో అక్కడకెళ్లి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎట్టకేలకు పుష్కరకాలం తరువాత తాము నివాసం ఉంటున్న కాలనీలలో కొత్తగా ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లలో మే 13న జరిగే ఎన్నికలలో ఓటును వేయనున్నారు. ధేనువకొండ పంచాయతీ పరిధిలో మొత్తం సుమారు 3200 మంది ఓటర్లు ఉన్నారు. ప్రస్తుతం పునరావాసకాలనీలు అయిన వేలమూరిపాడు సమీపంలోని పునరావాసకాలనీలో 184 పోలింగ్ కేంద్రంలో సుమారు 200 మంది, బలరామకృష్ణాపురం(కొంగపాడు కాలనీ) లో 186 పోలింగ్ కేంద్రంలో సుమారు 400 మంది ఓటు హక్కును వినియోగించుకోనుండగా, ఈ రెండు పునరావాస కేంద్రాలలో 2024 సాధారణ ఎన్నికలకు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడంతో సుమారు 600 మంది ఓటర్లు స్థానికంగా ఉండే పునరావాస కేంద్రాలలో ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఏర్పడింది.

పేదలను ఆకలితో మాడ్చిన జగన్

- కూటమి అధికారంలోకి రాగానే అన్నా క్యాంటీన్లు ప్రారంభం
- ప్రచారంలో టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి


సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ అభ్యర్థి అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 27 : పేదల ఆకలి తీర్చే అన్నా క్యాంటీన్లను అధికారంలోకి రాగానే జగన్‌మోహన్ రెడ్డి రద్దు చేసి వారిని ఆకలితో మాడ్చాడని టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి ధ్వజమెత్తారు. శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలోని రైల్వేస్టేషన్ నుంచి ఆర్‌టీసీ బస్టాండ్ వరకు, సాయంత్రం రాచర్ల గేటు వద్ద నుంచి మార్కెట్‌యార్డు వరకు ఆయన ప్రచారం నిర్వహించారు. రోడ్డుపక్కన చిరువ్యాపారాలు చేసే వ్యాపారులను కలుసుకుని వారి ఆర్థిక స్థితిగతుల గురించి అడిగి తెలుసుకున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి మేనిఫెస్టోలోని అంశాలను వారికి వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ హయాంలో గిద్దలూరు పట్టణంలో కూడా అన్నాక్యాంటీన్ నిర్వహించినట్లు ప్రజలకు వివరిం చారు. ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి రాగానే అన్నా క్యాంటీన్లను పునఃప్రారంభిస్తామన్నారు. పేదలకు సంక్షేమం అందించడం అంటే బటన్ నొక్కడమే కాదని వారి ఆకలిని తీర్చడం కూడా అని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో నిత్యవసర సరుకులు, సిమెంట్, ఇసుక, గ్యాస్‌ధరలు పెంచడమే అభివృద్ధి అని ఎద్దేవా చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సంక్షేమం, అభివృద్ధి కుంటుపడింద న్నారు. తాను శాసనసభ్యునిగా ఉన్న సమయంలో గిద్దలూరు పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం గుండ్లమోటు నుంచి పైపులైన్ ద్వారా ఇంటింటికి తాగునీరు అందించినట్లు పేర్కొన్నారు. రామన్నకతువ నుంచి పైపులైన్ ద్వారా పట్ట ణ ప్రజలకు తాగునీరు అందించేందుకు నాటి ముఖ్య మంత్రి రూ.100 కోట్లు నిధులను మంజూరు చేశాడ న్నారు. ఆ పనులు కూడా ప్రారంభించినట్లు పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన వైసీపీ పాలకులు అభివృద్ధిపై గాని, ప్రజా సంక్షేమంపై గాని దృష్టిపెట్టలేద న్నారు. తాను స్థానికుడినని, ఎల్ల వేళలా ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిఒక్కరూ తనకు మద్దతుగా నిలిచి గిద్దలూరు ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనకు, పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాగుంట శ్రీనివాసుల రెడ్డికి సైకిల్‌గుర్తుపై ఓటువేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు చంద్రశేఖర్ యాదవ్, లొక్కు రమేష్, గడ్డం భాస్కర్‌రెడ్డి, పాలు గుళ్ల శ్రీదేవి, బిల్లా జయ లక్ష్మి, కో-ఆప్షన్ సభ్యులు దమ్మాల జనార్దన్, పట్టణ పార్టీ అధ్యక్షులు షానేషా వలి, టీడీపీ నాయకులు బాలీశ్వరయ్య, ఓబయ్య, బిల్లా రమేష్, పాల్గొన్నారు.


టీడీపీలో చేరిన వారితో ముత్తుముల అశోక్‌రెడ్డి


సంజీవరాయునిపేటలో ఇంటింటి ప్రచారం చేస్తున్న పుష్పలీల, మాగుంట చందనరెడ్డి

టీడీపీలో 20 కుటుంబాల చేరిక

టీడీపీ పట్ల ఆకర్షితులై పట్టణంలోని 20 కుటుంబాలకు చెందిన ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్లు ఆ పార్టీలో చేరారు. వీరందరికీ ఆ పార్టీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో షేక్ బడే, షేక్‌రషీద్, షేక్ షాకీర్, జి.అల్లూరయ్య బి.భాస్కర్, షేక్ బాషా, పాండు, రవి, నాయక్, ప్రేమ్, సుబ్బరాయుడు, ఖాదర్‌బాషా, రసూల్, ప్రసాద్, రాజేష్, వెంకీ, మహబూబ్‌బాషా, ఖాశీం, ఖాజా, వలి ఉన్నారు.

టీడీపీ అభ్యర్థులను గెలిపించండి

- ముత్తుముల పుష్పలీల, మాగుంట చందనరెడ్డి

గిద్దలూరు టౌన్ : అభివృద్ధే లక్ష్యంగా పనిచేసి టీడీపీకి ఓటు వేయాలని టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి భార్య ముత్తుముల పుష్పలీల, మాగుంట రాఘవరెడ్డి సతీమణి మాగుంట చందనరెడ్డి అన్నారు. శనివారం గిద్దలూరు మండలం సంజీవరాయునిపేట గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటి వద్దకు వెళ్లి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి మానిఫెస్టోలోని అంశాలను ఓటర్లకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్‌యాదవ్, టీడీపీ మండల అధ్యక్షుడు మార్తాల సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరు టౌన్ : బేస్తవారపేట మండలం ఒందుట్ల గ్రామానికి చెందిన 30 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం సాయంత్రం రాచర్ల రోడ్డులో పర్యటిస్తున్న ముత్తుముల అశోక్‌రెడ్డిని 30 కుటుంబాలు వారు కలిసి మద్దతు తెలిపారు. వీరందరికీ అశోక్‌రెడ్డి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో బేస్తవారపేట మాజీ వైస్ ఎంపీపీ బల్లాని సుబ్బరత్నం, చిన్న ఓబినేనిపల్లె సర్పంచ్ శ్రీనీశ్వర్‌రెడ్డి, జనసేన ఇన్‌చార్జ్ బెల్లంకొండ సాయిబాబా, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కుప్పా రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

సబ్‌జైలులో న్యాయాధికారి ఆకస్మిక తనిఖీ


తనిఖీ చేస్తున్న న్యాయాధికారి మేరీసారా దానమ్మ

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 27 : పట్టణంలోని సబ్ జైలును అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి బి.మేరీసారాదానమ్మ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జైలులో ఉన్న ఖైదీలకు అందుతున్న ఆహార పదార్థాలను, స్టోర్ రూమ్ పరిసరాలను పరిశీలించారు. ఖైదీలకు అందుతున్న వైద్యసేవలను ఆరా తీశారు. కేసులలో న్యాయవాదిని నియమించుకునేందుకు ఆర్థిక స్తోమతలేని వారికి మండల న్యాయ సేవాధికార సంస్థ ద్వారా సాయం అందిస్తామన్నారు. న్యాయవ్యవస్థలో వస్తున్న నూతన మార్పులను విచారణ, విధానాల గురించి వివరించారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ యు.లింగారెడ్డి, పారాలీగల్ వలంటీర్ అద్దంకి మదుసూదన్‌రావు పాల్గొన్నారు.

మద్యం సీసాల స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలను చూపుతున్న ఎస్ఈబీ అధికారులు

పొదిలి, ఏప్రిల్ 27 : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పొదిలి సెబ్ స్టేషన్ పరిధిలో అక్రమ మద్యం అమ్మకాలపై శుక్రవారం దాడులు నిర్వహించినట్లు ఎస్ఈబీ సీఐ ఈశ్వరరావు తెలిపారు. ఈ దాడుల్లో హనుమంతునిపాడు మండలానికి చెందిన చిన్న ఉమ్మనపల్లి గ్రామంలో 25మద్యం సీసాలు కలిగిన ఒకవ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించారు. ప్రభుత్వ మద్యం దుకాణంలో పనిచేస్తున్న సూపర్‌వైజర్, సేల్స్‌మేనేజర్‌లు సీసాపై రూ.10 అదనంగా తీసుకొని మద్యం సీసాలు సరఫరా చేశారని తెలిపారు. దీంతో వారు ఇరువురిని అదుపులోకి తీసుకొని ముగ్గురిపై కేసునమోదు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా పొదిలి ఎస్ఈబీ పరిధిలోని మర్రిపూడి మండలం కూచిపూడి గ్రామానికి చెందిన వ్యక్తి వద్ద 75 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. వారిని విచారించగా పొదిలి పరిధిలో ప్రభుత్వ దుకాణంలో సేల్స్‌మెన్ బాటిల్‌పై రూ.10 అదనంగా తీసుకొని సీసాలు ఇచ్చారని తెలిపారు. దీంతో సేల్స్‌మెన్‌ను అదుపులోకి తీసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మొత్తం 100 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో ఎవరు అక్రమంగా మద్యం అమ్మకాలు చేయవద్దని ఆయన సూచించారు. అలా అమ్మకాలు జరిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఒంగోలు డీటీఎఫ్ ఎస్ఐ ఏ శ్రీనివాసరావు, సిబ్బంది ఉన్నారు.

ఫిర్యాదులు చేసినా చర్యలేవి...!

పొదిలి, ఏప్రిల్ 27 : డ్వామాపీడీ శీనారెడ్డి అవినీతి అక్రమాలపై ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని పొదిలి పట్టణానికి చెందిన ఇనుగంటి రాజశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023లో అక్టోబర్ 20న మొదటిసారి కలెక్టర్ దినేష్‌కుమార్‌కు, 2024 మార్చి 4న జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అయినా వాటిపై ఎలాంటి స్పందన లేకపోవడంతో మరోసారి వాట్సాప్ మెసేజ్, ఫోన్ ద్వారా కూడా విచారించాలని కోరినట్లు తెలిపారు. ఈ క్రమంలో కలెక్టర్ స్పందించి విచారణ చేయిస్తానని చెప్పినట్లు రాజశేఖర్ చెప్పారు. మొదటి ఫిర్యాదు 7నెలలు, రెండవ ఫిర్యాదు 2నెలలు అయినా ఎలాంటి విచారణ చేయలేదన్నారు. చివరి ప్రయత్నంగా 2024 ఏప్రిల్ 20వ తేదీన ఐఏఎస్ తాడేపల్లి కేకన్నబాబుకు, కలెక్టర్ దినేష్‌కుమార్‌కు, మెజిస్ట్రేట్ బి ఆర్జున్‌రావుకు, డ్వామా పీడీకి రిజిస్టర్ పోస్ట్‌ద్వారా శీనారెడ్డి అవినీతి అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు రాజశేఖర్ తెలిపారు. ఈ ఫిర్యాదులన్నిటిపైన 20 రోజుల్లో విచారణ చేపట్టకపోతే హైకోర్టును ఆశ్రయించనున్నట్లు తెలిపారు. పూర్వ డ్వామా పీడీ శీనారెడ్డి అవినీతిపై రిట్‌ఆఫ్ మాండమస్ పిటీషన్ దాఖలు చేస్తానని ఇనగంటి రాజశేఖర్ తెలిపారు.

మహిళలపై కోతులు దాడులు

- హడలిపోతున్న ప్రజలు


స్వైర విహారం చేస్తున్న కోతులు

కంభం, ఏప్రిల్ 27 : మండలంలోని రావిపాడులో కోతుల దాడులతో గ్రామస్థులు హడలిపోతున్నారు. గత మూడు రోజులలో సుమారు పది మందిపై కోతులు దాడిచేసి గాయపరిచాయి. దీంతో పాటు కిరాణా దుకాణాల్లో ఉండే వస్తువులను ఇంటికి తీసుకెళుతున్న వారిపై దాడిచేసి గోళ్లతో రక్కడమో, కొరకడమో చేసి వస్తువులను లాక్కుని వెళుతున్నాయి. గృహాల్లోని వారు కోతుల భయంతో వాకిళ్లు కిటికీలు బిగించి పనులు చేసుకుంటున్నారు. ఎవరైనా ఆదమరచి తలుపులు తెరిచి ఉంచితే ఇంతే సంగతులు. కోతులు ఇళ్లలోకి చేరి చిందరవందర చేసి తినే వస్తువులు ఉంటే నోట కరుచుకొని వెళుతున్నాయి. కోతుల ఆగడాలను అడ్డుకుంటే వారిపై దాడులు చేసి గాయపరుస్తున్నాయి. కోతుల దాడిలో గాయపడిన వారు ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రులలో వైద్యం చేయించుకుంటున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి కోతులను పట్టేవారిని పిలిపించి వాటిని పట్టి అటవీ ప్రాంతంలో వదలాల్సిందిగా కోరుతున్నారు.

లైఫ్ సర్టిఫికెట్లు అందించాలి

గిద్దలూరు, ఏప్రిల్ 7 : వేలిముద్రలు పడకపోవడంతో చాలామంది విశ్రాంత ఉద్యోగులకు పింఛన్ ఆగిపోయిందని విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జి.రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. గిద్దలూరు సబ్‌ట్రెజరీ కార్యాలయం పరిధిలో 92 మందికి ఈ నెల పింఛన్లు నిలిచిపోయాయి. ఈ విషయంపై డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీ దృష్టికి తీసుకుని వెళ్లామన్నారు. ఈనెల 29న లైఫ్ సర్టిఫికేట్ ఫారానికి ఫొటో అంటించి సబ్ ట్రెజరీ కార్యాలయంలో అందజేస్తే పింఛన్లు పునరుద్ధరిస్తారన్నారు. పింఛన్ అందని రిటైర్డ్ ఉద్యోగులు 29వ తేదిన లైఫ్‌సర్టిఫికేట్ ఫారాలను సబ్ ట్రెజరీ కార్యాలయంలో అందించాలని కోరారు.

గంజాయి అమ్మకాల్లో రాష్ట్రం ప్రథమ స్థానం

ఏపీ శాసనమండలి మాజీ చైర్మన్ ఎస్ఎండీ షరీఫ్


సమావేశానికి హాజరైన ముస్లింలు

ఎర్రగొండపాలెం, ఏప్రిల్ 27 : రాష్ట్రాన్ని అభివృద్ధి సంక్షేమం కంటే గంజాయి అమ్మించడంలోనే దేశంలో ప్రథమ స్థానంలో ఉంచిన ఘనత జగన్‌రెడ్డిదేనని ఏపీ శాసన మండలి మాజీ చైర్మన్ ఎస్ఎండీ షరీఫ్ అన్నారు. ఎర్రగొండపాలెం షాదీఖానా భవనంలో శనివారం నియోజకవర్గ ముస్లిం మైనార్టీలు, నూరుబాషా సంఘం ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి కి 149 సీట్లు వచ్చి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన ఘనత చంద్రబాబు నాయుడికే దక్కుతుందన్నారు. ముస్లిం మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు టీడీపీ ప్రభుత్వంలో సుప్రీంకోర్టులో న్యాయవాదులను నియమించి పోరాడారన్నారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన 5 సంవత్సరాలలో న్యాయవాదులను ఏర్పాటు చేయలేదన్నారు. చంద్రబాబు నాయుడు రాష్ట్రాభివృద్ధి కోసం బీజేపీతో పొత్తు కలిశారన్నారు. కూటమి విజయం సాధించి చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతారన్నారు. ఆయన పాలనలో ముస్లిం మైనార్టీలకు అభివృద్ధి సంక్షేమంతో పాటు రక్ష ఉంటుందన్నారు. రాష్ట్రానికి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉంటాడని ముస్లింలకు రాయితీపై రుణాలు, మౌజన్‌లకు జీతాలు, ముస్లింల ఆస్తులకు రక్షణ ఉంటుందన్నారు. ఏపీలో చంద్రబాబు ముస్లింలు ఒక కన్ను, హిందువులు ఒక కన్ను అని అన్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వంలో ముస్లింలపై అనేక దాడులు జరిగాయన్నారు. ముస్లింలలో పేదరికం ఎక్కువగా ఉందని, అది పోవాలంటే మే 13 పోలింగ్ రోజులు ముస్లింలు అందరు టీడీపీ ఓట్లు వేయాలని అన్నారు. రాష్ట్రంలో ముస్లిం మైనార్టీలో అబ్దుల్ సలాం అప్పులు కట్టలేక ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందితే ముస్లింలలో ఉన్న క్యాబినెట్ మంత్రి అంజాద్ భాష ఖండించిన సందర్భం లేదని అన్నారు. అనంతపురంలో వైసీపీ నాయకుడి కుమార్తె కంటే ముస్లిం విద్యార్థినికి మార్కులు ఎక్కువగా వచ్చాయని టీసీ ఇచ్చి పంపారని, దీంతో బాలిక ఆత్మహత్యకు పాల్పడిందని అన్నారు. నరసరావుపేటలో మసీద్‌కువెళ్లి వస్తున్న ముస్లింను వైసీపీ గూండాలు హత్య చేశారన్నారు. ఎమ్మిగనూరులో తల్లిదండ్రులకు అన్నం తీసుకొని వెళ్లిన చిన్నారని కొట్టి ఆత్యాచారం చేశారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో దుల్హాన్ పథకంలో ముస్లిం బాలికకు రూ.50 వేలు నగదు చంద్రబాబు తీసుకొచ్చారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో దుల్హాన్ పథకంలో వేల మంది బాలికలకు పెండ్లి కానుక ఇచ్చామని అన్నారు. వైసీపీ ఐదేళ్లలో 3వేల మందికి ఇచ్చారని అన్నారు. రాజధాని బిల్లు విషయంలో శాసన మండలిలో అనేక ప్రలోభాలు పెట్టి రాజధాని లేకుండా చేయాలని దుర్మార్గపు వైసీపీ ప్రభుత్వం కుట్ర చేసిందన్నారు. వచ్చే ఎన్నికల్లో మంచి సౌమ్యుడు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, గూడూరి ఎరిక్షన్‌బాబుకు ఎమ్మెల్యే అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డిలకు ఓటు వేసి గెలిపించాలన్నారు. టీడీపీ అభ్యర్థి ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ.., నియోజకవర్గంలో ముస్లింలలో పేదరికం లేకుండా సంక్షేమ పథకాలు అమలుజేస్తామన్నారు. కార్యక్రమానికి నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ ఇస్మాయిల్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ ఉపాధ్యక్షులు డాక్టరు మన్నె రవీంద్ర, రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎండీ యాసఫ్, జిల్లా మైనారిటీ విభాగం అధ్యక్షులు, జిల్లా ఉపాధ్యక్షులు షేక్ మాబు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గఫూర్, పట్టణ అధ్యక్షులు మస్తాన్‌వలి, షేక్ వలి, షేక్ రఫీ, స్థానిక ముస్లిం, నూరుబాషా సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎండీ షరీఫ్

రైతు సంక్షేమమే టీడీపీ ధ్యేయం


ప్రచార ర్యాలీలో మాట్లాడుతున్న నారాయణరెడ్డి

తర్లుపాడు, ఏప్రిల్ 27: రైతు సంక్షేమమే ధ్యేయంగా టీడీపీ పనిచేస్తుందని మార్కాపురం నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని కలుజువ్వలపాడు పంచాయతీలోని కొండారెడ్డిపల్లి, లక్ష్మక్కపల్లి, మంగళకుంట, జగన్నాథపురం, తుమ్మలచెరువు గ్రామాల్లో కందుల ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మార్కాపురాన్ని జిల్లాగా చేస్తామని తమ అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. వెలిగొండను కూడా పూర్తి చేస్తామన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసి ప్రజలకు మేలు చేకూర్చనున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటికి పైప్‌లైన్ ద్వారా మంచినీటి సరఫరా చేసేందుకు శాయాశక్తులా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి ప్రజల సేవకుడని, ప్రజలకు మాగుంట చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేశాడన్నారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి, తనను, ఎంపీగా మాగుంట శ్రీనివాసులరెడ్డిని గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఉడుముల చిన్నపురెడ్డి, మాజీ ఎంపీపీ పి.ఏసుదాసు, మాజీ సర్పంచ్ యక్కంటి సుబ్బారెడ్డి, అచ్చిరెడ్డి, నాలి బాలయ్య, నంబుల లక్ష్మయ్య, పలువురు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కొనకనమిట : మండలంలోని చింతగుంట గ్రామంలో 10 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు మోరబోయిన బాబురావు, టీడీపీ నాయకుల సమక్షంలో వీరు టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో పుట్లూరి నాగార్జునరెడ్డి, వేల్పుల గురవయ్య, బేళ్ల అంజయ్య, వంశపురం వెంకటచెన్నయ్య, మాచవరం వెంకటేశ్వర్లు, మార్కాపురం పెదకాశయ్య, చినకాశయ్య, మార్కాపురం కాశీం, ఆదిమూలపు ఎర్రయ్య, ఆదిమూలపు శేఖర్ తదితరులున్నారు.

రాజుపాలెంలో టీడీపీ ఎన్నికల ప్రచారం

మార్కాపురం రూరల్, ఏప్రిల్ 27: మండలంలోని రాజుపాలెం గ్రామంలో శనివారం రాత్రి నియోజకవర్గంలో పోల్ మేనేజ్మెంట్ ఇంచార్జ్ కందుల రామిరెడ్డి తనయుడు రోహిత్‌రెడ్డి నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని ప్రతిఇంటికి వెళ్లి ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందుల నారాయణరెడ్డికి, ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డికి ఓటు వేయాలని కోరారు. కూటమి అభ్యర్థులను గెలిపిస్తే మన ప్రాంత అభివృద్ధి జరుగుతుందని అన్నారు. మార్కాపురం జిల్లా కేంద్రం, వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేయడం వంటి పనులను అధికారంలోకి వచ్చిన వెంటనే చేస్తామని నాయకులు చెప్పిన విషయాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జవాజి రామానుజన్‌రెడ్డి, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు


దేవేర్లతో చెన్నకేశవుడు

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 27: మార్కాపురంలో వెలసిన శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా చెన్నకేశవస్వామి ఆలయాన్ని విద్యుత్ దీపాలంకరణలో అలంకరించారు. ప్రధానార్చకులు శ్రీపతి అప్పనాచార్యులు నిత్యం చెన్నకేశవస్వామి రాజ్యలక్ష్మీ అమ్మవార్ల మూలవిరాట్‌లను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. చెన్నుని బ్రహ్మోత్సవాలు తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతున్నారు. నేటి నుంచి చెన్నయ్య వాహనాలు పగలు నిర్వహించనున్నారు. పొన్న వాహనం, హనుమంత వాహనం, గరుడ వాహనం, మోహిని ఉత్సవం, గజ వాహనం, మే 1న రథోత్సవం నిర్వహించనున్నారు. ఆలయ కమిటీ ఈవో గొలమారి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షిస్తున్నారు.

కల్పవృక్ష వాహనంపై భక్తులకు దర్శనం

కంభం : కంభంలోని శ్రీవేంకటేశ్వర వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం రాత్రి స్వామి వారు కల్పవృక్ష వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమి చ్చారు. భక్తులు కాయకర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామి వారికి దీక్ష హోమం చేశారు. మాదాసు కోలాట బృందం చేసిన కోలాట ప్రదర్శన భక్తులను అలరించింది.

గిద్దలూరు : రాచర్ల మండలం సోమిదేవిపల్లి గ్రామంలో వెలసిన గణపతి, పోలేరమ్మ, అంకాలమ్మ దేవాలయంలో ధ్వజశిఖర ప్రతిష్ఠ, కుంభాభిషేక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రత్యేక హోమాలు జరిపారు. మూడు రోజులపాటు జరిపే మహోత్సవాలకు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసిన మనోజ్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కామూరి రమణరెడ్డి దేవస్థాన కమిటీ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు.



కంభంలో కల్పవృక్ష వాహనసేవ, సోమిదేవిపల్లెలవో పూజలు చేస్తున్న అర్చకులు

అవీ..ఇవీ..

చలివేంద్రాల ఏర్పాటు ఉపయోగకరం


చలివేంద్రం ప్రారంభిస్తున్న కమిషనర్

మార్కాపురం వన్ టౌన్, ఏప్రిల్ 27: వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసే చలివేంద్రాలు ఎంతో ఉపయోగకరమని మున్సి పల్ కమిషనర్ కిరణ్ అన్నారు. స్థానిక మున్సి పల్ కార్యాలయంలో మున్సిపల్ సిబ్బంది ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కమిషనర్ శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఈ షేక్ సుభానీ, మేనేజర్ శ్రీనివాసన్, ఏఈ ఆదినారాయణ, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రాల పరిశీలన


చలివేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

గిద్దలూరు, ఏప్రిల్ 27 : గిద్దలూరు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను కమిషనర్ శ్రీనివాసరావు పరిశీలించారు. పట్టణంలోని పెద్ద మార్కెట్ వద్ద, కుమ్మరాంకట్ట వద్ద, రైల్వేస్టేషన్ సమీపంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు తప్పనిసరిగా చలివేంద్రాలలో తాగునీటిని అందించాలని, నీరు అయిపోక ముందే తెప్పించుకునే ఏర్పాట్లు చేయాలని చలివేంద్రాల వద్ద ఉండే సిబ్బందిని ఆదేశించారు.

పోలింగ్ సిబ్బందికి శిక్షణ


పోలింగ్ ఆఫీసర్లకు శిక్షణ ఇస్తున్న అధికారులు

గిద్దలూరు, ఏప్రిల్ 27 : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో పోలింగ్ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. పోలింగ్ రోజు చేపట్టాల్సిన విధులకు సంబంధించి వివరాలు అందజేశారు. ఎన్నికల కమిషన్ ఇచ్చిన నిబంధనల మేరకు మాత్రమే పని చేయాలని సూచించారు. సహాయ రిటర్నింగ్ అధికారి సిద్ధార్థ, ట్రైనింగ్ నోడల్ ఆఫీసర్ రామచంద్రరెడ్డి, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

రైతులకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలి


మాట్లాడుతున్న డీఏవో శ్రీనివాసరావు

పొదిలి, ఏప్రిల్ 27 : ఎరువులు, పురుగు మందులు, విత్తనాల దుకాణాల్లో రైతులు కొనుగోళ్లపై బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు సూచించారు. శనివారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఎరువుల దుకాణాల డీలర్లతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నకిలీవిత్తనాల విషయంలో డీలర్లు తగుజాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డీలర్లకు ఎరువుల చట్టంలో వచ్చిన కొత్త విధివిధానాలను వివరిం చారు. రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలను విక్రయించాలని చెప్పారు. నకిలీ విత్తనాలు, బయో పురుగుమందులు విక్రయించినట్లు తెలిస్తే షాపు సీజ్ చేయడంతో పాటు చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. డీలర్లు నిర్వహించాల్సిన స్టాకురిజిస్టర్లు, బిల్లు పుస్తకాలు, ఇన్వాయిస్‌లు గురించి తెలిపారు. కార్యక్రమంలో దర్శి ఏడీఏ బాలజీనాయక్, టెక్నికల్ ఏవో ఎస్ శ్రీనివాసనాయక్, సాంకేతిక వ్యవసాయాధికారి రమేష్, పొదిలి, కొనకనమిట్ల, దొనకొండ ఏవోలు జైన్‌లుబ్దీన్, ప్రసన్న లక్ష్మీ, లక్ష్మీనారాయణ, డీలర్లు పాల్గొన్నారు.

చెంచు గిరిజనులకు టార్పాలిన్ పట్టలు పంపిణీ

పెద్ద దోర్నాల, ఏప్రిల్ 27: మండలంలోని ఎర్రకురవ గూడెంలోని చెంచు గిరిజనులకు మార్కాపురానికి చెందిన జీసస్ లవ్స్ మినిస్ట్రీస్ సొసైటీ ఫౌండర్ గుర్రం శేఖర్ టార్పాలిన్ పట్టలు శనివారం పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన 40 కుటుంబాలకు రూ.70 వేల విలువైన పట్టలు అందజేసినట్లు తెలిపారు. అనంతరం శేఖర్ మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. సంస్థ ఆధ్వర్యంలో మరిన్ని సేవలందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రెజరర్ బెన్ని సునీతా రూత్, సిబ్బంది విజయ్‌కుమార్, ఏసన్న, దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాల్లో నాణ్యతను పాటించాలి

- ఐటీడీఏ పీవో రవీంద్రారెడ్డి


నిర్మాణాలను పరిశీలిస్తున్న పీవో

పెద్ద దోర్నాల, ఏప్రిల్ 27: భవన నిర్మాణాల్లో నాణ్యతను పాటించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రవీంద్రారెడ్డి అన్నారు. స్థానిక ఏకలవ్య గురుకుల ఆదర్శ పాఠశాలలో నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల నిర్మాణాలను ఐటీడీఏ పీవో రవీంద్రారెడ్డి శనివారం పరిశీలించారు. నిర్మాణంలో నాణ్యతా లోపాలు లేకుండా చూడాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అదే విధంగా పాఠశాలలో జరుగుతున్న ఈఎంఆర్ఎస్ఎస్‌టీ-24 ప్రశ్నాపత్రాల మూల్యాంకాలను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పీ.శ్యామూల్ జోబ్, వైస్‌ప్రిన్సిపాల్ బాలయ్య పాల్గొన్నారు.

ఎన్‌డీఏ కూటమితోనే రాష్ట్రంలో అభివృద్ధి


కంభంలో ప్రచారం నిర్వహిస్తున్న దివ్యేష్‌రెడ్డి

కంభం, ఏప్రిల్ 7 : ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో రాష్ట్రంలో తాజాగా జరిగే ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులు గెలిచి అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని గిద్దలూరు ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి కుమారుడు ముత్తుముల దివ్యేష్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం సాయంత్రం కంభం పట్టణంలోని జయప్రకాశ్ వీధి, మేదర వీధుల్లో ఇంటింటికి తిరిగి ఎన్నిక ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యేష్‌రెడ్డి మాట్లాడుతూ జగన్ పరిపాలనలో రాష్ట్రంలో పూర్తిగా అదోగతిపాలైందన్నారు. అనంతరం ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు.

విద్యుత్ తీగలు తెగిపడి గేదెలు మృతి

కొనకనమిట్ల, ఏప్రిల్ 27 : విద్యుత్ తీగలు తెగిపడి ఏడు గేదెలు మృతిచెందిన ఘటన మండలంలోని అంబాపురం గ్రామ సమీప పొలాల్లో చోటుచేసుకొంది. విద్యుత్ వైర్లు తెగిపడి ఏడు గేదెలు మృత్యువాత పడ్డాయి. వివరాల్లోకి వెళితే అంబాపురం గ్రామ సమీప పొలాల్లో గేదెలు మేత మేస్తుండగా ఎండ వేడికి ప్రమాద వశాత్తు విద్యుత్ తీగలు తెగి గేదెలపై పడ్డాయి. దీంతో ఏడు గేదెలు మృతి చెందాయని బాధితులు చెప్పారు. గ్రామానికి చెందిన చెందిన పెరికే పుల్లయ్య 2 గేదెలు, పెరికే దానియేలు 2, సువార్తమ్మ, కొండయ్య, అబ్రహాంలకు చెందిన ఒక్కోగేదె మృతిచెందాయి.

చంద్రబాబు నాయకత్వమే రాష్ట్రానికి శ్రీరామరక్ష

సీఎస్‌పురం(పామూరు), ఏప్రిల్ 27: వైసీపీ పాలనలో అధ్వానంగా తయారైన రాష్ట్రం తిరిగి గాడిలో పడాలంటే చంద్రబాబు నాయకత్వమే శ్రీరామరక్ష అని టీడీపీ కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు మాగుంట, ఉగ్ర పేర్కొన్నారు. శనివారం రాత్రి సీఎస్‌పురంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో వారు మాట్లాడారు. ఓటు అనే ఆయుధంతో వైసీపీ పాలనను తరిమికొట్టాలని పిలుపు నిచ్చారు. అభివృద్ధే ధ్యేయంగా పనిచేసే కూటమి అభ్యర్థులను గెలిపించా లన్నారు. అనంతరం గజమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దర్శిలో పోలీసుల కవాతు


దర్శిలో కవాతు చేస్తున్న స్పెషల్ పార్టీ పోలీసులు

దర్శి, ఏప్రిల్ 27 :ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించే కార్యక్రమంలో భాగంగా దర్శి పట్టణంలో స్పెషల్ పార్టీ పోలీసులు శనివారం సాయంత్రం కవాతు నిర్వహించారు. డీఎస్పీ అశోక్‌వర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన వీధుల్లో సుమారు 200 మంది పోలీసులు కవాతు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఎవరైనా అక్రమాలకు పాల్పడినా, శాంతి భద్రతలకు విఘాతం కల్గించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు షేక్ షమీముల్లా, సుమన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే మైనార్టీలకు గుర్తింపు

పామూరు, ఏప్రిల్ 27: టీడీపీ హయాంలోనే రాష్ట్రంలోని ముస్లింలకు రాజకీయ గుర్తింపు లభించిందని ఆపార్టీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు తెలిపారు. ముస్లింలకు పలు సంక్షేమ పథకాలు, రాయితీతో కూడిన బ్యాంక్ రుణాలు అందించినట్టు గుర్తుచేశారు. కనిగిరిలోని అమరావతి గ్రౌండ్‌లో శనివారం జరిగిన టీడీపీ ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమావేశానికి పామూరు నుంచి ప్రత్యేక వాహనాల్లో శనివారం తరలివెళ్లారు. వాహనాలకు పువ్వాడి జెండా ఊపి సాగనంపారు. తరలివెళ్లిన వారిలో సయ్యద్ అమీర్‌బాబు, ఆర్‌ఆర్ రఫీ, షేక్ ఖాజారహంతుల్లా, గౌస్‌బాషా, కావేరి రసూల్, తదితరులు పాల్గొన్నారు.

జీవైఆర్‌కు నివాళి

పామూరు, ఏప్రిల్ 27: గుజ్జుల యలమందారెడ్డి(జీవైఆర్) ఉద్యమ స్ఫూర్తితో పార్టీ విస్తరణ, అభివృద్ధికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు సయ్యద్ మౌలాలి అన్నారు. శనివారం స్థానిక జీవైఆర్ భవన్‌లో జరిగిన వర్ధంతి కార్యక్రమంలో యలమందారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వజ్రాల సుబ్బారావు, పి.ప్రభాకర్, ఆర్.సూరిబాబు, ప్రసాద్, మహేష్, ఫ్రాన్సిస్, రమణారెడ్డి, హరి పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలతో మహిళలకు ప్రయోజనం

పామూరు, ఏప్రిల్ 27: టీడీపీ ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలతో మహిళలకు ఎంతో మేలు జరుగుతుందని ఆపార్టీ పట్టణ ఫోర్‌మెన్ కమిటీ సభ్యులు ఉప్పలపాటి హరిబాబు, పందిటి హరీష్ అన్నారు. శనివారం పామూరు పట్టణంలోని పలుప్రాంతాల్లో టీడీపీ పథకాలపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలు అందజేశారు. అలాగే, మండలంలోని కంభాలదిన్నె, రావిగుంటపల్లి గ్రామాల్లో సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ ఎన్నికల్లో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు మాగుంట, ఉగ్రను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు మన్నం రమణయ్య గోళ్ల వీరబాబు, కోలా కృష్ణమూర్తి, కంచర్ల శ్రీనివాసులు, బ్రహ్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల పనితీరుపై ఓపీవోలకు అవగాహన

దొనకొండ, ఏప్రిల్ 27: ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు ఈవీఎం యంత్రాల పనితీరుపై అవగాహన కల్గిఉండాలని తహసీల్దార్ సుజాత అన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈవీఎంల పనితీరుపై ఓపీవోలకు శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సుజాత మాట్లాడుతూ సచివాలయాల సిబ్బంది ఓపీవోలుగా ఎన్నికల విధులకు మొదటిసారి హాజరవుతున్నందున ఈవీఎంల పనితీరుపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలన్నారు. మాస్టర్ ట్రైనర్ వీవీ రామాంజనేయులు, సెక్టోరియల్ అధికారి షేక్ అమీర్‌లు ఈవీఎం యంత్రాలను ఎన్నికల సమయంలో ఉపయోగించే విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలను, పనితీరుపై ఓపీవోలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఆర్వోలు ఐలూరి పిచ్చిరెడ్డి, తన్నీరు హరినారాయణ, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

30 మద్యం బాటిళ్లు పట్టివేత

దొనకొండ, ఏప్రిల్ 27: మండలంలోని చందవరం గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై సంపత్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. కాశీపురం గ్రామానికి చెందిన సాదం చిన్నయోగయ్య అనే వ్యక్తిపై అనుమానంతో పోలీసులు తనిఖీచేశారు. ఆయన దగ్గర ఎటువంటి అనుమతులు లేకుండా 30 మద్యం బాటిళ్ల ఉండగా, వాటిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు ప్రజలు సహకరించాలి

పీసీపల్లి, ఏప్రిల్ 27: ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు ప్రజలు సహకరించాలని డీఎస్పీ రామరాజు అన్నారు. శనివారం మండలంలోని పెదఅలవలపాడులో గ్రామస్థులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై రమేష్‌బాబు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

పామూరు, ఏప్రిల్ 27: సార్వత్రిక ఎన్నికల్లో నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని డీఎస్పీ ఎం.రామరాజు అన్నారు. స్థానిక మమ్మి డాడి సెంటర్‌లో సాయుధ దళాలతో శనివారం సాయంత్రం కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ రోజున ఓటర్లకు భయభ్రాంతులకు గురిచేస్తే కఠినంగా అణచివేస్తామని హెచ్చరించారు. ఎన్నికలు సజావుగా జరిగేలా ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం పట్టణంలోని ప్రధాన వీధుల్లో కవాతు నిర్వహించి ఓటర్లలో ధైర్యాన్ని నింపారు. కార్యక్రమంలో కనిగిరి, పామూరు సీఐలు వెంకట్, రామానాయక్, పామూరు, సీఎస్‌పురం, వెలిగండ్ల ఎస్ఐలు ఎం.సైదుబాబు, ప్రేమ్‌కుమార్, శివ, తదితరులు పాల్గొన్నారు.

మైనర్ బాలికపై అత్యాచారయత్నం

ముండ్లమూరు, ఏప్రిల్ 27: మండలంలోని నాయుడుపాలెం పంచాయతీ పరిధిలో 13 ఏళ్ళ మైనర్ బాలికను అదే గ్రామానికి చెందిన చొప్పరపు బ్రహ్మయ్య(22) అనే యువకుడు శనివారం తెల్లవారు జామున అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. బాలిక ఇంట్లో నిద్రిస్తుండగా అఘాయిత్యానికి యత్నించగా, బాలిక పెద్దగా కేకలు వేసింది. దీంతో ఇంటిపై నిదిస్తున్న తల్లిదండ్రులు, చుట్టుపక్కల బంధువులు వచ్చేసరికే బ్రహ్మయ్య పారిపోయాడు. ఈమేరకు బాలిక తల్లిదండ్రులు ముండ్లమూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ వి.ఆంజనేయులు ఫోక్సో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడిని వెంటనే అరెస్టు చేసి అద్దంకి కోర్టులోని జూనియర్ జడ్జి ఎదుట హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు ఎస్ఐ తెలిపారు.

గొట్టిపాటి లక్ష్మికి మద్దతు ఇవ్వండి

ముండ్లమూరు, ఏప్రిల్ 27: టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మికి సేవ చేసే అవకాశం కల్పించాలని ఆమె సోదరుడు భరత్ కోరారు. శనివారం సాయంత్రం మండలంలోని పులిపాడు, బృందావనం, ఎస్సీ కాలనీ, బంగారమ్మ గుట్ట, తండా గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఒక్క అవకాశం కల్పించినట్లయితే దర్శిని నెంబర్ వన్ నియోజక వర్గంగా తీర్చిదిద్దుతామన్నారు. అలాగే, మండలంలోని మారెళ్ళలో లక్ష్మి తల్లి పద్మ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తన కుమార్తె లక్ష్మి ప్రజాసేవ చేయటానికి రాజకీయాల్లోకి వచ్చిందని, అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ చిన్నా నాయక్, గుద్దేటి చిన నారాయణరెడ్డి, ఏరేసి వెంకటేశ్వర రెడ్డి, తులసీ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని వీడిన 18 ముస్లిం కుటుంబాలు

పామూరు, ఏప్రిల్ 27 : పామూరు పట్టణానికి చెందిన పలు ముస్లిం కుటుంబాలు వైసీపీ నాయకులు అనుసరిస్తున్న విదానాలు నచ్చక ఆపార్టీని వీడుతున్నారు. పట్టణానికి చెందిన 18 ముస్లిం కుటుంబాలు కనిగిరిలోని అమరావతి గ్రౌండ్స్‌లో జరిగిన ఆత్మీయ సమావేశంలో శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్, మాగుంట, ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండు వాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

కనిగిరి అభివృద్ధికి పక్కా ప్రణాళిక


జగనాసుర రక్తచరిత్ర పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీ మాగుంట, డాక్టర్ ఉగ్ర తదితరులు

» ఎంపీ మాగుంట

కనిగిరి, ఏప్రిల్ 27: సూపర్‌సిక్స్ పథకాలతో ప్రజలకు సంక్షేమాన్ని అందించి ఏపీని అభివృద్ధి అందించేందుకు చంద్రబాబు, సూపర్ ఫైవ్ కార్యక్రమాలతో ప్రణాళికాబద్ధంగా కనిగిరి ప్రాంత అభివృద్ధికి డాక్టర్ ఉగ్ర కృత నిశ్చయంతో ఉన్నారని ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో శనివారం టీడీపీ నాయకులు, కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ పాలనలో అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. ఎన్నికలు కేవలం 15 రోజులు మాత్రమే ఉన్నాయన్నారు. ప్రతి నాయకుడు ప్రజలకు మరింత చేరువై టీడీపీకి ఓట్లు వేయించేలా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలోని పశ్చిమ ప్రాంతం అభివృద్ధి కోసం తన కుటుంబం ఎంతో కృషి చేసిందని చెప్పారు.

టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ బూత్ పరిదిలో వచ్చే 15 రోజులు మెజార్టీ కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీకోసం పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటింటికి తిరిగి టీడీపీ విజయానికి కృషి చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. గ్రామాల్లో పనిచేయకుండా పార్టీ ఆఫీసుకు రావద్దన్నారు. కేవలం నాకు కనిపించాలనే నెపంతో కార్యక్రమాలు చేయకుండా ఉండేవారికి పార్టీలో సముచిత స్థానం లభించదని చెప్పారు. కొత్తగా వచ్చే వారిపట్ల అనవసరపు అపోహలకు పోవద్దన్నారు. ఐదేళ్ళు కష్టపడి పార్టీ అభివృద్ధికి కృషి చేసినవారికి ఎప్పుడూ తగిన గుర్తింపు ఉంటుందని చెప్పారు. ఎంపీ అభ్యర్థిగా తనకు తండ్రి సమానులైన మాగుంట రావటం తనకెంతో సంతోషానిచ్చిందన్నారు. ఆయన కుటుంబానికి కనిగిరి ప్రాంత ప్రజలకు ఎంతో అవినాభావ సంబంధం ఉందన్నారు. ఈసందర్భంగా జగనాసుర రక్తచరిత్ర పోస్టర్లను ఆవిష్కరించారు.

కార్యక్రమంలో టీడీపీ నాయకులు దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, రాచమల్ల శ్రీనివాసులరెడ్డి, నాగరాజు, వీవీఆర్ మనోహరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆదరించండి.. అండగా ఉంటాం


వెలిగండ్ల: ప్రచార రథంపై నుంచి మాట్లాడుతున్న మాగుంట, ఉగ్ర

వెలిగండ్ల, ఏప్రిల్ 27: ఆదరించండి.. అండగా ఉంటామని టీడీపీ కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు మాగుంట శ్రీనివాసులరెడ్డి, డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మొగళ్ళూరులో వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు ఈసందర్భంగా మాగుంట మాట్లాడుతూ కనిగిరి ప్రాంతంలో వైసీపీ ప్రభుత్వం గడిచిన ఐదేళ్లల్లో ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టలేదన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వెలిగండ్ల మండలంలో అభివృద్ధి పనులు చేపడతామని చెప్పారు. బల్లవరం, నర్సమాంబాపురం రోడ్లు పూర్తి చేస్తామన్నారు. ఉగ్ర మాట్లాడుతూ కనిగిరి నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటు, నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైన్, నిమ్జ్, వెలిగండ ప్రాజెక్ట్ పూర్తిచేసి ఇక్కడే యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు దొడ్డ వెంకటసుబ్బారెడ్డి, ముత్తిరెడ్డి, కేలం ఇంద్రభూపాల్ రెడ్డి, గవదకట్ల హరి, బాల కోటిరెడ్డి, కర్నాటి భాస్కర్‌రెడ్డి, మీనిగ కాశయ్య, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి చంద్రబాబుకే సాధ్యం

» టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

తాళ్లూరు, ఏప్రిల్ 27: సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా చూస్తూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపే సత్తా చంద్రబాబుకే సాధ్యమని టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. శనివారం సాయంత్రం మండలంలోని రామభద్రాపురం, దోసకాయలపాడు, తోటవెంగన్నపాలెం, లక్కవరం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో నాశనమైందన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉండి, యువత ఉద్యోగావకాశాలు లేక కష్టాలు పడుతున్నారు. చంద్రబాబు రైతుల పక్షపాతిగా, మహిళా పక్షపాతిగా, పేదల పక్షపాతిగా నిలిచారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అధికారంలోకి వచ్చి చంద్రబాబు సీఎం కాగానే సూపర్ సిక్స్ పథకాల కింద యువతకు 20లక్షల ఉపాధి అవకాశాలు కల్పిస్తారని చెప్పారు. .రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేందుకు ఎవరు కృషి చేస్తున్నారో ప్రజలు ఆలోచించి నవ్యాంధ్ర సృష్టి కర్త చంద్రబాబును సీఎంగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మే 13న జరుగనున్న ఎన్నికల్లో ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థిగా మాగుంట శ్రీనివాసులరెడ్డిని, దర్శి అసెంబ్లీ ఎమ్మెల్యే తనను అధిక మెజారిటీతో గెలిపించాలని గొట్టిపాటి లక్ష్మి కోరారు.


దర్శి: గొట్టిపాటి లక్ష్మి సమక్షంలో టీడీపీలో చేరిన కట్టుబడివారిపాలెం గ్రామస్థులు


రామభద్రాపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, ఎంపీపీ తాటికొండ శ్రీను

ఆయాగ్రామాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు ఆమెకు అపూర్వ స్వాగతం పలికారు. మహిళలు హారతులు ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బొమ్మిరెడ్డి ఓబుల్‌రెడ్డి, ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, షేక్ హుస్సేన్, నల్లపాటి సత్యనారాయణ, బొడ్డు హనుమారెడ్డి , షేక్ అన్వర్, షేక్ చినమౌలాలి, మేడగం వెంకటేశ్వరరెడ్డి, కృష్ణారెడ్డి, లక్ష్మిరెడ్డి, శాగం కొండారెడ్డి, మానం రమేష్‌బాబు, వల్లభనేని సుబ్బయ్య, షేక్ కాలేషావలి, వేణుబాబు, తదితరులు పాల్గొన్నారు.

20 కుటుంబాలు టీడీపీలో చేరిక

దర్శి ఏప్రిల్ 27: మండలంలోని కట్టుబడివారిపాలెంకు చెందిన షేక్ బాషా, చిట్టిబాబు ఆధ్వర్యంలో 20 కుటుంబాలు శనివారం వైసీపీని వీడి టీడీపీలో చేరారు. కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ కూటమి పట్ల ప్రజల్లో రోజురోజుకు అభిమానం, నమ్మకం పెరుగుతుందన్నారు. చంద్రబాబు సారథ్యంలోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని, అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్న నమ్మకంతో టీడీపీలోకి భారీగా చేరుతున్నారని చెప్పారు. ప్రజల నమ్మకానికి అనుగుణంగా పనిచేసి వారి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మాయమాటలతో ప్రజలను మోసం చేయలేరు!

దర్శి, ఏప్రిల్ 27 : ఎన్నికల మేనిఫెస్టో పేరుతో మాయమాటలు చెప్పి ప్రజలను ప్రతిసారీ జగన్‌మోహన్‌రెడ్డి మోసం చేయలేరని టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ధ్వజమెత్తారు. శనివారం వైసీపీ ప్రకటించిన మేనిఫెస్టోపై ఆమె స్పందించారు. గత ఎన్నికల మేనిఫెస్టోలో మద్యపానం నిషేధం అమలుచేసిన తర్వాతనే 2024 ఎన్నికల్లో ఓట్లు అడుగుతామని ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతుందని, మహిళలను దారుణంగా మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్యపాన నిషేధం అమలు చేయకుండా మహిళల ఓట్లు ఏ మొఖం పెట్టకొని అడుగుతారని ఆమె ప్రశ్నించారు. ఎన్నికల మేనిఫెస్టోను బైబిల్, ఖురాన్, భగవద్గీతతో సమానం అని చెప్పిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలుచేయకుండా ప్రజలను మోసం చేశారని విమర్శించారు. కల్లబొల్లి మాటలు చెప్పి మళ్లీ కొత్త హామీలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ప్రజలు అన్నీ విషయాలు గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో మోసం చేసిన వైసీపీకి గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని గొట్టిపాటి లక్ష్మి పేర్కొన్నారు. టీడీపీ కూటమి ప్రకటించిన మేనిఫెస్టోపై ప్రజలు ఎంతో విశ్వాసంతో ఉన్నారని చెప్పారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు పేదల అభ్యున్నతికి దోహదపడతాయన్నారు. టీడీపీ కూటమి అభ్యర్థులను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. దర్శి అసెంబ్లీకి పోటీ చేస్తున్న తనను, ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

44 మంది వలంటీర్లు రాజీనామా

ముండ్లమూరు, ఏప్రిల్ 27: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 44 మంది వలంటీర్లు శనివారం ఎంపీడీవో బి.శంకరరావుకు రాజీనామా పత్రాలు అందజేశారు. ఆయా గ్రామాలకు చెందిన రాజకీయ నాయకులు, వలంటీర్లను వెంటపెట్టుకొని వచ్చి రాజీనామాలు అందజేశారు.

టీడీపీలో భారీగా చేరికలు


ముండ్లమూరు: టీడీపీలో చేరిన ఈదర వైసీపీ నేతలు

ముండ్లమూరు, ఏప్రిల్ 27: మండలంలో పలువురు టీడీపీలో చేరారు. ఈదర గ్రామానికి చెందిన వైసీపీ నేత, మాజీ సర్పంచ్ కిష్టపాటి అంజిరెడ్డి, ఉమామహేశ్వర అగ్రహారం మాజీ సర్పంచ్ వేముల శ్రీను తన అనుచరులతో శనివారం సాయంత్రం మాగుంట రాఘవరెడ్డి, డాక్టర్ లలిత్ సాగర్, గరికపాటి వెంకట్ సమక్షంలో టీడీపీలో చేరారు. అంజిరెడ్డితో తన అనుచరులు 50 కుటుంబాలు, అడపాల రవ్వారం, అడపాల వెంకటేశ్వరరావు పార్టీలో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ మందలపు వెంకటరావు, సోమేపల్లి శ్రీనివాసరావు, నాగమల్లి అంకమ్మరావు, తదితరులు పాల్గొన్నారు.

దొనకొండలో 11 కుటుంబాలు..

దొనకొండ, ఏప్రిల్ 27: మండలంలోని చందవరం గ్రామానికి చెందిన పలువురు వైసీపీ సానుభూతిపరులు టీడీపీ నాయకుడు వీరపనేని వెంకన్న చౌదరి, మాజీ ఎంపీపీ నూనె విజయకుమారి నేతృత్వంలో శనివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. గ్రామానికి చెందిన నూనె బాలయేసు, నూనె మరియదాసు, నూనె కోటేశ్వరరావు, వజ్రగిరి బాబు, మరో 15 కుటుంబాలు, ఎర్రబాలెం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు మేకల యోహాన్‌కు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ పార్టీ కండవాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో రామాపురం మాజీ సర్పంచ్ కామేపల్లి నారాయణమ్మ, ఫణిదపు వీరాంజనేయులు, సింగమనేని హనుమంతరావు, దొండపాటి వెంకటేశ్వర్లు, విప్పర్ల శేషు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ సర్పంచ్

వెలిగండ్ల, ఏప్రిల్ 27: వెలిగండ్ల మండలంలో వైసీపీకి మరో షాక్ తగిలింది. మండలంలోని మొటుపల్లి సర్పంచ్ గాలి తిరుపతి రెడ్డి టీడీపీలో చేరారు. శనివారం కనిగిరిలోని టీడీపీ కార్యాలయంలో ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి, కనిగిరి అభ్యర్థి డాక్టర్ ఉగ్రనరసింహ రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దొడ్డ వెంకటసుబ్బారెడ్డి, వెంకటశ్రీరాములు, వెంకటేశ్వర్‌రెడ్డి, రాజగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని వీడిన కొత్తరెడ్డిపాలెం నేత

దర్శి, ఏప్రిల్ 27: టీడీపీలోకి వలసలు కొనసాగుతున్నాయి. దర్శి నగర పంచాయతీలోని కొత్తరెడ్డిపాలెంకు చెందిన కీలక వైసీపీ నేత వై.సుబ్బారెడ్డి శనివారం టీడీపీలో చేరారు. కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి భర్త డాక్టర్ లలిత్‌సాగర్ ఆయనకు టీడీపీ కండవా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసం దర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనపై విసుగు చెందిన ఆపార్టీ కీలక నేతలు అనేకమంది టీడీపీలో చేరటం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మందలపు వెంకటరావు, పారా గాలయ్య, మేడగం రామిరెడ్డి, ఆవుల రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని వీడిన 11 కుటుంబాలు

తాళ్లూరు, ఏప్రిల్ 27: టీడీపీ తాళ్లూరు గ్రామ నేత ఇడమకంటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీకి పది కుటుంబాలు, వార్డుమెంబర్ భర్త వైసీపీని వీడి మాగుంట రాఘవరెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. శనివారం రాత్రి తాళ్లూరులో రాఘవరెడ్డిపర్యటించారు. ఈసందర్భంగా ఎస్సీ కాలనీకి చెందిన వైసీపీ నేత అనపర్తి ప్రకాశరావుతోపాటు మరో పది కుటుంబాలు వైసీపీ వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వార్డు సభ్యురాలు భర్త కోట శివ వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారికి మాగుంట రాఘవరెడ్డి టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీలో ఎస్సీలకు తీరని అన్యాయం జరిగిందన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరగాలంటే చంద్రబాబు సీఎం కావాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఐవీ రమణారెడ్డి, ఐ.శ్రీనివాసరెడ్డి, ఐ.కృష్ణా రెడ్డి, తూము శివనాగిరెడ్డి, అనపర్తి సుబ్బారావు, కోట అంకమ్మ, మెలికా అంజమ్మ, మాగంటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమాన్ని విస్మరించిన జగన్

» శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్


మాట్లాడుతున్న శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్

కనిగిరి, ఏప్రిల్ 27: ఐదేళ్ళ పాలనలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి ముస్లింల సంక్షేమాన్ని గాలికొదిలేశారని శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్ అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో శనివారం రాత్రి జరిగిన ముస్లింల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్నికలు ఇంకా పక్షం రోజులు మాత్రమే ఉన్నాయన్నారు. వైసీపీ సైకో పాలనను సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. జగన్ ఐదేళ్ళ పాలనలో ముస్లింలపై దాడులు, అత్యాచారాలు, హత్యలు పెరిగిపోయాయన్నారు. అందుకు మిస్బా లాంటి ముక్కుపచ్చలారని చిన్నారి ఆత్మహత్య ఓ నిదర్శనమని ఆవేదన వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వంపై ముస్లిం కుటుంబాలు అపోహలకు పోవద్దన్నారు. నాలుగు శాతం రిజర్వేషన్ ముస్లింలకు ఎత్తివేస్తారనే తప్పుడు సమాచారాలను ప్రచారం చేస్తున్న వైసీపీ కుయుక్తులను తిప్పికొట్టాలన్నారు. అలాంటి నిర్ణయం మోదీ ఎప్పుడూ తీసుకోబోరన్నారు. చంద్రబాబు పాలనలో ముస్లిం సంక్షేమం కోసం దాదాపు 45వేల మంది ముస్లిం కుటుంబాల ఆర్థిక పురోగతికి రుణాలు ఇప్పించిన విషయాన్ని గుర్తు చేశాడు. జగన్ అధికారంలోకి రాక ముందు ఇస్లామిక్ బ్యాంకు ఏర్పాటు చేస్తామని చెప్పి మోసం చేశారన్నారు. దుల్హన్ పథకాన్ని తుంగలో తొక్కి అడ్డమైన నిబంధనలను పెట్టారన్నారు. జగన్ పాలనలో ముస్లిం సంక్షేమానికి ఒక్క పైసా కూడా ఇవ్వలేదన్నారు. పాలనాదక్షత కల్గిన నేత చంద్రబాబు అని, ఆయన లాంటి వ్యక్తిని సీఎంగా చేసుకోకపోతే రాష్ట్రాన్ని బాగుచేయటం ఎవరివల్లా కాదని షరీఫ్ పేర్కొన్నారు. మంచి వ్యక్తిత్వం, రాష్ట్రం, ప్రజల ఉజ్వల భవిష్యత్తుకై అనునిత్యం తపనపడే జనసేనాని పవన్‌కల్యాణ్, చంద్రబాబు కలయిక ఓ చరిత్ర అన్నారు. చంద్రబాబుకు ఓ కన్ను ముస్లిం అయితే, మరో కన్ను హిందువు అన్నారు. అలాంటి వ్యక్తిపై జగన్ తప్పుడు కేసులు బనాయించి 53 రోజులు జైలులో ఉంచారని అన్నారు. జగన్‌ను ప్రజలు నమ్మితే నట్టేట్లో మునిగినట్లేనని చెప్పారు. ముస్లింలకు ఎప్పుడూ అండగా ఉండేది చంద్రబాబు ఒక్కరే అని అన్నారు. ఆయనను ముస్లిం కుటుంబాలు నమ్మాలని కోరారు. చంద్రబాబు సీఎం కావాలంటే ఎంపీ అభ్యర్థిగా మాగుంట శ్రీనివాసులరెడ్డిని, ఎమ్మెల్యే అభ్యర్థిగా డాక్టర్ ఉగ్రను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. తొలుత షరీఫ్‌ను ఎంపీ మాగుంట, డాక్టర్ ఉగ్ర ఘనంగా సత్కరించారు.

కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ రాష్ట్ర నాయకులు రోషన్‌సంధాని, జంషీర్, గుడిపాటి ఖాదర్, అహ్మద్, ఫిరోజ్, నజిముద్దీన్, షరీఫ్, బడేబాయి, ఫారూక్, తెలుగుమహిళలు షేక్ వాజిదాబేగం, సమీరా, ఫాతిమా, జనసేన నాయకులు రహీముల్లా, తదితరులు పాల్గొన్నారు.





యువ ఓటర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా



ఓటేద్దాం.. వేయిద్దాం..

◆ 3కే వాక్‌లో నినదించిన యువత

◆ కర్తవ్యంగా భావించి ఓటింగ్‌లో పాల్గొనాలి : ముఖేష్ కుమార్ మీనా

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 27: ఓటు వేద్దాం.. వేయిద్దాం. ఓటు వేయండి గళం వినిపించండి.. ఓటు విలువ తెలుసుకో.. మంచి నేతను ఎన్నుకో. ఓటు విలువ తెలుసుకో.. తలరాతను మార్చుకో. ప్రలోభాల ఓటు.. ప్రగతికి చేటు.. అంటూ యువత నినదించింది. ఓటరు అవగాహన కోసం లెట్స్ ఓట్ సంస్థ, జిల్లా యంత్రాంగం సంయుక్తంగా గుంటూరులో 3కే వాక్ నిర్వహించింది. మొదటిసారి ఓటు హక్కు వినియోగించుకోనున్న యువత పెద్దసంఖ్యలో ఈ 3కే వాక్‌లో ఉత్సాహంగా పాల్గొంది. స్థానిక ఎన్టీఆర్ స్టేడియం నుంచి 3 కే వాక్‌ను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్‌మీనా ప్రారంభించారు. ఎన్టీఆర్ స్టేడియం వద్ద ప్రారంభమైన ఈ నడక మదర్ థెరిస్సా విగ్రహం, కొరిటెపాడు, ఐటీసీ హోటల్ మీదగా తిరిగి ఎన్టీఆర్ స్టేడియం వరకు సాగింది. అంతకుమందు ఓటు వినియోగంపై యువత చేత రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య పండుగను విజయవంతం చేయడానికి మే 13న యువ ఓటర్లు ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలన్నారు. అదేవిధంగా మిగిలిన వారితో కూడా ఓటు వేయించేలా కృషి చేయాలని యువతకు సూచించారు. ఓటరు అవగాహన కార్యక్ర మాలు నిర్వహిస్తున్న లెట్స్ ఓట్ సంస్థ నిర్వాహకులను అభినందించారు.



మొదటి సారి ఓటు వినియోగించుకునే విద్యార్థినులు

ఓటింగ్‌పై అవగాహన..

రాష్ట్రంలో పోలింగ్ నమోదు శాతం గణనీయంగా పెంచేందుకు జిల్లాల వారీగా ఓటరు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ముఖేష్‌కుమార్‌మీనా తెలిపారు. మధ్య తరగతి, ఉన్నత మధ్య తరగతి వర్గాలకు చెం దిన వారు ఓటు హక్కు వినియోగించుకునేలా వారు నివసిస్తున్న ప్రాంతాల్లోని వెల్ఫేర్ అసోసియేషన్ల ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. రాష్ట్రంలో వైజాగ్, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, కర్నూలు, తిరుపతి నగరాల్లో ఓటింగ్ శాతం తక్కువగా ఉందని ఆయా ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టడం ద్వారా ఓటింగ్ శాతం పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 18 నుంచి 19 సంవత్సరాల వయస్సు కలిగిన యువతి, యువకులు 43,500 మందిని ఓటర్లుగా నమోదు చేశామన్నారు. వీరందరూ ఓటు వేయడంతో పాటు వారి కుటుంబసభ్యులు, స్నేహితులు కూడా ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద లైన్లలో నిల్చోవాలన్న కొద్దిపాటి నిర్లిప్తత వల్ల ఓటు విని యోగంలో ఆసక్తి చూపడం లేదన్నారు. వారం దరిలో ఓటుపై అవగాహన కల్పించి, ఓటింగ్‌లో పాల్గొనేలా యువత కీలక పాత్ర పోషించాలని సూచించారు. జేసీ రాజకుమారి, నగరపాలక సంస్థ కమిషనర్ చేకూరి కీర్తి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో పెద్ది రోజా, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కే రాజ్యలక్ష్మి, ఆర్డీవో శ్రీకర్, లెట్స్ ఓట్ గుంటూరు చాప్టర్ కన్వీనర్ ప్రొఫెసర్ కే మాలకొండయ్య, కో ఆర్డినేటర్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



3కే వాక్‌లో మొదటిసారి ఓటు హక్కు వినియోగించుకునే విద్యార్థులు

రేపల్లెను.. తీర్చిదిద్దుతా

- ఉత్తమ నియోజకవర్గంగా మారుస్తా
- వైసీపీ పాలనలో తీరంలో అభివృద్ధి శూన్యం
- ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయం
- ఆంధ్రజ్యోతితో రేపల్లె అభ్యర్థి అనగాని సత్యప్రసాద్



రేపల్లె, ఏప్రిల్ 27: విస్తారమైన సముద్ర తీరం.. కృష్ణమ్మ నది.. సిరులు పండే వ్యవసాయ భూములు.. నిజాంపట్నం హార్బర్.. ఆక్వా రంగం.. ఇలా విస్తారమైన అవకాశాలతో అభివృద్ధికి కేంద్రంగా రేపల్లె ఉండాలి. కానీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో రేపల్లె నియోజకవర్గం వెనకబడింది. అభివృద్ధికి నోచుకోక ఎక్కడ సమస్యలు అక్కడ ఉన్నాయి. రోడ్లు, డ్రెయిన్లు, తాగునీరు తదితర సమస్యలతో ప్రజలు అల్లాడుతున్నారు. ఈ పరిస్థితుల్లో తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే నియోజకవర్గాన్ని ఉత్తమ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా.. అని కూటమి తరపున రేపల్లె నియోజకవర్గ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా బరిలో ఉన్న ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ఆంధ్రజ్యోతికి తెలిపారు. నియోజకవర్గానికి సంబంధించి ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. కృష్ణానదిపై చెక్‌డ్యామ్‌లు నిర్మిస్తామని శంకుస్థాపనలు చేసిన ముఖ్యమంత్రి కనీసం ఒక్క రాయి కూడా పేర్చిన పరిస్థితి లేదన్నారు. ఎన్నికల ప్రచారంలో నియోజకవర్గంలో ఏగ్రామానికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, వారు చూపే ప్రేమ, ఆదరాభిమానాలు మరువలేనివని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో అనగాని సత్యప్రసాద్ తెలిపారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో నిర్లక్ష్యానికి గురైన నియోజకవర్గం, ప్రజా సమస్యలపై పాలకుల నిర్లక్ష్యం, ప్రజల ఇబ్బందులు తదితర అంశాలకు సంబంధించి ఆయన మాటల్లోనే..

అనగాని హామీలు...

- ◆ నియోజకవర్గంలోని రహదారుల అభివృద్ధి
- ◆ చివరి భూముల వరకు సాగునీరు అందించేలా కాల్వల మరమ్మతులు
- ◆ రైతులకు గిట్టుబాటు ధర
- ◆ కుళాయిల ద్వారా ఇంటింటికి తాగునీరు
- ◆ రేపల్లె పట్టణంలో 100 పడకల ఆస్పత్రి నిర్మించి అందరికీ వైద్యసేవలు
- ◆ టిడ్కో గృహాల నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు పంపిణీ
- ◆ ఆక్వా పార్కు ఏర్పాటుతో పాటు రొయ్యల ఎగుమతులు, దిగుమతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

* రైతులను ఆదుకోలేదు..

రేపల్లె వ్యవసాయ ఆధారిత నియోజకవర్గం. ఇక్కడ రైతులు లక్ష ఎకరాలకు పైనే వరి సాగు చేస్తున్నారు. పంట కాల్వల్లో పూడికలు తీయడం, కాల్వ కట్టలను అభివృద్ధి చేయడంలో ప్రభుత్వం విఫలమైంది. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుని పండించిన పంటను అమ్ముకుందామంటే రైతులకు గిట్టుబాటు ధర దక్కక నానా అవస్థలు పడుతున్నారు. అధిక వర్షాలతో రెండేళ్లుగా రైతులు నష్టపోతే నేటికి నష్టపరిహారం అందించిన దాఖలాలు లేవు.

ఐదేళ్లుగా నిర్లక్ష్యం..

వైసీపీ ఐదేళ్ల పాలనలో రేపల్లె నియోజకవర్గం నిర్లక్ష్యానికి గురైంది. రేపల్లె, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాల్లో రహదారులు, సాగునీటి కాల్వల గురించి పట్టించుకోలేదు. కృష్ణానది చెంతనే ఉన్నా తాగునీరు, సాగునీటి సమస్యలో అటు రైతులు, ఇటు ప్రజలు అల్లాడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రమాదకరంగా కరకట్ట ఉన్నా కనీస మరమ్మతులపై పాలకులు ఆలోచన చేయలేదు. ఇక మత్స్యసంపద ఎగుమతులు ఆక్వారైతులకు ప్రభుత్వం మేలు చేయలేదు. అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతన్నలను ఆదుకోలేదు. టీడీపీ హయాంలో రేపల్లెలో 1600 టిడ్కో గృహాలు మంజూరైతే వైసీపీ ప్రభుత్వం కక్షపూరితంగా అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పనులు ఆపేసింది. ప్రస్తుతం అవి శిథిలావస్థకు చేరాయి. లబ్ధిదారులు వేలాది రూపాయలు చెల్లించి నష్టపోయారు.

* తాగునీరు అందించలేకపోయారు..

కృష్ణానది చెంతనే ఉన్నా నియోజకవర్గంలోని రేపల్లె మున్సిపాలిటీతో పాటు గ్రామాల్లోని ప్రజలకు తాగునీరు కూడా అందించలేని పరిస్థితి వైసీపీ పాలనలో ఉంది. వేసవిలో ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోకుండా తాత్కాలికంగా హడావుడితో సరిపుచ్చారు. చెరువుల్లో నీటిని నింపిన పరిస్థితి కూడా లేదు.నెలకు రూ.1500 పైనే చెల్లించి ప్రజలు తాగునీటి అవసరాలు తీర్చుకోవాల్సిన దుస్థితి నెలకొందంటే వైసీపీ పాలన ఏవిధంగా ఉందో తెలుసుకోవచ్చు.

* కలగానే జగన్ హామీలు..

గత ఎన్నికల సమయంలో ప్రతిపక్ష హోదాలో నియోజకవర్గంలో పర్యటించిన జగన్ తీరప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని ఎన్నో హామీలు ఇచ్చారు. అయితే వాటిలో ఇప్పటికి ఒక్కటి కూడా అమలు చేయలేదు. ముఖ్యమంత్రి పదవి చేపట్టిన తర్వాత కృష్ణానదిపై చెక్‌డ్యామ్ నిర్మాణానికి వర్చువల్‌గా శంకుస్థాపన చేసి మూడేళ్లు అవుతుంది. అయితే ఇంతవరకు చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి సంబంధించి ఒక్క రాయి కూడా పేర్చిన దాఖలాలు లేవు. చెక్‌డ్యామ్ నిర్మించి లక్ష ఎకరాలకు నీరు అందిస్తామని హామీ కలగానే మిగిలింది. పొలాలు ముంపును నివారించేందుకు కరకట్టను బలపరుస్తామన్న హామీ ఐదేళ్లుగా ఆచరణలోకి రాలేదు. రేపల్లెలో 100 పడకల ఆస్పత్రి నిర్మాణం, ఆక్వా పార్కు ఏర్పాటు హామీలు ప్రకటనలకే పరిమితమయ్యాయి. రూ.420 కోట్లతో నిజాంపట్నం హార్బర్‌ను అభివృద్ధి చేస్తామని 20 శాతం కూడా పనులు చేయలేదు. ఆక్వాకు గతంలో యూనిట్‌కు రూ.1.50 చెల్లిస్తుంటే దానిని మార్చి వాడకాన్ని బట్టి శ్లాబ్‌లతో చార్జీలు పెంచి సాగుదారులపై జగన్ ప్రభుత్వం అధికభారం మోపింది. నియోజకవర్గంలో రొయ్యల ఎగుమతులకు కనీస వసతి కల్పించలేకపోయారు.

* ప్రజా స్పందన

ఎన్నికల ప్రచారంలో నియోజకవర్గంలో ప్రజల స్పందన బాగుంది. వైసీపీ ఐదేళ్ల పాలనతో ప్రజలు విసిగిపోయారు. జగన్ పథకాల రూపంలో రూ.15 వేలు ఇచ్చి రూ.20 వేలు వసూలు చేస్తున్నారని ప్రజలకు అర్థమైంది. ఎక్కడికక్కడ ప్రజలు అన్ని వర్గాల వారు ప్రభుత్వం మార్పు కోరుతున్నారు. అన్ని సామాజిక వర్గాల నుంచి సానుకూలంగా స్పందన ఉంది. ప్రచారంలో ఉత్సాహంగా పాల్గొని సంఘీభావం తెలుపుతున్నారు. టీడీపీ ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేసి ప్రజలకు అండగా ఉంటాం.

కార్మిక.. సంక్షోమం!

రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సంక్షేమాన్ని పూర్తిగా గాలికి వదిలేసింది. కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం చూడాల్సిన కార్మిక శాఖ కార్మికులకు కనీసమాత్రంగా కూడా భరోసా ఇవ్వలేకపోతోంది. పని ప్రదేశంలో, నిత్య జీవితంలో కార్మికులు ఎదుర్కొనే చిన్న సమస్యలు కూడా పరిష్కరించలేని దీనావస్థకు చేరింది. కార్మికుల న్యాయమైన కోర్కెలు, డిమాండ్లను కూడా పరిష్కరించలేనంతగా కార్మికశాఖ నిర్వీర్యమై పోయింది. ఇదంతా ఒక ఎత్తైతే కార్మికులు దాచుకున్న కష్టార్జితాన్ని కూడా దారి మళ్లించి కార్మికులకు తీరని అన్యాయం చేస్తోంది. దీంతో కార్మికులు ఆ శాఖపై విశ్వాసాన్ని కోల్పోయే పరిస్థితి ఏర్పడింది.



- కనీస మాత్రంగా భరోసా ఇవ్వని కార్మిక శాఖ
- తీవ్ర ఇబ్బందుల్లో నిర్మాణరంగ కార్మికులు
- కార్మికుల కష్టార్జితాన్ని కొల్లగొట్టిన రాష్ట్ర ప్రభుత్వం
- రూ.15 కోట్ల విలువ చేసే క్లైములు పెండింగ్
- అయినప్పటికీ ప్రీమియం వసూళ్లు చేస్తున్న అధికారులు
- కరోనా సాయానికి మొండిచేయిచ్చి వంచించిన జగన్



గుంటూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో 6 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు ఉన్నారు. గత నాలుగేళ్లుగా పనులు లేక, బతుకుదెరువు కోల్పోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమల్లోకి తెచ్చిన నూతన ఇసుక విధానం వీరి పొట్ట గొట్టింది. ఫలితంగా ఇసుక కొరత, ఆకాశాన్నంటిన ఇసుక ధరలతో నిర్మాణాల వేగం తగ్గింది. దీంతో చాలామంది పనికోల్పోయారు. 2019 డిసెంబరులో రాష్ట్ర ప్రభుత్వం మూడు రాజధానుల అంశాన్ని తెరమీదకు తేవడంతో జిల్లావ్యాప్తంగా నిర్మాణాలు ఎక్కడివి అక్కడే ఆగిపోయాయి. ఫలితంగా లక్షలాదిమంది పనులు కోల్పోయారు. ఆ వెంటనే వచ్చిన కరోనా కార్మికులను కోలుకోలేనంతగా దెబ్బతీసింది. మూడు దశల్లో వచ్చిన కరోనా కారణంగా కార్మికులు 2022 వరకూ పనులు కోల్పోయారు. సమాజమంతా కరోనా కష్టాల నుంచి బయట పడినప్పటికీ నిర్మాణ కార్మికులను వీడలేదు. నిర్మాణాలకు అవసరమయ్యే ఇనుము, సిమెంటు, ఇసుక, కలప, రంగుల ధరలు ఆకాశాన్నంటడంతో జిల్లాలో ఎవరూ కొత్త నిర్మాణాల జోలికి పోలేదు. దీంతో గడిచిన మూడున్నరేళ్లుగా కార్మికులు తీవ్ర ఇబ్బందులతో సతమతమవుతున్నారు.

పథకాన్ని నీరుగార్చిన జగన్‌రెడ్డి

నిర్మాణరంగ కార్మికుల ఒత్తిడితో 2007 వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసింది. ఈ బోర్డు ద్వారా కార్మికుల దినసరి కూలీ ల్లోంచి కొంత మొత్తం తీసుకుని సంక్షేమ బోర్డులో జమ చేస్తారు. గుంటూరు జిల్లాలో ఉన్న 6 లక్షల మంది కార్మికులు దాదాపు రూ.90 కోట్లు ఈ బోర్డులో తమ కష్టార్జితాన్ని జమ చేశారు. కాగా రాజశేఖర్‌రెడ్డి కుమారుడైన జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆ సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసింది. పదిహేనేళ్లుగా కార్మికులు తమ కష్టార్జితం నుంచి జమ చేసిన రూ.830 కోట్లను దారి మళ్లించింది. ఫలితంగా సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులకు అంద వలసిన సంక్షేమ కార్యక్రమాలన్నీ పూర్తిగాఆగి పోయాయి.

నాలుగేళ్లుగా క్లెయిమ్‌లు పెండింగ్

ఉమ్మడి గుంటూరు జిల్లాలో గడిచిన మూడున్నరేళ్లుగా కార్మికుల సంక్షేమానికి సంబంధించిన క్లైములు పెండింగులో ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఎప్పటికప్పుడు పరిష్కరించి కార్మికులకు ఇవ్వాల్సిన పరిహారాన్ని ఎప్పటికప్పుడు ఇచ్చేవారు. ఈ ప్రభుత్వం వాటిని పరిష్కరించకపోవడంతో ఉమ్మడి జిల్లాలో 9 వేల క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నాయి. వీటి తాలూకు కార్మికులకు రూ.15 కోట్ల పరిహారం అందాల్సి ఉంది. కానీ ఒక్కరికి కూడా పరిహారం అందలేదు. కాగా ప్రతి ఏటా కార్మికుల నుంచి రూ.12 చొప్పున అధికారులు ప్రీమియంను వసూలు చేయడం విశేషం.



కరోనా సాయానికి టోకరా

కరోనా కష్టకాలంలో తీవ్రంగా నష్టపోయిన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలన్న డిమాండ్ పెద్దఎత్తున వచ్చింది. ఒత్తిడి తీవ్రం కావడంతో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు కరోనా సాయం అందించాలని కేంద్రం సూచించింది. ఆ మేరకు కేరళ, ఢిల్లీ సహా పలు రాష్ట్రాలు కార్మికులకు రూ.5 వేల చొప్పున పరిహారం అందించాయి. రాష్ట్రంలో కూడా కార్మికులు తమ సంక్షేమ నిధి నుంచి సాయం చేయాలని కోరారు. అయిన ప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా కార్మికులకు కరోనా సాయం చేయలేదు.

1వరకు పోస్టల్ బ్యాలెట్

- దరఖాస్తుకు గడువు పెంచిన ఈసీ



బాపట్ల, ఏప్రిల్ 27: ఎన్నికల విధులకు నియమితులైన ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు మే 1వ తేదీ వరకు ఎన్నికల సంఘం గడువు పెంచినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. పోస్టల్ బ్యాలెట్‌కి సంబంధించి జిల్లాలోని వేమూరులో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రేపల్లెలో క్రిస్టియన్ కళాశాల, బాపట్లలో మున్సిపల్ హైస్కూల్, పర్చూరులో సెయింట్ ఫ్రాన్సిస్ డీ స్కూల్, అద్దంకిలో శ్రీప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాల, చీరాలలో యార్లగడ్డ అక్కమాంబ మహిళా కళాశాలలో ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల విధులు నిర్వహిస్తూ జిల్లాలోనే ఓటు హక్కు ఉన్న వారందరూ సొంత నియోజకవర్గంలో ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించామన్నారు. అందువల్ల విధుల్లోని ఉద్యోగులు నిర్ణయించిన తేదీలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లాలో ఎన్నికల విధులు నిర్వహిస్తూ ఇతర జిల్లాలో ఓటు హక్కు కలిగి ఉన్న వారంతా మే 7న బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగించుకోవాలన్నారు.

ఆమంచి నామినేషన్ ఆమోదం

23 మందిలో ఆరుగురివి తిరస్కరణ

చీరాల, ఏప్రిల్ 27: చీరాల నియోజకవర్గానికి సంబంధించి నామినేషన్ల పరిశీలన శనివారంతో ముగిసింది. నామినేషన్ల పరిశీలనలో భాగంగా శుక్రవారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆమంచి కృష్ణమోహన్ అఫిడవిట్‌లో సరైన సమాచారం లేదని ఓ రాజకీయ పార్టీ ఏజెంట్ అభ్యంతరం తెలిపారు. దీంతో ఆర్వో సూర్యనారాయణరెడ్డి ఆమంచి నామినేషన్‌ను పెండింగ్‌లో ఉంచారు. పూర్తి సమాచారంతో శనివారం పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ ప్రకారం శనివారం ఆమంచి నామినేషన్‌ను పరిశీలించిన ఆర్వో దానిని ఆమోదించినట్లు ప్రకటించారు. దీంతో చీరాల నియోజకవర్గానికి సంబంధించి 23 మంది అభ్యర్థులు 39 నామినేషన్లు దాఖలు చేయగా వాటిలో 17 నామినేషన్లను ఆమోదించారు.

ఆందోళనకు గురిచేసేందుకే అభ్యంతరం

తనను, తన అభిమానులను, పార్టీ శ్రేణులను గందరగోళానికి, ఆందోళనకు గురి చేసేందుకు నామినేషన్‌పై అభ్యంతరం తెలిపారని ఆమంచి తెలిపారు. నామినేషన్ ఆమోదం తర్వాత ఆయన ఈఆర్వో కార్యాలయం వద్ద విలేకర్లతో మాట్లాడారు. వైసీపీ నాయకుల చర్యపై తాము ఏమాత్రం ఆందోళన చెందలేదన్నారు. పార్టీశ్రేణులు, అభిమానులు ఎవరివంతు కర్తవ్యం వారు నిర్వహిస్తూ ముందుకు సాగాలని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ బాపట్ల ఎంపీ అభ్యర్థి జేడీ శీలం మాట్లాడుతూ ఎన్నికల అధికారుల నిర్ణయం అందరికీ ఆమోదయోగ్యంగా ఉందన్నారు.

విజయానికి కృషి చేయండి

- టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి
- ఇంకొల్లులో 60 కుటుంబాలు చేరిక


వైసీపీని వీడి టీడీపీలో చేరిన స్టాలిన్‌పేటవాసులతో ఎమ్మెల్యే ఏలూరి

ఇంకొల్లు, ఏప్రిల్ 25 : ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేసి కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు విజ్ఞప్తి చేశారు. ఇంకొల్లులో శనివారం మండుటెండలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ వీడి బారీగా టీడీపీలో చేరారు. వారికి ఏలూరి కండువాలు వేసి ఆహ్వానించారు. వైసీపీ వైఫల్యాల కారణంగానే పార్టీని వీడినట్లు చెప్పారు. టీడీపీ కూటమి అధికారంలోకి వస్తేనే అందరికీ సంక్షేమ ఫలాలు సమానంగా అందుతాయని వారు పేర్కొన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు, డాక్టర్ శ్యాంసుందరరావు ఆధ్వర్యంలో ఇంకొల్లు స్టాలిన్‌పేటకు చెందిన మాదిగలు, నాయీ బ్రాహ్మణులు, ముస్లింలు పెద్ద సంఖ్యలో టీడీపీలో చేరారు. అందరూ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా కృష్ణప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. స్టాలిన్‌పేటకు చెందిన సుమారు 20 కుటుంబాలు వారు వలేరు చిట్టి, ఏజర్ల జాను, గాబ్రియేలు, సురేష్, మరియమ్మ, అరుణ, పల్లపాటి సుధీర్, రాజేష్, నాయీబ్రాహ్మణులు 18 కుటుంబాల వారు వేటపాలెం శివ, వెంకటరమణ, శ్రీను, కోటి, అంజనేయులు, నాగేశ్వరరావు తదితరులు, ముస్లింలు 15 కుటుంబాలు ఏలూరి సమక్షంలో శనివారం సైకిలెక్కారు. కొణికి గ్రామానికి చెందిన బండి రాఘవరావు, రామూర్తి, మురళీకృష్ణ, దావులూరి రామాంజనేయులు, గుద్దేటి శ్రీనివాసరావు తదితరులు పార్టీలో చేరారు. అనంతరం సాయిబాబా గుడిలో ఇంకొల్లుకు చెందిన మహిళలు ఏలూరి గెలుపును ఆకాంక్షించి హనుమాన్‌చాలీసా చేస్తుండగా వారిని ఏలూరి అభినందించారు. ఏలూరి సాయిబాబా, తటాకాంజనేయస్వామి గుడిలో ప్రత్యేక పూజలు చేసారు. కార్యక్రమంలో జనసేనపార్టీ పర్చూరు ఇన్‌చార్జి పెదపూడి విజయకుమార్, నాయుడు హనుమంతరావు, డాక్టర్ శ్యాం, పాలేరు రామకృష్ణ, వీరగంధం, వెంకట్రావు, యడ్లూరి ప్రసాద్, వలేరు మార్క్, కొల్లూరి శివాజీ, ఎంపీటీసీ సభ్యుడు బుడే, బాబర్‌బాషా, మీరావలి, వెంకటనారాయణ, కొల్లూరి గౌతమ్, కొల్లూరి రాంబాబు, సాంబయ్య వెంకట్రావు, శ్రీను టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


ఏలూరి మద్దతు తెలుపుతున్న ఎంఎస్పీ, ఎంఆర్‌పీఎస్ నాయకులు

ఇటీవల ప్రమాదంలో గాయపడిన ఇంకొల్లుకు చెందిన లోకేష్ ను పరామర్శించారు. ముస్లిం కాలనీలో ప్రచారం నిర్వహించారు.

జగన్ అంతం..మాదిగల పంతం

ఏలూరికి ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్‌ల మద్దతు

పర్చూరు, ఏప్రిల్ 27 : టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావుకు శనివారం బాపట్ల జిల్లా ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు మద్దతు తెలిపారు. ఇసు కదర్లలోని క్యాంప్ కార్యాలయంలో సంఘ నాయకులు ఎమ్మెల్యే ఏలూరిని కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్ అంతం.. మాదిగల పంతం.. అన్నారు. మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎన్నికల్లో ఎన్డీయే కూటమికి పూర్తి ఇస్తున్నట్లు తెలిపారు. పర్చూరు నియోజకవర్గంలోని మాదిగలంతా ఏకతాటిపై నిలబడి జగన్‌ను గద్దె దింపాలన్నారు. ఏలూరి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా ఎంఎస్పీ అధ్యక్షుడు దుండంగుట్ల లక్ష్మీనరసయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు దుడ్డు వందనం మాదిగతోపాటు, టీడీపీ బాపట్ల పార్లమెంట్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బేతపూడి సురేష్, జిల్లా నాయకులు జనరాజుపల్లి సుబ్బారావు, పల్లెపోగు నాని, తాళ్లూరి బెన్నియ, గానుగపాటి సురేంద్ర, ఉసురుపాటి సురేష్, మందం కిషోర్, నేలపాటి బాబు పాల్గొన్నారు.

జగన్‌రెడ్డి మేనిఫెస్టో పచ్చి అబద్ధం

- నవరత్నాలతో నయవంచన
- మళ్లీ పథకాలను నమ్మి మోసపోవద్దు
- టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి


రావినూతలలో గొట్టిపాటికి దిష్టి తీస్తున్న మహిళలు


పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే గొట్టిపాటి

మేదరమెట్ల, ఏప్రిల్ 27 : జగన్‌రెడ్డి విడుదల చేసిన మేనిఫెస్టో పచ్చి అబద్ధాలదని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. శనివారం మండలంలో ని రావినూతలల్లో ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా కృష్ణప్రసాద్‌ను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని గొట్టిపాటి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వైసీపీ మేనిఫెస్టో ఒత్తి అంకెల గారడీ, అబద్ధాలదని అన్నారు. గత ఎన్నికల్లో నవరత్నాల పథకాలతో వచ్చిన జగన్‌రెడ్డి ఐదేళ్లలో నవమోసాలతో నయవంచనకు పాల్పడ్డారని గొట్టిపాటి ధ్వజమెత్తారు. మళ్లీ ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమవుతున్నారన్నారు. వైసీపీ మేనిఫెస్టోను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. పదెపదె మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చి ప్రజలను దోచుకోవాలని లక్ష్యంతో మేనిఫెస్టోను విడుదల చేశారన్నారు. గతంలో అమ్మఒడికి ఇచ్చిన మొత్తంలో రూ.2వేలు కోత పెట్టారన్నారు. రైతు భరోసా రూ.13,500 ఇస్తామని చెప్పి మోసం చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు ఆ మొత్తాలను పెంచుతున్నట్లు ప్రకటించ డం మరోసారి మోసగించేందుకేనన్నారు. టీడీపీ, వైసీపీ మేనిఫెస్టోను, వాస్తవాలను ప్రజలు గుర్తిం చాలన్నారు. మద్యం నిషేధం చేసి ఓట్లు అడిగేందుకు వస్తానని చెప్పిన జగన్‌రెడ్డి నాసిరకం మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతు న్నారన్నారు. ఐదేళ్లలో 9 సార్లు కంరెంట్ చార్జీలను పెంచారన్నారు. నిరుద్యోగులకు మెగా డిఎస్సీ విషయంలో మడమ తిప్పారన్నారు. అన్ని రంగాలలో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారన్నారు. సాగు, తాగు నీరు, రోడ్లు, రవాణా సదుపాయాల కల్పనలో ఘోరంగా విఫలమయ్యారని దుయ్య బట్టారు. ఎక్కడా రోడ్లు వేసిన పాపాన పోలేద న్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నిధులను దారి మళ్లించి ఆ వర్గాలను నిండా ముంచారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాడులు, దౌర్జన్యాలు, దోపిడీ, అవినీతి పాలనతో సర్వనాశనం చేశారన్నారు. మరోసారి ఓటు వేసి ప్రజలు తప్పు చేయొద్దని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు ప్రయాణం, డ్వాక్రా మహిళలకు రూ.10 లక్షల వడ్డీ లేని రుణం, రూ.4వేల పింఛన్ వంటి పథకాలతో పేదలకు మే లు చేకూరుతుందన్నారు. సంక్షేమం, అభివృద్ధి కోసం చంద్రబాబును ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలని, టీడీపీ కూటమి అ భ్యర్థులను అఖండ మెజా ర్టీతో గెలిపించి అసెంబ్లీకు పంపాలని గొట్టిపాటి విజ్ఞప్తి చే శారు. రావినూతలల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ నాయకులు, మ హిళలు పాల్గొన్నారు.

వైసీపీని చిత్తుగా ఓడించండి

అద్దంకి : ఓటు అనే ఆయుధంతో మే 13న జరిగే ఎన్నికలలో అన్ని వర్గాల ప్రజలను ఇబ్బంది పెట్టిన వైసీపీని చిత్తుగా ఓడించి బంగాళాఖాతంలో కలపాలని గొట్టిపాటి కమల్‌కిషోర్ (బాబీ) అన్నారు. టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్‌కు మద్దతుగా సోదరుని కుమారుడు కమల్‌కిషోర్ శనివారం మండలంలోని కొమ్మినేనివారిపాలెంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ సూపర్‌సిక్స్ పథకాల ద్వారా ప్రజలకు కలిగే లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు వెల్లలచెరువు హనుమంతరావు, మిన్నెకంటి రామారావు, రాధ, ఏల్చూరి శ్రీనివాసరావు, వెల్లలచెరువు సత్యం, చింతల సుబ్బారావు పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న బాబీ


ప్రచారం నిర్వహిస్తున్న హర్షవర్ధన్

ఒక్కచాన్స్‌తో రాష్ట్రం సర్వనాశనం

ఇంటింటి ప్రచారంలో హర్షవర్ధన్

అద్దంకి, ఏప్రిల్ 27 : ఒక్కచాన్స్‌తో జగన్‌రెడ్డి రాష్ట్రంలోని అన్ని రంగాలలో సర్వనాశం అయిందని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ తనయుడు హర్షవర్ధన్ అన్నారు. టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్‌కు మద్దతుగా హర్షవర్ధన్ శనివారం అద్దంకి పట్టణంలోని 4, 5 వార్డులలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి మినీ మానిఫెస్టోను వివరిస్తూ టీడీపీకి ఓట్లు వేసి ఎమ్మెల్యే అభ్యర్థిగా గొట్టిపాటిని, ఎంపీ అభ్యర్థిగా కృష్ణప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా హర్షవర్ధన్ మాట్లాడుతూ పట్టణంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు రూ.85 కోట్లతో పనులు ప్రారంభిస్తే వైసీపీ దానిని పూర్తి చేయకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. దీంతో ఎన్నడూ లేని విధంగా తాగునీటి సమస్య తలెత్తిందన్నారు. సమస్యలు పరిష్కారం కావాలంటే గొట్టిపాటిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కాకాని అశోక్, కుందారపు రామారావు, గార్లపాటి శ్రీనివాసరావు, మాగులూరి గోపి, వడ్డవల్లి పూర్ణచం ద్రరావు, రామిశెట్టి రవి పాల్గొన్నారు.

ఉరుసు వేడుకలో పాల్గొన్న ఏలూరి


దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

మార్టూరు, ఏప్రిల్ 27 : టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు ఉరుసు వేడుకలో పాల్గొన్నారు. శుక్రవారం అర్ధరాతిర మార్టూరులో కొణిదెన రోడ్డులో దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ ఏడాది మార్టూరు గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఆరోగ్యంగా ఉండాలని అల్లాను వేడుకున్నారు. ఏర్పాట్లను పరిశీలించిన ఏలూరి కమిటీ సభ్యులను అభినందించారు.పీర్ల చావిడి నుంచి గంధంను గుర్రంపై ఊరేగింపుగా ఫాతేహ నిర్వహించారు. భక్తులు గంధాన్ని తీసుకొని స్వామివారికి విరాళాలను అందజేశారు. శనివారం వేకువజామున గంధం ఊరేగింపు కార్యక్రమం ముగిసింది. మతపెద్దలు, కమిటీ సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

రంగుమారిన నీరు రాకుండా అడ్డుకట్ట



స్కవర్ ద్వారా మురుగునీటి తొలగింపును పరిశీలిస్తున్న కమిషనర్

అద్దంకి, ఏప్రిల్ 27 : అద్దంకి పట్టణంలో కొళాయిల ద్వారా రంగుమారిన నీరు సరఫరా కాకుండా చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ తెలిపారు. ఆంధ్రజ్యోతిలో శనివారం ప్రచురితమైన కథనంపై మున్సిపల్ అధికారులు స్పందించారు. అద్దంకి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఉన్న ట్యాంక్ పరిధిలో రంగు మారిన నీరు సరఫరా అవుతున్నందున నివారణ చర్యలు చేపట్టారు. రంగు మారిన నీరు సరఫరా అవుతున్న పైప్ లైన్లలో పేరుకు పోయిన మట్టిని బయటకు పెట్టేందుకు ఆయా ప్రాంతాలలో పైప్‌లైన్లకు స్కవర్ చేసినట్లు తెలిపారు. గుండ్లకమ్మ నదిలో ఊటబావులను, అద్దంకిలో స్కవర్ చేస్తున్న పైప్‌లైన్‌లను మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ శనివారం పరిశీలించారు. కొద్ది రోజులుగా నీటి సరఫరాకు కొంత మేర అంతరాయం ఏర్పడిందని, ఆదివారం నుంచి యథావిధిగా నీటి సరఫరా జరుగుతుందని ఆయన తెలిపారు.

వైసీపీ కోసం ఉపాధి సిబ్బంది ప్రచారం

ఓటు వేయాలని కూలీలపై ఒత్తిడి : ఎంపీడీవోకు టీడీపీ నేతల ఫిర్యాదు

మార్టూరు, ఏప్రిల్ 27 : మండలంలోని పలు గ్రామాలలో ఉపాధి పనులను చేస్తున్న కూలీలను వైసీపీ పార్టీకి ఓటు వేయాలని కొంతమంది ఉపాధి సిబ్బంది ప్రచారం చేస్తున్నారంటూ శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో టీడీపీ మండల నాయకులు ఫిర్యాదు చేశారు. ఉపాధి కూలీలు వారికి ఇష్టం వచ్చిన వారికి ఓటు వేసుకునే హక్కు ఉంటుందన్నారు. అంతేగాని వారిని వైసీపీకి ఓటు వేయాల్సిందిగా కొందరు సిబ్బంది ఒత్తిడి చేయడంపై విచారణ చేపట్టాలని నాయకులు ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు.

కూటమి గెలుపు..అభివృద్ధికి మలుపు

ఎమ్మెల్యే అభ్యర్థి కొండయ్య


బీజేపీ ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి కొండయ్య

చీరాల, ఏప్రిల్ 27 : నియోజకవర్గంలో కూటమి గెలుపు.. అభివృద్ధికి మలుపు అని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్య అన్నారు. కూటమితో సుపరిపాలన అందుతుందని ప్రజలు విశ్వసిస్తున్నారని, తదుగుణంగా అందరం సమిష్టి కృషితో ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థిగా తెన్నేటి కృష్ణప్రసాద్‌ను సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కొండయ్య పిలుపునిచ్చారు. శనివారం రోటరీ కమ్యూనిటీ హాలులో నిర్వహించిన బీజేపీ ఆత్మీయ సమావేశంలో కొండయ్య, ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్ కుమార్తె రమ్య, డాక్టర్ సజ్జా హేమత ముఖ్యఅతిథిలుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ రాష్ట్రం తిరిగి అభివృద్ధి పథంలో నడవాలంటే చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి కావాల్సిన ఆవశ్యకతను వి వరించారు. సూపర్‌సిక్స్ పథకాలు, బీసీ డిక్లరేషన్‌తో ఒనగూరే ప్రయోజనాలను వివరించారు. చీరాల నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితులు, తమను ప్రజలు ఎన్నుకునేందుకు చూపుతున్న ఆసక్తి మనకు సానుకూల అంశాలన్నారు. ఈ క్రమంలో ఓటు వేసే వరకూ కూటమి పార్టీల ఓటర్లతో పాటు, తటస్థులు మనతో కలిసి ప్రయాణించేలా చైతన్యవంతుల్ని చేయాలన్నారు. ఈ సందర్భంగా కొండయ్యను ఎమ్మెల్యే అభ్యర్థిగా, కృష్ణప్రసాద్‌ను ఎంపీ అభ్యర్థిగా గెలిపించాలని తీర్మానం చేశారు. అనంతరం అతిథులను సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాతాని ఉమామహేశ్వరరావు, బీజేపీ నాయకులు మువ్వల వెంకటరమణారావు, ప్రముఖ న్యాయవాది బండారుపల్లి హేమంత్‌కుమార్, నాసిక మణికుమార్, కాకర్ల వెంకటేశ్వరరావు, జనసేన నాయకులు మామిడాల శ్రీనివాసరావు, కారంపూడి పద్మిని, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తపేటలో కూటమి ఇంటింటి ప్రచారం


ఇంటింటి ప్రచారం చేస్తున్న కూటమి శ్రేణులు

కొత్తపేట(చీరాల), ఏప్రిల్ 27 : టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఎన్నికల ప్రచారాన్ని ముప్పేట నిర్వహిస్తున్నారు. టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొండయ్య రోజువారీ సమావేశాలు, సమాలోచనలతో పాటు ఆత్మీయ సమావేశాలు, ఇంటింటి ప్రచారంలో జోరుగా తిరుగుతున్నారు. ఆయన కుమారులు గౌరీఅమర్‌నాథ్, మహేంద్రనాథ్ మరో వైపు, కొండయ్య కుమార్తె శివనారాయణదేవి, కోడలు స్పందన ఇంకో వైపు నాయకులు, కార్యకర్తలను కలుపుకుని ప్రచారం నిర్వహిస్తున్నారు. అందుకు సానుకూల స్పందన వస్తోంది. ఇదిలావుంటే కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు కూడా ఎవరివంతు బాధ్యతగా వారు ఒక ప్రణాళిక ప్రకారం ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సూపర్‌సిక్స్ పథకాల ప్రయోజనం, బీసీ డిక్లరేషన్‌తో అదనపు పొందే అవకాశాలు, ప్రయోజనాలను తెలిపే కరపత్రాలను పంపిణీ చేస్తూ వివరిస్తున్నారు. ఆ క్రమంలో శనివారం కొత్తపేటలో ఇంటింటి ప్రచారం నిర్వహించిన కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు మధుబాబు, తేలప్రోలు నాగేశ్వరరావు, రమణయ్య, శంభుప్రసాద్, సుభాన్‌రెడ్డి, రామారావు, లక్ష్మీకాంత్, రాఘవరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొండయ్యకు రామన్నపేట మాజీ సర్పంచ్ దంపతుల మద్దతు

వేటపాలెం(చీరాల), ఏప్రిల్ 27 : మండలంలోని రామన్నపేట పంచాయితీ మాజీ సర్పంచ్ బట్టా అనంతలక్ష్మి, లీలానందప్రసాద్ దంపతులను శనివారం టీడీపీ కూటమి అభ్యర్థి ఎం.ఎం కొండయ్య కలిశారు. ఈ సందర్భంగా లీలానందప్రసాద్ దంపతులు తవవంతు మద్దతు తెలిపారు. భవిష్యత్ కార్యాచరణపై కొంతసేపు మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకురాలు డాక్టర్ సజ్జా హేమలత, బాపట్ల పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డేటా నాగేశ్వరరావు, వేటపాలెం మండల పార్టీ అధ్యక్షుడు బొగ్గుల పార్థసారధి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆగిన సాగర్ జలాలు

మార్టూరు, ఏప్రిల్ 27 : రెండవ దఫా వచ్చిన సాగర్ జలాలు శుక్రవారం రాత్రితో ఆగిపోయాయి. కోనంకి సబ్ డివిజన్ పరిధిలో మార్టూరు, పర్చూరు, కారంచేడు, యద్దన పూడి, ఇంకొల్లు మండలాల్లో 68 మంచి నీటి చెరువులు ఉండగా, వాటిలో 58 చెరువులకు నీళ్ల చేరినట్లు ఎన్నెస్పీ అధికారులు చెప్తున్నారు. వాస్తవంగా మొదటి దఫా సాగర్ జలాలు వచ్చినపుడు కేవలం రెండు మూడు రోజులు మాత్రమే సాగర్ జలాలు వ చ్చాయి. దాంతో కోనంకి సబ్ డివిజన్ పరిధిలోని చాలా చెరువులకు నీళ్ల చేరలేదు. ఈ నెల 21 నుంచి రెండవ దఫా సాగర్ జలాలు చేరడంతో చాలా చెరువులకు నీళ్ల చేరినట్లు అధికారులు చెప్తున్నారు. చెరువులకు పూర్తి స్థాయిలో కాకపోయినప్పటికీ ప్రతి చెరువుకు ఎంతో కొంత సాగర్ జలాలు చేరినట్లు అధికారులు తెలిపారు. మార్టూరు మండలంలో మేజర్ పంచాయతీ మార్టూరు చెరువుకు మాత్రం 50 శాతం సాగర్ జలాలు చేరాయి. దాంతో ఈ వేసవి కాలంలో జూన్ వరకు గ్రామంలో తాగునీటికి ఇబ్బంది ఉండదని పంచాయతీ అధికారులు చెప్తున్నారు.

అద్దంకి డివిజన్ ఈఈ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో కోనంకి డీఈ స్వామి నాయక్ పర్యవేక్షణలో చెరువులకు సాగర్ జలాలు చేరడంపై సిబ్బంది చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఇదిలావుండగా మండలంలో ద్రోణాదుల మేజర్, నూతల పాడు మైనర్, రాజుపాలెం మేజర్ తదితర కాలు వలో చిల్లచెట్లు తూటుకాడ తదితర వ్యర్థాలు ఉండడంతో చాలా చోట్ల సాగర్ జలాలు సక్రమంగా దిగువకు చేరలేదని రైతులు చెప్తున్నారు.

మహిళ మెడలో బంగారు గొలుసు అపహరణ

- బైక్‌పై అడ్డగించి గాయపరిచి చోరీకి పాల్పడిన దుండగులు
- గత నెలలో యువకుడిని కొట్టి చోరీ - వరుస ఘటనలతో ప్రజలు బెంబేలు

పర్చూరు, ఏప్రిల్ 27 : ద్విచక్రవాహనంపై వస్తున్న దంపతులపై దాడిచేసి గాయపరిచి మహిళ మెడలో ఉన్న బంగారు గొలుసును అపహరించి పరారైన సంఘటన శుక్రవారం రాత్రి పర్చూరు - చీరాల ఆర్‌అండ్‌బీ రహదారిలో, స్థానిక పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో జరిగింది.

బాధితులు తెలిపిన సమాచారం మేరకు పర్చూరుకు చెందిన గాదే రాజేష్ తన భార్యతో కలసి చీరాల నుంచి పర్చూరు వస్తుండగా ఇద్దరు యువకులు బైక్‌ను ఢీకొట్టి గాయపరిచి చోరీకి పాల్పడ్డారు. ఇదే రహదారిలో పర్చూరు నుంచి రెవెన్యూ కార్యాలయంలో విధులు ముంగించుకొని కారంచేడు వైపు వెళుతున్న వీఆర్వోను అడ్డగించి అతని వద్ద ఉన్న సెల్‌ఫోన్‌తో దుండగులు పరారైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత నెలలలో వాడరేవు - పిడుగురాళ్ల రహదారిలోని స్థానిక దర్గా సమీపంలోని ఓ వెంచర్‌లో బహిర్భూమికి వెళ్లిన పర్చూరుకు చెందిన ఆకుల మధుబాబు అనే యువకుడునిపై దాడిచేసి గాయపరచి అతని వద్ద ఉన్న రూ.40వేల నగదు, సెల్‌ఫోన్‌తోపాటు, బైక్‌తో పరారయ్యారు. అదేరోజు రాత్రి వంట పని ముగించుకొని పర్చూరు నుంచి చిలకలూరిపేట వెళుతున్న దంపతులపై దాడిచేసి గాయపరిచి నగదుతో దుండగులు పరారయ్యారు. దీనికి సంబంధించి బాధితులు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చోరీలకు సంబంధించి వరుసగ దాడులు చోటుచేసుకోవడంతో ప్రజలు రాత్రి సమయాల్లో ప్రయాణాలు సాగించాలంటే ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో దారి దోపిడీలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సందట్లో సడేమియా...

ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసులు ఎన్నికల విధుల్లో ఉన్నారు. దీన్ని అదునుగా తీసుకున్న దుండగులు యథేచ్ఛగా చోరీలకు పాల్పడుతున్నారు. ఇలా దాడి చేసి గాయపరిచి చోరీలకు పాల్పడుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

బెల్ట్‌షాప్‌లో 128 మద్యం బాటిళ్లు సీజ్

కాకాని మద్యం షాప్‌లో కొనుగోలు

సేల్స్‌మన్‌పై కేసు

అద్దంకి, ఏప్రిల్ 27 : ఎన్నికల సమయంలో బెల్ట్ షాపులలో మద్యం అమ్మకాలు జోరందుకున్నాయి. దీంతో ఎస్ఈబీ అధికారుల దాడులలో కుప్పలు కుప్పలుగా మద్యం బాటిల్లు పట్టుబడుతున్నాయి. మండలంలోని కలవకూరు లో శనివారం ఎస్ఈబీ ఎస్ఐ సైమన్ ఆధ్వర్యంలో దాడులు చేయగా తన్నీరు బ్రహ్మయ్య వద్ద 128 మద్యం బాటిళ్ల పట్టుబడ్డాయి. ఈ బాటిళ్లను పల్నాడు జిల్లా కాకానిలోని ప్రభుత్వ మద్యం దుకాణంలో సేల్స్‌మన్ బాబుల్ రెడ్డి వద్ద కొనుగోలు చేసినట్లు బ్రహ్మయ్య చెప్పడంతో బ్రహ్మయ్యతో పాటు బాబుల్‌రెడ్డి లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.


అధికారులు స్వాధీనం చేసుకున్న బాటిళ్లు


క్యాంపస్ ఇంటర్వ్యూలో ఎంపికైన విద్యార్థులు

శ్రీహర్షిణి క్యాంపస్ ఇంటర్వ్యూలో ఎంపికైన విద్యార్థులు

మార్టూరు, ఏప్రిల్ 27 : మార్టూరులోని శ్రీ హర్షిణి డిగ్రీ కళాశాల డిగ్రీ విద్యార్థులు 28 మంది శనివారం జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూలో ఎంపికయ్యారు. వివిధ కంపెనీలలో ఉద్యోగాలకు అర్హత సాధించిన వారిని కళాశాల చైర్మన్ గోరంట్ల రవికుమార్ అభినందించారు. చదువుతో పాటు ఉపాధి అవకాశాల పట్ల అవగాహనతో విద్యార్థులకు బోధన అందించడమే లక్ష్యంగా కళాశాలలో ఉపాధ్యాయులు నిరంతరం తపనతో కృషి చేస్తుంటారని, విద్యార్థులు వాటిని సద్వినియోగపరచుకోవాలన్నారు. వారికి ఏడాదికి రూ.2 లక్షల నుంచి రూ.3లక్షలు వరకు వేతనం ఉంటుందని, కష్టపడి పని చేస్తూ, కంపెనీ అభివృద్ధికి పాటుపడే వారికి, ఉన్నత స్థాయికి ఎదగాలనే వారికి కళా శాలలో ప్రోత్సాహం లభిస్తుందన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ గడ్డం అంజనేయులు లెక్చరర్లు జీ లక్ష్మీనారాయణ, టీ సురేష్, ఎస్‌కే నాగూర్, ఆచారి పాల్గొన్నారు.

మసాచు సెట్స్ వర్సిటీ ఎన్నికలో పంగులూరు విద్యార్థి

విద్యార్థి సంఘ అధ్యక్షునిగా ఎన్నిక



పంగులూరు, ఏప్రిల్ 27 : అమెరికాలోని వర్సిటీలో జరిగిన ఇండయన్ విద్యార్థి సంఘ ఎన్నికలలో పంగులూరు విద్యార్థి బాచిన రోహిత్ శ్రీ సాయి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. యూనివర్శిటీ ఆఫ్ మసాచుసెట్స్ లోవెల్ మసాచుసెట్స్ రాష్ట్రంలో ఉంది. అమెరికాలోని ఈ వర్సిటీలో నిర్వహించిన ఇండియన్ స్టూడెంట్స్ అసోషియేషన్ ఎన్నికలో 75 శాతం ఓట్లు సాధించి అధ్యక్షునిగా బాచిన రోహిత్ ఎంపికయ్యారు. రోహిత్ పంగులూరుకు చెందిన హైకోర్టు న్యా యవాది బాచిన హనుమంతరావు కుమారుడు. బాచిన హనమంతరావు ప్ర స్తుతం కేంద్ర ప్రభుత్వ అడ్వకేట్‌గా ఏపీ హైకోర్టులో విధులు నిర్వహిస్తున్నారు. పంగులూరుకు చెందిన విద్యార్థి అమెరికా వర్సిటీ అధ్యక్షునిగా ఎంపికావడంపట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

మంచినీటి సరఫరాకు తాత్కాలిక అంతరాయం

చీరాలటౌన్, ఏప్రిల్ 27 : చీరాల పరిధిలోని దండుబాట పంపింగ్ మెయిన్‌కు లీకే జీ ఏర్పడిన కారణంగా తాగునీటి సరఫరాకు ఆదివారం తాత్కాలిక అంతరాయం ఏర్పడినట్లు మునిసిపల్ కమిషనర్ చక్రవర్తి తెలిపారు. ఈ అంతరాయం జాలమ్మ వాటర్ ట్యాంక్ (వైకుంఠపురం, విఠల్‌నగర్), బాయ్స్ హైస్కూల్‌లోని వాటర్ ట్యాంకు (పాపరాజుతోట, బోస్‌నగర్, స్వర్ణ రోడ్డు), గొల్లపాలెంలోని వాటర్ ట్యాంకు (గంజిపాలెం, ఉడ్‌నగర్, గొల్లపాలెం) కారంచేడు గేటు సెంటర్ వాటర్ ట్యాంకు(ఉజిలీపేట, హరిప్రసాద్‌నగర్) ప్రాంతాలకు ఉంటుందని మరమ్మతుల అనంతరం సోమవారం యథా విధిగా తాగునీరు అందుబాటులో ఉంటుందని కమిషనర్ తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

నట చక్రవర్తి రాజనాల

అద్దంకిటౌన్, ఏప్రిల్ 27 : తెలుగులో నాలుగు దశాబ్దాలపాటు 400లకు పైగా సినిమాల్లో ప్రతి నాయకుడుగా ఎన్నో గొప్ప పాత్రలకు పెట్టినదే పేరుగా రాజనాల పేరుగాంచారని, ఆయన నట చక్రవర్తి అని పలువురు వక్తలు కొనియాడారు. శనివారం ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో చిన్ని శాంతయ్య పిచ్చమ్మ సేవా సదన్‌లో పుట్టంరాజు శంకరరావు కళావేదికపై ప్రతిభా మూర్తుల సభ ధర్మవరపు హరిబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ప్రతిభమూర్తులైన సినీనటులు రాజనాల కాళేశ్వరరావు గురించి సీహెచ్ నారాయణరావు, రేలంగి వెంకట రామయ్య గురించి ఆర్‌వీ రాఘవరావు ప్రసంగించారు. ముందుగా రాజనాల, రేలంగి చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయుడు ఎస్‌ఎల్ఎన్ ప్రసాద్ కార్యక్రమానికి ఆర్థికంగా సహకరించారు. కార్యక్రమంలో అన్నమనేని వెంకట్రావు, త్రిమూర్తులు, దికవార్‌దత్తు, పీసీహెచ్ కోటయ్య, లేవి ప్రసాద్, దేవపాలన, చంద్రమౌళి, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.


ప్రతిభామూర్తుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న సభ్యులు



ఏలూరి, విజయకుమార్, లక్ష్మిని గజమాలతో సన్మానిస్తున్న నాయకులు

జగన్ కబంధహస్తాల నుంచి రాష్ట్రాన్ని కాపాడుదాం

● టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి

చినగంజాం, ఏప్రిల్ 27 : విధ్వంస అరాచకవాది జగన్ కబంధహస్తాల నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని టీడీపీ కూటమి అభ్యర్థి ఏలూరి సాంబశివరావు అన్నారు. మండలంలోని సోపిరాల, చినగంజాం గ్రామాల్లో ఆయన కూటమి నాయకులతో కలిసి శనివారం రాత్రి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. సోపిరాల రైల్వేగేటు సెంటర్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో కూటమి నాయకులతో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఏలూరి మాట్లాడుతూ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన ఘనత జగన్‌రెడ్డికే దక్కిందన్నారు. అభివృద్ధిలో అగ్రగామిగా నిలుస్తున్న రాష్ట్రాన్ని వైసీపీ అభివృద్ధిలో అధోగతి పాలుచేసి అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చారన్నారు. జగన్ వ్యక్తిగత సంపాదనకే ప్రాధాన్యత ఇచ్చి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. ప్రజా కూటమి అధికారం కోసం కాదని రాష్ట్రం కోసం, మీ బిడ్డల భవిష్యత్ కోసం వస్తుందన్నారు. వైసీపీని ఇంటికి పంపే సమయం ఆసన్నమైందని ఏలూరి అన్నారు. మే 13న జరిగే ఎన్నికలు చాలా కీలకమన్నారు. ఎన్నికల సమయం సమీపిస్తుందని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెదపూడి విజయకుమార్ అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుని జనసేన పార్టీ అభ్యర్థిగానే భావించి అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత జనసైనికులపై ఉందన్నారు. మండలంలో ఆయన చేసిన అభివృద్ధి మరువలేనిదన్నారు.

మండలంలోని సోపిరాల, చినగంజాం గ్రామాల్లో ప్రజా కూటమి అభ్యర్థి ఎమ్మెల్యే ఏలూరి ప్రచారం జోరుగా నిర్వహించారు. ఇంటింటికీ తిరుగూ కూటమి ప్రభుత్వంలో అమలు చేయనున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగారు. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని ప్రజలకు వివరించారు. బిడ్డల భవిష్యత్ కోసం చంద్రబాబు అమలు చేయనున్న సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరిస్తూ సైకిల్ గుర్తుకు ఓటెయ్యాలని అభ్యర్థించారు. ఎమ్మెల్యే ఏలూరికి ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. హారతులిచ్చి దిష్టి తీస్తూ మహిళలు ఆయనకు స్వాగతం పలికారు. పలువురు ఏలూరికి పూలమాల వేసి, శాలువాలు కప్పి సన్మానించారు. మండల అభివృద్ధికి ఆయన చేసిన కృషిని వివరిస్తూ మహిళలు మళ్లీ నువ్వే రావాలంటూ ఆశీర్వదించారు. ఏలూరి వెంట మహిళలు, చిన్నారులు నడిచారు. సోపిరాల, చినగంజాం గ్రామాల్లోని రహదారులు జయహో సాంబన్న నినాదాలతో హోరెత్తాయి. జనసేన పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు సందు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఏలూరి, విజయకుమార్, బాపట్ల పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి కృష్ణప్రసాద్ కుమార్తె లక్ష్మిని జనసేన నాయకులు, జనసైనికులు గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రాణరక్షణ కల్పించాలంటూ ఎస్పీకి వినతి



బాపట్ల జిల్లా పోలీసు కార్యాలయం వద్ద సమస్య వివరిస్తున్న బాధితుడు బండ్లమూడి శ్రీనివాసరావు

బాపట్ల, ఏప్రిల్ 27 : ప్రాణ రక్షణ కల్పించాలని కోరుతూ అద్దంకి నియోజకవర్గం బల్లికురవ మండలం గంగాపాలెంకు చెందిన బండ్లమూడి శ్రీనివాసరావు శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ వకుల్ జిందాల్‌ను వినతిపత్రం ద్వారా కోరారు. గంగాపాలెంకు చెందిన శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 21వ తేదీన పొలంలో పని చేసుకుంటుండగా బండ్లమూడి రామయ్య, బండ్లమూడి వెంకటేష్, బండ్లమూడి సుబ్బారావు, బండ్లమూడి రజనీ కత్తులు, వేటకొడవళ్ళు, గొడ్డలితో దాడిచేసి తన తల పగలగొట్టి భార్య చెయ్యి నరికి కొడుకు గొంతును కత్తితో కోసి దౌర్జన్యంగా చంపబోయారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వారి నుంచి తప్పించుకొని గ్రామంలోకి వచ్చామని, అక్కడ కూడా చంపటానికి ప్రయత్నించారని, గ్రామంలో ఉంటే చంపుతామని బెదిరిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం మార్టూరు హాస్పటల్‌లో చికిత్స పొందుతూ బల్లికురవ పోలీసు స్టేషన్‌లో స్టేట్‌మెంట్ ఇవ్వటం జరిగిందన్నారు. సంఘటన జరిగి ఆరు రోజులైన ఏవిధమైన చర్యలు తీసుకోకపోవటంతో తమకు ప్రాణభయంఉందని రక్షణ కల్పించాలని శ్రీనివాసరావు కోరారు.



ధర ధగధగ

● పొగాకు మార్కెట్లో రికార్డు స్థాయి ధరలు
● మేలు రకం కిలో రూ.294,
● బ్రౌన్ రకం రూ.270 కు కొనుగోలు
● బోర్డు చరిత్రలో దక్షిణాదిన ఇదే అధికం
● ఇప్పటి వరకూ 32 మిలియన్ కిలోలు కొనుగోలు
● కిలోకు రూ.231 లభించిన సగటు ధర

ఒంగోలు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : దక్షిణాది పొగాకు మార్కెట్ రోజురోజుకూ మరింత హాట్‌హాట్‌గా సాగుతోంది. ఒక వైపు మేలు రకం, మరో వైపు లోగ్రేడ్‌లో నాణ్యమైనదిగా భావించే బ్రౌన్ రకం ధరలు పైపైకి చేరుతున్నాయి. శనివారం మార్కెట్లో రికార్డు స్థాయి ధరలు లభించాయి. మేలు రకం గరిష్ఠ ధర కిలో రూ.294పలికింది. బ్రౌన్ రకం రూ.270 లభించింది. పొగాకు బోర్డు చరిత్రలో దక్షిణాది వేలం కేంద్రాలలో ఈ స్థాయి ధరలు లభించడం ఇదే ప్రథమం. రెండు నెలల క్రితం ప్రస్తుత సీజన్ పొగాకు కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. తొలిరోజు కిలో రూ.230 గరిష్ఠ ధర లభించింది. అలా దాదాపు నెలరోజులపైనే నిలకడగా సాగింది. అనంతరం కొద్దికొద్దిగా పెరుగుతూ వచ్చింది. అదే సమయంలో లోగ్రేడ్ బేళ్లపై వ్యాపారులు దృష్టిపెట్టడంతో వాటి ధరలు కూడా పెరుగుతూ వచ్చాయి. అలా నెల క్రితం వరకూ మేలు రకం గరిష్ఠ ధర కిలో రూ.230 నుంచి 235 వరకూ ఉండగా.. లోగ్రేడ్‌లో కాస్త నాణ్యత కలిగిన వాటి ధరలు కిలో రూ.225 నుంచి 230 వరకూ పలికాయి. ఆ సమయంలో గ్రేడ్ ఏదైనా ఒకే ధర అన్నట్లుగా మార్కెట్ సాగడంతో ఎక్కువ మంది రైతులు మేలు రకం బేళ్లను కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ ఉంచి లోగ్రేడ్‌ను వేలం కేంద్రాలకు తెచ్చారు. ఇప్పుడు కూడా ఎక్కువ కేంద్రాల్లో అలాగే వస్తున్నాయి.


మేలు రకం కోసం వ్యాపారుల పోటీ

పక్షం రోజులుగా మేలు రకం బేళ్ల కోసం వ్యాపారులు పోటీ పడుతుండటంతో క్రమంగా వాటి ధరలు పెరుగుతున్నాయి. 15 రోజుల క్రితం మేలు రకం పొగాకు గరిష్ఠ ధర కిలో రూ.250కు అటుఇటుగా ఉండగా సోమవారం నాటికి అది రూ.270కి చేరింది. ఐదారు రోజులుగా రోజూ కొంత పెరుగుతుండగా శనివారం ఒంగోలు-1, వెల్లంపల్లి కేంద్రాల్లో ఏకంగా గరిష్ఠ ధర కిలో రూ.294 పలికింది. మిగిలిన వాటిలో ఎక్కువ చోట్ల కిలో రూ.290పైన లభించింది. ఆదేసమయంలో లోగ్రేడ్‌లో నాణ్యతమైనదిగా భావించే బ్రౌన్‌రకం ధరలు కూడా ఇలాగే పెరుగుతున్నాయి. పక్షం క్రితం ఆ రకం ధర కిలో రూ.230 ఉండగా క్రమంగా పెరుగుతూ శనివారం రూ.270కి చేరింది. ప్రస్తుతం వేలం కేంద్రాల్లో బేళ్ల కోసం బయ్యర్లు పోటీపడుతున్న తీరును చూస్తే గరిష్ఠ ధర కిలో రూ.300 దాటే అవకాశం ఉంది. దక్షిణాదిలో ఇప్పటి వరకు 32 మిలియన్ కిలోల పొగాకు విక్రయాలు జరిగాయి. సగటున కిలోకు రూ.231లభించింది. ఇప్పటి వరకు అమ్మకం జరిగిన పొగాకులో మూడొంతులు లోగ్రేడ్ కాగా రానున్న రోజుల్లో సగటు ధర కిలోకు రూ.250 దాటుతుందని సమాచారం.

మార్కాపురం జిల్లా ఏదీ?

పశ్చిమ ప్రాంత ప్రజల సూటి ప్రశ్న
సమాధానం లేక వైసీపీ అభ్యర్థుల విలవిల
జిల్లాల పునర్విభజనలో పట్టించుకోని పాలకులు
సీఎంను గట్టిగా అడగలేని స్థితిలో అధికారపార్టీ నేతలు
అప్పుడు మిన్నకుండటంతో ఇప్పుడు ఇరకాటం
జిల్లా ఏర్పాటుతో అన్నివిధాలా అభివృద్ధి చెందే అవకాశం
అదే హామీతో దూసుకుపోతున్న టీడీపీ అభ్యర్థులు

జిల్లాలోని పశ్చిమ ప్రాంత ప్రజల ఆకాంక్షల్లో ముఖ్యమైనది ప్రత్యేక మార్కాపురం జిల్లా. గత 55ఏళ్లుగా ఉన్న డిమాండ్ అది. పలు సందర్భాలలో ఆ ప్రాంత ప్రజలు గొంతెత్తి చాటారు. వైసీపీ ప్రభుత్వం 13 జిల్లాలను 26గా విభజించిన సమయంలో ఆ ప్రాంతవాసులు తమ డిమాండ్‌ను మరింతగా వినిపించారు. రోడ్డెక్కి ఆందోళనలు నిర్వహించారు. భారీ ఉద్యమమే చేశారు. అయినా వారి ఆకాంక్షను వైసీపీ ప్రభుత్వం కానీ, ఆ పార్టీ ప్రజాప్రతినిధులు కాని పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో సమయం వచ్చినప్పుడు చూద్దామనుకున్నారు కాబోలు ఎన్నికల ప్రచారం ప్రారంభమైన ప్రస్తుత తరుణంలో జనం ప్రత్యేక జిల్లా ఏది అంటూ ప్రశ్నించటం ప్రారంభించారు. ప్రభుత్వానికి నచ్చజెప్పి వత్తిడితో కదిలించో జిల్లాను సాధించాల్సిన మీరు అప్పుడేమి చేశారంటూ సూటిగానే ప్రశ్నిస్తున్నారు. ఇది పశ్చిమ ప్రాంతంలో ప్రచారానికి వెళ్లిన వైసీపీ అభ్యర్థులు, నాయకులకు ఇబ్బందికరంగా మారింది.



మార్కాపురం పట్టణం వ్యూ

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా 1970లో ఒంగోలు జిల్లాను ఏర్పాటు చేశారు. 1972లో సమరయోధులు ప్రకాశం పంతులు పేరు మీద ప్రకాశం జిల్లాగా మార్చారు. ప్రస్తుత జిల్లాకేంద్రం ఒంగోలు, తాజాగా బాపట్ల జిల్లాలోకి వెళ్లిన చీరాల, పర్చూరు. అద్దంకి ప్రాంతాలను గుంటూరు జిల్లా నుంచి విడదీశారు. కొండపి, కందుకూరు, కనిగిరి దర్శిలోని కొంత ప్రాంతాన్ని అప్పటి నెల్లూరు జిల్లా నుంచి బయటకు తీశారు. గిద్దలూరు, మార్కాపురం, వైపాలెం నియోజకవర్గాల ప్రాంతాలను కర్నూలు జిల్లా నుంచి విడగొట్టారు. జిల్లా ఏర్పాటు సమయంలోనే విజ్ఞులైన అప్పటి కొందరు నాయకులు అంతోఇంతో జిల్లాకు నడిబొడ్డున ఉన్న పొదిలిని జిల్లాకేంద్రంగా చేయాలని డిమాండ్ చేశారు. అయితే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో చక్రంతిప్పుతున్న ఒక నాయకుని పలుకుబడితో ఒంగోలును జిల్లాకేంద్రంగా చేశారు. ఆ తర్వాత పొదిలిని కనీసం డివిజన్ కేంద్రంగా చేయాలనే డిమాండ్ వచ్చినా పట్టించుకోలేదు.

లోక్‌సభ కేంద్రం రద్దుచేశారు

అప్పట్లో మార్కాపురం కేంద్రంగా ఉన్న లోక్‌సభ నియోజకవర్గం కూడా పునర్విభజనలో రద్దయింది. ఆ తర్వాత నియోజకవర్గాల పునర్విభజన జరిగిన సందర్భాల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండటంతో రాజకీయ కోణంలో ఒంగోలు లోక్‌సభ నియోజకవర్గం రూపురేఖలు మార్చారు. ఒంగోలు నగరంతో కలిసి ఉన్న ఎస్ఎన్‌పాడు అసెంబ్లీని బాపట్లలోకి మార్చి కందుకూరును నెల్లూరులోకి వేసి సుదూరంలో ఉన్న మార్కాపురం డివిజన్ మొత్తాన్ని ఒంగోలు లోక్‌సభలోనే ఉంచారు. అందుకు ప్రధాన కారణం ఆ ప్రాంతంలో కాంగ్రెస్ అనుకూల ఓటర్లు ఎక్కువగా ఉన్నారనేదే. ముఖ్యంగా పశ్చిమ ప్రాంతంలో రాజకీయంగా చక్రంతిప్పే ఒక సామాజిక వర్గ నేతలు కాంగ్రెస్‌లో ఉండటం అందుకు కారణమైంది. అయితే రాయలసీమ ప్రకాశం జిల్లాకు వచ్చిన తర్వాత ఆ ప్రాంత ప్రజల మనోభావాల్లో మార్పు వచ్చింది. అయా దశల్లో పాలనా వికేంద్రీకరణ జరిగిన సందర్భాల్లో జిల్లాకేంద్రం సుదూరంగా ఉండటం సమస్యగా మారి పశ్చిమ ప్రాంతాన్ని ప్రత్యేక జిల్లా చేయాలనే డిమాండ్ ఉద్భవించింది.

సుదూరంలో జిల్లాకేంద్రం

ఇప్పటికీ పశ్చిమప్రాతంలోని మారుమూల గ్రామాలకు వెళ్లాలంటే అధికారులకు, ప్రజాప్రతినిధులకు రోజంతా సరిపోతుంది. గిద్దలూరు ఒంగోలుకు 140 కిలోమీటర్లు దూరంలో ఉంటే, పుల్లలచెరువు మండలం 120 కిలోమీటర్లు దూరంలో ఉంది. ఇక అటవీ ప్రాంత గ్రామాలకు అధికారులు గాని ఆయా సందర్భాల్లో పాలక ప్రజాప్రతినిధులు వెళ్లి రావాలంటే రెండు రోజుల సమయం పడుతుంది. దీంతో క్రమేపీ పశ్చిమ ప్రాంతవాసులు తమ ప్రాంతాన్ని ప్రత్యేక జిల్లా చేయాలనే కోరుతున్నారు.

కొత్త రాష్ట్రం.. కొత్త జిల్లాలు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయి ప్రత్యేక ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత కొత్త జిల్లాల ఏర్పాటుపై అందరూ దృష్టి కేంద్రీకరించారు. కొత్త రాష్ట్రం ఏర్పడిన తర్వాత అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం జిల్లాల విభజన జోలికి వెళ్లలేదు. దీంతో ఆ ప్రాంత ప్రత్యేక జిల్లా ఏర్పాటుపై ప్రజల ఆకాంక్ష పాలకులకు తెలియజేయటమే తప్పా ఉద్యమాలు జరగలేదు. కానీ స్థానికంగా అన్ని పార్టీల నాయకులు పశ్చిమప్రాంతంలో నడిబొడ్డున ఉన్న మార్కాపురం కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేస్తామని హామీలు ఇవ్వటం పరిపాటిగా మారింది.

జగన్ మాటతో పెరిగిన విశ్వాసం

గత ఎన్నికల ముందు ప్రతిపక్ష నాయకుడిగా జగన్ కొత్త జిల్లాల ఏర్పాటుకు హామీ కూడా ఇచ్చారు. దీంతో ఆ ప్రాంత ప్రజల్లో ఆశలు చిగురించాయి. పైగా ఒక్క చాన్స్ ఇవ్వాలనే పాలసీకి అనుగుణంగా ఆ ప్రాంతం ప్రజలు గత ఎన్నికల్లో వైసీపీకి భారీ ఆధిక్యత ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ తూర్పుప్రాంతంలోని నాలుగు స్థానాల్లో గెలుపొందగా పశ్చిమ ప్రాంతాల్లో అన్నీ స్థానాలను వైసీపీ కైవసం చేసుకుంది. అందునా ప్రతి చోట భారీ ఆధిక్యత లభించింది. ఎమ్మెల్యేలంతా ఆ పార్టీ వారే. తదనుగుణంగా ఎమ్మెల్యేలు గ్రామాలకు వెళ్లినప్పుడు ప్రత్యేక జిల్లాను దృష్టిలో పెట్టుకొని పనిచేయండి అని చెప్పటం జరుగుతూనే ఉంది. వైసీపీ ప్రభుత్వం వచ్చిన రెండున్నరేళ్ల తర్వాత కొత్త జిల్లాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టగా ఆ ప్రాంతం ప్రజలు తమ డిమాండ్ బయటపెట్టారు. మార్కాపురంతోపాటు గిద్దలూరు, వైపాలెం, దర్శి, కనిగిరి నియోజకవర్గాలను ప్రత్యేక జిల్లాగా చేయాలని డిమాండ్ చేశారు. ఈ వైపున చూస్తే కందుకూరు అసెంబ్లీ వాసులు తమను ఒంగోలులోనే ఉంచాలని నెల్లూరు పంపవద్దని గగ్గోలుపెట్టారు. అద్దంకి నియోజకవర్గ ప్రజలు తమకూ ఒంగోలే ముద్దు.. బాపట్ల వద్దంటూ ఉద్యమించారు. ఆ సమయంలో అధికార వైసీపీ నేతలు మౌనవ్రతం పాటించారు. టీడీపీ నాయకులు అటు మార్కాపురం ఇటు ఒంగోలు కేంద్రంగా ఆరు నియోజకవర్గాలకు ఒక జిల్లాను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆ మేరకు ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పించారు.

పార్టీలకతీతంగా ఐక్య ఉద్యమం

ఇక మార్కాపురంలో అయితే జిల్లా సాధన సమితి పేరుతో పార్టీలకతీతంగా ప్రజలు ఐక్య కార్యాచరణతో ఆందోళన చేపట్టారు. కొన్నినెలల పాటు ఉద్యమం సాగింది. ఆ సమయంలో లోక్‌సభ నియోజకవర్గాల వారీగానే కొత్త జిల్లాల ఏర్పాటు జరుగుతుందని ఒకచోట గాడితప్పితే మిగిలిన చోట ఇబ్బంది వస్తుందని జగన్ చెప్పిన మాటలను వైసీపీ నాయకులు ప్రజలకు చెప్పటం ప్రారంభించారు. అయితే 25 పార్లమెంట్ నియోజకవర్గాలు రాష్ట్రంలో ఉండగా ఒక జిల్లా అదనంగా ఏర్పాటుచేశారు. స్థానికుల డిమాండ్‌కు అనుగుణంగా లోక్‌సభలతో సంబంధం లేకుండా కొన్ని నియోజకవర్గాలను మార్పు చేశారు. ఉదాహరణకు బాపట్ల లోక్‌సభలో ఉన్న ఎస్ఎన్‌పాడును ప్రకాశం జిల్లాలో కలిపారు. వెంకటగిరి నియోజకవర్గంలో కొన్ని మండలాలను నెల్లూరు జిల్లాలో ఉంచి కొన్ని మండలాలను కొత్తగా ఏర్పడిన తిరుపతి జిల్లాలోకి మార్చారు. ఈ రెండు అంశాలను పశ్చిమప్రాతం ప్రజలు ప్రస్తావిస్తూ స్థానిక వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు అన్యాయం చేశారని దుమ్మెత్తిపోశారు. మంత్రిగా ఉన్న బాలినేని ఎస్ఎన్‌పాడు విషయంలో అంత శ్రద్ధ తీసుకొని మార్కాపురం ప్రజల ఆకాంక్షను గాలికొదిలేశారని విమర్శించారు. ప్రజల అసంతృప్తిని అప్పట్లోనే వైసీపీ ప్రజాప్రతినిధులు గుర్తించినా కనీసం ప్రభుత్వంపై వత్తిడి చేసే చర్యలు కూడా తీసుకోలేదు.

సమాధానం చెప్పలేని పరిస్థితి

ఇది ఎన్నికల సమయం, సహజంగానే ఓట్ల కోసం వెళ్లిన నాయకుల వద్ద ప్రజలు తమ మనోభావాలను వ్యక్తం చేస్తారు. ఇప్పుడు పశ్చిమప్రాంతంలో అదే జరుగుతుంది. ప్రస్తుతం పశ్చిమప్రాంతంలో గిద్దలూరు నుంచి పోటీచేస్తున్న నాగార్జునరెడ్డి మార్కాపురం ఎమ్మెల్యేగా ఉన్నారు. మార్కాపురంలో పోటీలో ఉన్న అన్నా రాంబాబు గిద్దలూరు ఎమ్మెల్యేగా ఉన్నారు. దర్శి నుంచి పోటీలో ఉన్న శివప్రసాద్‌రెడ్డి అప్పుడు మాజీ ఎమ్మెల్యేగా రాజకీయంగా క్రియాశీలకంగా ఉన్నారు. కనిగిరి నుంచి పోటీలో ఉన్న నారాయణ వైసీపీ జడ్పీటీసీగా ఉన్నారు. వైపాలెం నుంచి పోటీలో ఉన్న చంద్రశేఖర్ స్థానికేతరుడు. అప్పట్లో వైపాలెం ఎమ్మెల్యేగా ఉండి మంత్రిగా ఉన్న సురేష్ ఇప్పుడు జిల్లాలోని కొండపి నుంచి పోటీచేస్తున్నారు. దీంతో పశ్చిమ ప్రాంత వైసీపీ ఎమ్మెల్యేలు నియోజకవర్గం వెళ్లినప్పుడు మార్కాపురం జిల్లా ఏమైంది. మీరు అప్పుడు ఎందుకు నోరు మెదపలేదు. ఎందుకు ప్రభుత్వంపై వత్తిడి తేలేదని కొందరు సూటిగానే ప్రశ్నిస్తున్నారు. ఇటీవల కొనకనమిట్ల మండలం, దొనకొండ అడ్డరోడ్డు వద్ద జరిగిన సిద్ధం సభలో జగన్ మాట్లాడుతూ కొత్త జిల్లాల ఏర్పాటు ప్రక్రియను ఘనంగా చెప్పుకున్నారు. కానీ మార్కాపురం జిల్లా ఏర్పాటు గురించి ప్రస్తావించలేదు. ఆ సభలో ఉన్న వైసీపీ ఎమ్మెల్యే, ఎంపీ ప్రజల సంతృప్తి కోసమైన ఈ అంశాన్ని ప్రస్తావించలేదు. ఈ విషయాన్ని ప్రచారంలోకి వెళ్లిన అభ్యర్థులను వైసీపీ శ్రేణులు కూడా సూటిగా ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై ఏమీ చెప్పలేని పరిస్థితిలో వైసీపీ అభ్యర్థులు మెతకవైఖరి అవలంబిస్తున్నారు.

మాజీ మంత్రి శిద్దా ఇంట్లో దోపిడీకి యత్నం

వాచ్‌మన్ గొంతుకోసే ప్రయత్నం
భద్రతా సిబ్బంది అప్రమత్తమవడంతో పరారైన ఆగంతుకులు
సీసీ ఫుటేజ్‌లో దృశ్యాలు



వాచ్‌మన్‌పై దాడి చేస్తున్న ఆగంతుకులు

ఒంగోలు (క్రైం), ఏప్రిల్ 27 : మాజీ మంత్రి, వైసీపీ నేత శిద్దా రాఘవరావు ఇంట్లో దోపిడీకి ఇద్దరు ఆగంతుకులు విఫలయత్నం చేశారు. ఒంగోలు లాయర్‌పేట ఎక్స్‌టెన్షన్‌లోని ఆయన ఇంట్లోకి గోడదూకి ప్రవేశించిన వారు కత్తులతో వాచ్‌మన్ గొంతు కోసేందుకు ప్రయత్నించారు. ప్రతిఘటించిన ఆయన కిందపడటంతో అలికిడికి పక్కనే నిద్రిస్తున్న భద్రత సిబ్బంది అప్రమత్తమవడంతో ఆగంతుకులు పరారయ్యారు. ఈ సంఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. అయితే విషయాన్ని శనివారం మధ్యాహ్నం వరకూ రహస్యంగా ఉంచారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో రంగంలోకి దిగిన వారు దర్యాప్తు ప్రారంభించారు.

గోడదూకి ఇంట్లోకి ప్రవేశం

ముఖాలకు మాస్కులు ధరించి ఉన్న ఇద్దరు ఆగంతుకులు శిద్దా ఇంటికి ఉత్తరం వైపు ఉన్న గోడ దూకి లోపలకు ప్రవేశించారు. అనంతరం శిద్దా దంపతులు ఉండే మొదటి అంతస్తుకు వెళ్లేందుకు ప్రయత్నించారు. తలుపులు మూసిఉండటంతో తిరిగి కింద భాగాన ఉన్న కార్యాల యం లోపలికి వచ్చారు. అక్కడ వాచ్‌మన్ దుర్గారావు కుర్చీలో కూర్చొని కన్పించాడు. దీంతో ఆగంతకులు దుర్గారావు పైదాడి చేశారు. కత్తులతో గొంతు కోసే ప్రయత్నం చేయగా ప్రతిఘటించాడు. ఆ సమయంలో ఆయన కిందపడిపోయాడు. అలికిడి విన్న శిద్దా భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు. వారు కేకలు వేయడంతో ఇరువురు ఆగంతుకులు తిరిగి గోడ దూకి పరారయ్యాయి. ఈ దృశ్యాలన్నీ సీసీ ఫుటేజీలో కనిపించాయి. ఇదంతా జరుగుతున్న సమయంలో శిద్దా దంపతులు ఇంట్లోనే ఉన్నారు. విషయం తెలుసుకున్న వారు భయాందోళనకు గురయ్యారు. కొన్నేళ్ల క్రితం కూడా చీమకుర్తిలోని శిద్దా ఇంట్లో చోరీ జరిగింది. మరలా ఒంగోలులోని ఆయన నివాసంలోకి ఇద్దరు ఆగంతుకులు కత్తులతో ప్రవేశించడం చర్చనీయాంశమైంది. వారు దొంగతనం కోసం వచ్చారా? ఏదైనా అఘాయిత్యానికి పాల్పడటానికి వచ్చారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రంగంలోకి పోలీసులు

మాజీ మంత్రి శిద్దా ఇంట్లో దోపిడీయత్నం గురించి సమాచారం అందుకున్న పోలీసులు రంగంలోకి దిగారు. అదనపు ఎస్పీ (క్రైమ్స్) ఎస్.వి.శ్రీధర్‌రావు, ఒంగోలు వన్‌టౌన్ సీఐ లక్ష్మణ్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సీసీ ఫుటేజీని చూశారు. అనంతరం విచారణ ప్రారంభించారు. ఆగంతుకులు ఎటువైపు నుంచి వచ్చారు? ఎటువైపు నుంచి వెళ్లారు? వాహనం వినియోగించరా? అన్నదానిపై దృష్టి సారించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ (క్రైమ్స్) విలేకరులతో మాట్లాడుతూ సీసీ ఫుటేజీతో పాటు, వేలిముద్రల ఆధారంగా కేసును దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. అగంతకులు ముఖాలకు మాస్కులు వేసుకొని, కత్తులు చేతబట్టి ఉన్నట్లు గుర్తించామన్నారు. వారిని త్వరలోనే పట్టుకుంటామన్నారు.

అంగన్‌వాడీలకు ఎన్నికల విధులు

జిల్లాలో పోలింగ్ సిబ్బంది కొరత
అవసరాని కంటే 1,100 మంది తక్కువ
కార్యకర్తలు, కాంట్రాక్టు ఉద్యోగుల నియామకం
వారి కోసం పోస్టల్ బ్యాలెట్ గడువు కూడా పెంపు

ఒంగోలు (కలెక్టరేట్), ఏప్రిల్ 27 : సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొనే ఇతర పోలింగ్ సిబ్బంది (ఓపీఎస్) కొరత ఏర్పడింది. ఇప్పటికే ఈ బాధ్యతల్లో నియమితులైన వారికి మొదటి విడత శిక్షణ కూడా పూర్తి చేశారు. వీరిలో పలువురు వివిధ కారణాల వల్ల ఎన్నికల విధుల్లో ఉండలేమని విన్నవిస్తూ లేఖ లు రాశారు. మరి కొంత మంది అనారోగ్య సమస్యలు ఉన్నందున తమకు మినహాయింపు ఇవ్వాలని ఉన్నతాధికారులను కలిసి వేడుకున్నారు. దీంతో పోలింగ్ సిబ్బంది కొరత ఏర్పడింది. దీన్ని అధిగమించేందుకు ఈసీ జిల్లా ఎన్నికల అధికారులకు కీలక ఆదేశాలు ఇచ్చింది. అంగన్‌వాడీ కార్యకర్తలతో పాటు కాంట్రాక్టు ఉద్యోగుల సేవలను అవసరమైన ప్రాంతాల్లో ఎన్నికల విధులకు వినియోగించుకోవాలని సూచించింది. తదనుగుణంగా జిల్లా అధికారులు చర్యలు చేపట్టారు. ఎన్నికల నిర్వహణ కోసం అవసరమైన సిబ్బందిలో 1,100 మంది తక్కువగా ఉన్నట్లు సమాచారం. దీంతో అంగన్‌వాడీ కార్యకర్తలు, కాంట్రాక్టు ఉద్యోగులను పోలింగ్ విధులకు నియమించినట్లు తెలిసింది. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం గడువును కూడా పెంచుతూ ఈసీ ఉత్తర్వులు ఇచ్చింది. తొలుత ప్రకటించిన ప్రకారం ఈనెల 26వతేదీతో పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు గడువు ముగిసింది. సిబ్బంది కొరత నేపథ్యంలో కొత్తవారిని నియమించాల్సి రావడంతో వచ్చేనెల 1వతేదీ వరకు గడువు పెంచింది.

కనిగిరి అభివృద్ధికి పక్కా ప్రణాళిక

» ఎంపీ మాగుంట

కనిగిరి, ఏప్రిల్ 27: సూపర్‌సిక్స్ పథకాలతో ప్రజలకు సంక్షేమాన్ని అందించి ఏపీని అభివృద్ధి అందించేందుకు చంద్రబాబు, సూపర్ ఫైవ్ కార్యక్రమాలతో ప్రణాళికా బద్ధంగా కనిగిరి ప్రాంత అభివృద్ధికి డాక్టర్ ఉగ్ర కృత నిశ్చయంతో ఉన్నారని ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో శనివారం టీడీపీ నాయకులు, కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ పాలనలో అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. ఎన్నికలు కేవలం 15 రోజులు మాత్రమే ఉన్నాయన్నారు. ప్రతి నాయకుడు ప్రజలకు మరింత చేరువై టీడీపీకి ఓట్లు వేయించేలా కృషి చే యాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలోని పశ్చిమ ప్రాంతం అభివృద్ధి కోసం తన కుటుంబం ఎంతో కృషి చేసిందని చెప్పారు.

టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ బూత్ పరిధిలో వచ్చే 15 రోజులు మెజార్టీ కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీకో సం పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటింటికి తిరిగి టీడీపీ విజయానికి కృషి చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. గ్రామాల్లో పనిచేయకుండా పార్టీ ఆఫీసుకు రావద్దన్నారు. కేవలం నాకు కనిపించాలనే నెపంతో కార్యక్రమాలు చేయకుండా ఉండేవారికి పార్టీలో సముచిత స్థానం లభించదని చెప్పారు. కొత్తగా వచ్చే వారిపట్ల అనవసరపు ఆపోహలకు పోవద్దన్నారు. ఐదేళ్ళు కష్టపడి పార్టీ అభివృద్ధికి కృషి చేసిన వారికి ఎప్పుడూ తగిన గుర్తింపు ఉంటుందని చెప్పారు. ఎంపీ అభ్యర్థిగా తనకు తండ్రి సమానులైన మాగుంట రావటం తనకెంతో సంతోషానిచ్చిందన్నారు. ఆయన కుటుంబానికి కనిగిరి ప్రాంత ప్రజలకు ఎంతో అవి నాభావ సంబంధం ఉందన్నారు. ఈసందర్భంగా జగనాసుర రక్తచరిత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, రాచమల్ల శ్రీనివాసులరెడ్డి, నాగరాజు, వీవీఆర్ మనోహరరావు పాల్గొన్నారు.



వెలిగండ్ల: ప్రచార రథంపై నుంచి మాట్లాడుతున్న మాగుంట, ఉగ్ర

● ప్రజాగళం సూపర్ సక్సెస్

ఆత్మకూరు, బుచ్చి ప్రజాగళం సభలు సూపర్ సక్సెస్ అయ్యాయి. ఈ రెండు సభలకు జనం వేల సంఖ్యలో హాజరయ్యారు. ఆత్మకూరులో నాలుగు రోడ్ల కూడలిలో ఎటు చూసినా జనమే కనిపించారు. బుచ్చిలో కిలోమీటర్ల దూరం జనం నిలబడిపోయారు. చంద్రబాబు పర్యటన షెడ్యూల్ కన్నా రెండున్నర గంటలు ఆలస్యం అయినా బుచ్చిలో జనం చెక్కుచెదరకుండా నిరీక్షించారు. చంద్రబాబు ప్రసంగం పూర్తయ్యే వరకు నిలబడి ఉన్నారు. ఈ రెండు సభల్లో చంద్రబాబు ప్రసంగానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించడం విశేషం.

● బావ, బావమరుదుల సందడి

ఎన్నికల ప్రచారంలో భాగంగా నెల్లూరు జిల్లాలో ఒకే రోజు బావ, బావమరుదులు సందడి చేశారు. చంద్రబాబు నాయుడు, బాలకృష్ణలు శనివారం సాయంత్రం ఏక సమయంలో జిల్లా పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో ప్రచారాలు చేశారు. సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి 8 గంటలకు వరకు చంద్రబాబు ఆత్మకూరు, బుచ్చిరెడ్డిపాలెం ప్రజాగళం బహిరంగ సభల్లో పాల్గొన్నారు. అదే సమయంలో బాలకృష్ణ వెంకటగిరి నియోజకవర్గం రాపూరు మండలంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం విశేషం.

నేడు ముస్లింలతో ఆత్మీయ సమావేశం

నెల్లూరులో ఆదివారం జరిగే ముస్లింల ఆత్మీయ సమావేశంలో చంద్రబాబు పాల్గొంటారు. ఉదయం 11 గంటలకు బుచ్చి నుంచి నెల్లూరుకు చేరుకోనున్న బాబు కోటమిట్టలోని షాదిమంజిల్‌లో జరిగే ముస్లింల ఆత్మీయ సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్నం కర్నూలు జిల్లాకు పయనమవుతారు.



ఆత్మకూరు శివార్లలోని నెల్లూరుపాళెం వద్ద జరిగిన ప్రజాగళం సభకు హాజరైన ప్రజానీకాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తున్న చంద్రబాబు నాయుడు

మెట్టను సస్యశ్యామలం చేస్తా

మెట్ట ప్రాంతమైన ఆత్మకూరు నియోజకవర్గాన్ని సస్యశామలం చేసే బాధ్యత నేను తీసుకుంటా. సోమశిల ఉత్తర, దక్షిణ కాలువల లైనింగ్ పనులు పూర్తి చేయడంతోపాటు సోమశిల హైలెవల్ కెనాల్‌ను త్వరితగతిన పూర్తి చేసి శాశ్వత తాగు, సాగునీటి ఎద్దడి నివారణకు కృషి చేస్తా. ఆత్మకూరులో పరిశ్రమలను ఏర్పాటు చేయించి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే బాధ్యత నాదే. మెట్టప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యం అందించే దిశగా ఆత్మకూరులోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలను 250 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దుతా. అంతే కాదు.. ఇక్కడ ట్రామాకేర్ సెంటర్‌నూ ఏర్పాటు చేస్తాం. ఆత్మకూరును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిన రాజకీయ అనుభవంగల ఆనం రామనారాయణరెడ్డిని, ప్రజాసేవే పరమార్థగా రాజకీయాల్లోకి వచ్చి టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఆదరించి అత్యధిక మెజార్టీతో గెలిపించండి. మీ కోసం నేనున్నా..

- ఆత్మకూరు సభలో చంద్రబాబు



టీడీపీలోకి మెట్టుకూరు

ఎన్డీసీసీబీ మాజీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి వైసీపీని వీడి తెలుగుదేశంలో చేరారు. నెల్లూరుపాళెం సభలో ధనుంజయకు చంద్రబాబు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

అవకాశవాదులకు గుణపాఠం చెప్పండి



చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని నెల్లూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ప్రజాసేవే లక్ష్యంగా వచ్చిన తనను ఆదరించి ఎంపీ టిక్కెటు ఇచ్చి పోటీ చేయమని ఆదేశించారని తెలిపారు. ఆత్మకూరులో వచ్చే అత్యధిక మెజార్టీ తన గెలుపునకు కీలకమని పేర్కొన్నారు. వైసీపీ అభ్యర్థులది ఊసరవెల్లి రాజకీయమని ఎద్దేవా చేశారు. అలాంటి అవకాశవాదులకు ప్రజలు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. ఆత్మకూరులో గత పదేళ్లల్లో మేకపాటి కుటుంబం చేసిన అభివృద్ధి శూన్యమని విమర్శించారు.

- నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి

అన్నివర్గాల అభ్యున్నతే ధ్యేయం



రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు గద్దెనెక్కడం చారిత్రాత్మక అవసరమని, వైసీపీ దుర్మార్గపు పాలనను అంతమొందించాలని టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. విక్రమ సింహపురి యూనివర్సిటీకి అనుబంధంగా ఆత్మకూరులో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ఏఎస్‌పేటను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేస్తానని హామీ ఇచ్చారు. భారీ మెజార్టీతో టీడీపీకి విజయం చేకూర్చాలని కోరారు.

- ఆత్మకూరు అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి

● బుచ్చిలో హైటెక్స్ టవర్

బుచ్చిలో జరిగిన సభలో కోవూరు నియోజకవర్గ సమస్యలను నేతలు చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. వీటిపై స్పందించిన ఆయన కోవూరుకు వరాలు ప్రకటించారు. బుచ్చిలో హైటెక్స్ టవర్‌ను నిర్మించి ఇక్కడ నుంచే ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగాలు చేసే విధానానికి శ్రీకారం చుడతానని ప్రకటించారు. కనిగిరి రిజర్వాయర్‌లో పూడిక తీస్తామని, ముదివర్తిపాళెం కాజ్‌వేను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. జొన్నవాడ ఆలయ అభివృద్ధి, డెల్టాను ఆధునీకరిస్తామని ప్రకటించారు. బుచ్చిలో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. మత్స్యకారులను ఆదుకోవడంతోపాటు ఫిషింగ్ హార్బర్‌ను పూర్తి చేస్తామన్నారు. ఇక చేనేతలను ఆదుకునే బాధ్యత తాను తీసుకుంటానని భరోసా ఇచ్చారు. కాగ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి పార్టీ కోసం ఎంతో కష్టద్దారని, ఆయన్ను ఆదుకునే బాధ్యత తాను తీసుకుంటానని ప్రకటించారు.

కుక్కలు మొరిగితే ఏనుగులు భయపడతాయా!?

● మహిళలంటే గౌరవం లేని వైసీపీ ● ఈ చిల్లర నేతలను ఇళ్లకు పంపించండి
● బుచ్చి, ఆత్మకూరు ప్రజాగళం సభల్లో టీడీపీ అధినేత చంద్రబాబు

ఆత్మకూరు/బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 27(ఆంధ్ర జ్యోతి): 'కోవూరు టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఓ ఆడపడుచు అనే కనీస గౌరవం లేకుండా ఆమెపై అభ్యంతరకరంగా పోస్టింగ్‌లు పెట్టిస్తారు. ఆత్మకూరు మున్సిపల్ చైర్‌పర్సన్ టీడీపీలో చేరిందని ఆమెను అవమానకరంగా మాట్లాడతారు. ఆమె నెత్తిమీద రూపాయి పెడితే పది పైసలు కూడా అమ్ముడుపోదంటారా..!? ఇష్టమొచ్చినట్లు పోస్టింగ్‌లు పెడితే ప్రశాంతిరెడ్డి భయపడి పారిపోతుందని అనుకొంటున్నారా!? పర్సంటేజీల ప్రసన్న గుర్తు పెట్టుకో... ఆమె పారిపోయే రకం కాదు.. నిన్ను తరిమికొడుతుంది! జాగ్రత్త, వైసీపీ నాయకులు, పేటీఎం బ్యాచ్‌లు ఒళ్లు దగ్గరపెట్టుకొని మాటాడండి, ఇలాంటి చిల్లర నాయకులను ఇళ్లకు పంపించండి'. అని తెలుగు దేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. శనివారం ఆత్మకూరు, బుచ్చిరెడ్డిపాళెంలలో జరిగిన ప్రజాగళం సభల్లో ఆయన మాట్లాడారు. మహిళలు అనే గౌరవం లేకుండా వైసీపీ నాయకులు కుక్కలు మొరిగినట్లు మొరుగుతున్నారని మండిపడ్డారు.

● చిత్తుగా ఓడించండి!

కోవూరు నుంచి ఎన్డీయే అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పోటీ చేస్తోంది. ఆమెపై వైసీపీ ఎమ్మెల్యే తన పేటీఎం బ్యాచ్‌తో ఇష్టమొచ్చినట్లు పోస్టింగ్‌లు పెట్టిస్తాడు. సోషల్ మీడియాలో ఇష్టం వచ్చినట్లు నోరు పారేసుకొంటున్నాడు. ఆడపడుచు అనే గౌరవం లేకుండా కుక్కలు మొరిగినట్లు మొరుగుతున్నారు. కుక్కలు మొరిగితే ఏనుగులు భయపడుతాయా..!? మా అభ్యర్థి ప్రశాంతిరెడ్డి ఏనుగుతో సమానం' అని చంద్రబాబు అన్నారు. రాజకీయాలంటే సేవ అనేది వేమిరెడ్డి దంపతుల ఆలోచన, కానీ రాజకీయం అంటే దోపిడీ అనేది ప్రసన్న సిద్ధాం



బుచ్చిలో ప్రసంగిస్తున్న చంద్రబాబు, పక్కన వేమిరెడ్డి దంపతులు

తం అనే విషయం ప్రజలందరికి తెలుసన్నారు అసలు జగన్ రెడ్డికి ఆడబిడ్డ లంటే గౌరవం లేదని, ఆయన బాటలోనే ఈ చిల్లర నాయకులు మహిళలను చులకనగా మాట్లా డుతున్నారని అన్నారు. తల్లికి అన్నం పెట్టకుండా తరిమేసిన జగన్, చెల్లెళ్లకు ఆస్తిలో వాటా ఇవ్వకుండా వీధిలోకి నెట్టేసిన జగన్, బాబాయి అనే కనికరం లేకుండా గొడ్డలి దించిన నాయకుని వెంట నడిచే వారికి సంస్కారం ఎక్కడుంటుందన్నారు. ఇలాంటి చిల్లర నాయకులను తరిమికొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. మహిళల పట్ల కనీస గౌరవ మర్యాదలు లేని వైసీపీని ఈ ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించే బాధ్యత మహిళలే తీసుకోవాలన్నారు.

ప్రసన్నకు ఇవే ఆఖరి ఎన్నికలు



ఇసుక, గ్రావెల్, మాఫియాలు, అవినీతిని ప్రశ్నిస్తే దానికి సమాధానం చెప్పకలేక నన్ను, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఎదుర్కోలేక పిచిపిచ్చిగా మాట్లాడుతున్న ప్రసన్నకు ఈ ఎన్నికలే ఆఖరి ఎన్నికలు కావాలి. తాగేందుకు గుక్కెడు నీళ్లు లేక, ఎవరైనా చనిపోతే పూడ్చేందుకు శ్మశానాలు కూడా లేవని ప్రజలు వాపోతుంటే 6 సార్లు ఎమ్మెల్యేగా గెలిచి ఏం చేశారు. నియోజకవర్గంలో యువతకు నిరుద్యోగ సమస్యతోపాటు అన్నివిధాలా సంక్షేమ పథకాలతో అభివృద్ధి చేస్తాము. కోవూరు ప్రజలు అవినీతి ప్రసన్నకు బాయ్ బాయ్ చెప్పి నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, కోవూరు ఎమ్మెల్యేగా నన్ను గెలిపించాలి.

- కోవూరు అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

జగన్ గురించి నాకంటే

పోలీసులకే బాగా తెలుసు!

● సినీ హీరో బాలకృష్ణ



రాపూరులో జరిగిన సభలో మాట్లాడుతున్న బాలకృష్ణ, పక్కన తిరుపతి ఎంపీ అభ్యర్థి వరప్రసాద్, వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ

రాపూరు (డక్కిలి), ఏప్రిల్ 27: నీచ, నికృష్ట, పాపిష్టి జగన్ పరిపాలన గురించి నాకంటే పోలీసులకే బాగా తెలుసు అని సినీ నటుడు నందమూరి బాలకృష్ణ అన్నారు. శనివారం వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోని రాపూరులో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. అక్కడ బందోబస్తులో ఉన్న పోలీసుల వైపు చూసి 'ఏమ్మా... మీకు టీఏలూ, డీఏలూ, సెలవులు, అలవెన్సులు ఇస్తున్నారా?.. కనీసం జీతాలైనా సక్రమంగా ఇస్తున్నారా ..? అంటూ ప్రశ్నించారు. అందుకు వారు మౌనమే సమాధానంగా మిన్నకుండి పోయారు. 'ఎందుకమ్మా మీకు.. ఈ బానిస బతుకులు... ఉంటే రౌడీ ఇన్‌స్పెక్టర్‌లా ఉండండని హితవు పలికారు, ధన,మాన చివరకు వ్యవస్థలన్నింటిని నాశనం చేశాడు పిచ్చోడు... ఇంకా ఎందుకు ఊడిగం చేస్తారు.. ఒక్క రోజైనా నరసింహ నాయుడులా పనిచేయండి అని సూచించారు. జగన్ మాట్లాడితే నేను సిద్ధం అంటున్నారు. ఆయన దేనికి సిద్ధం... ? తల్లిని, చెల్లిని గెంటేసేందుకు సిద్ధమా? సొంత బాబాయిని హత్య చేసిన నిందితులను కాపాడేందుకు సిద్ధమా.. యువతకు ఉద్యోగాలు ఇస్తామని మోసం చేసేందుకా ? అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సీపీఎస్ రద్దు చేస్తానని ఉద్యోగులను మోసం చేసేందుకా.. ఎందుకు సిద్ధమో తేల్చాలన్నారు. అధికార దుర్వినియోగంతో మదం పట్టిన జగన్ రూ. 16 వందల కోట్ల ప్రజాధనాన్ని సిద్ధం సిద్ధం.. అంటూ బోర్డులకు ఖర్చు పెట్టారని బాలకృష్ణ ఆరోపించారు. రాష్ట్రంలో రాక్షస పాలనకు స్వస్తి పలికి రామరాజ్యం కావాలంటే ఎన్డీయే కూటమి విజయంతోనే సాధ్యమన్నారు. ప్రజలు తమ ఓటు అనే ఆయుధంతో జగన్‌ను తరలికొట్టాలన్నారు. రానున్న ఎన్నికల్లో వెంకటగిరి టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణను, తిరుపతి ఎంపీగా బీజేపీ అభ్యర్థి వరప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అభ్యర్థులిద్దరితోపాటు టీడీపీ నాయకులు నరసింహయాదవ్, దందోలు వెంకటేశ్వరరెడ్డి, రాఘవరెడ్డి, కోటేశ్వరరావు, కేఎంకే ప్రసాద్‌నాయుడు, అవ్వారు సత్యం, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



సభలో పాల్గొన్న జనం

సీఎం గారూ.. మీరిచ్చిన జీవో మీకు వర్తించదా ?

● ఉల్లంఘిస్తూ ముఖ్యమంత్రి సభకు ఏర్పాట్లు
● జీవోకి కారణమైన ప్రదేశంలోనే సభాస్థలి
● ఇదెక్కడి చోద్యమంటున్న జనం

కందుకూరు, ఏప్రిల్ 27: సాక్షాత్తూ సీఎం జగన్మోహనరెడ్డి ప్రత్యేకంగా జారీచేసిన జీవో నెం.1861ను అధికారులు ఉల్లంఘిస్తు న్నారు. జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు, పంచా యతీరాజ్, మున్సిపల్ రహదారులు రోడ్డు మార్జిన్లలో సభలు, సమావేశాలకు అనుమతులు ఇవ్వటాన్ని నిషేధిస్తూ గత ఏడాది జనవరి 2న ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఈ ఆదేశాలను కఠినంగా అమలు చేయాలని అధికారులకు సీఎం జగన్ అప్పట్లో ప్రత్యేకంగా ఆదేశాలు జారీచేసింది. అధికారంలో ఉన్న వైసీపీకి కూడా ఎలాంటి మినహాయింపులు ఉండటానికి లేదని ఈ జీవోను కఠినంగా అమలుచేసి తీరుతామని రాష్ట్రప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అప్పట్లో సెలవిచ్చారు. అయితే, సదరు జీవో జారీచేయటానికి కారణమైన ప్రదేశంలోనే సీఎం జగన్మోహనరెడ్డి ఆదివారం బహిరంగసభకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తుండటం చోద్యంగా ఉందన్న విమర్శలు వినిపిస్తు న్నాయి. పట్టణంలోని ఏరియా హాస్పటల్ సెంటర్‌లో 2022 డిసెంబరు చివరివారంలో టీడీపీ అధినేత చంద్రబాబు ఇదేంఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా బహిరంగ సభ ఏర్పాటుచేశారు. పోలీసు ముందస్తు అనుమతులతోనే ఈ సభ ఏర్పాటుచేసినా తగిన భద్రతాచర్యలు చేపట్టకపోవటంతో బహిరంగసభ సమయంలో జరిగిన తొక్కిసలాట కారణంగా దురదృష్టవ శాత్తు 8మంది మృత్యువాత పడ్డారు. ఈ దుర్ఘటనను కారణంగా చూపించి ప్రభుత్వం రహదారులపై సభలు, సమావేశాలు, ర్యాలీల నిర్వహణను నిషేధిస్తూ 2023 జనవరి 2న జీవో జారీచేసింది. ప్రతిపక్ష పార్టీల నాయకులు ప్రజలవద్దకు వెళ్లేందుకు ఆటంకాలు సృష్టించేందుకే ప్రభుత్వం ఈ జీవో తెచ్చిందని అప్పట్లో ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించినా ఈ జీవో అందరికీ వర్తిస్తుందని, ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూసేందుకే జీవో తెచ్చామని ప్రభుత్వం సమర్థించు కుంది. అయితే ఈ జీవోను సీఎం జగన్ కోసమే అధికారులు ఉల్లంఘించటం ఒక ఎత్తైతే ఈ జీవోకు కారణమైన ప్రదేశంలోనే కచ్చితంగా సీఎం జగన్ సభను జరిపేందుకు ఏర్పాట్లు చేస్తుండటం మరింత చోద్యంగా ఉంది.



కందుకూరులోని ఎన్టీఆర్ సర్కిల్‌లో సీఎం జగన్ బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించి, సూచనలిస్తున్న జిల్లా ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్, సబ్ కలెక్టరు విద్యాధరి తదితరులు

● సభాస్థలి పరిశీలన

జిల్లా ఎస్పీ ఆరీఫ్, కందుకూరు సబ్ కలెక్టరు విద్యాధరి తదితరులు శనివారం ఎన్టీఆర్ సర్కిల్‌లో స్థల పరిశీలన చేశారు. అక్కడే జగన్ బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించి ఆదేశాలు జారీచేశారు. సభకు ఏర్పాటుచేస్తున్న రహదారిలో శనివారం మధ్యాహ్నం నుంచే వాహనాల రాకపోకలను నిషేధించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు. దీంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. దానికితోడు మండువేసవిలో నడిరోడ్డుపై సభ ఏర్పాటు చేస్తే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడకతప్పదు.

● వైసీపీ నేతల యాతనలు

మరోపక్క సీఎం సభను విజయవంతం చేసుకునేందుకు వైసీపీ నేతలు నానా అవస్థలు పడుతున్నారు. ఇటీవల బస్సుయాత్రలో భాగంగా సీఎం జగన్ కందుకూరు మీదుగా వెళ్లినప్పటికీ పెద్దగా జనం లేక జగన్ పోస్టాఫీసు సెంటర్లో ఒకేఒక్క నిమిషంలో బస్సులోకి వెళ్లిపోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జగన్ సభకు పెద్దఎత్తున జనసమీకరణ చేసేందుకు గ్రామాల్లోని నాయకులపై ఒత్తిడి పెంచారు. మద్యం ఇచ్చైనా జనాన్ని తరలించుకు రావాలని ఆ పార్టీ నేతలు ఆదేశాలు జారీ చేస్తున్నారు. మూడురోజుల క్రితమే నామినేషన్ కార్యక్రమానికి జనసమీకరణ చేశామని ఇంతలోనే మళ్లీ జనసమీకరణ అంటే కష్టమని నేతలు తలపట్టుకుంటున్నా అవేమీ మాకు పట్టవు మీకు ఏమి కావాలో, డబ్బు ఎంతకావాలో తీసుకెళ్లండి జనం మాత్రం భారీగా తరలిరావాలి జగన్ సభ విజయవంతం కావాలని వారిపై వత్తిడి పెంచుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో జగన్ సభకు ఏమేరకు ప్రజలు తరలివస్తారోనన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

514 పొగాకు బేళ్లు కొనుగోలు

కలిగిరి, ఏప్రిల్ 27: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శనివారం రైతులు మొత్తం 616 పొగాకు బేళ్లు విక్రయానికి తీసుకొచ్చారు. వేలంలో 13 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 514 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-77, ఆర్‌ఆర్-13, సీఆర్-9, జంపింగ్‌లాట్స్-3 కారణాలతో 102బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.285, కనిష్ఠ ధర రూ.216, సగటు ధర రూ.242.29గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

టీడీపీలో చేరిన వారికి సముచిత స్థానం

● ఎన్డీఏ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు ● పసుపు కండువాలు వేసుకున్న హ్యాపీబాషా, పలువురు ముస్లింలు



కందుకూరు : టీడీపీలో చేరిన హ్యాపీబాషా, ముస్లిం నేతలతో ఎమ్మెల్యే ఉమ్మడి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, ఏప్రిల్ 27: జగన్ పాలనలోని వైసీపీ ప్రభుత్వంపై విసుగుచెంది ఆ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరుతున్న వారికి భవిష్యత్‌లో సముచిత స్థానం కల్పిస్తామని టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి కందుకూరు అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. కందుకూరు పట్టణానికి చెందిన వైసీపీ నాయకుడు షేక్ హ్యాపీబాషా, ఆయన ఆధ్వర్యంలో పలు ముస్లిం కుటుంబాల వారు శనివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. ఇంటూరి నాగేశ్వరరావు నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీలో చేరిన వారికి ఆయన పసుపు కండువాలు వేసి ఆహ్వానించారు. షేక్ హ్యాపీబాషాతో పాటు ఆయన బంధుమిత్రులు నజీర్, హర్షద్, కరీముల్లా, శైలేష్, బాజీ, రహమత్, గౌస్, సమీర్ తదితరులు వార్డు నాయకులు సయ్యద్ సుల్తాన్ ఆధ్వర్యంలో పసుపు కండువాలు కప్పుకున్నారు.

● బృందావనంలో టీడీపీలోకి వలసలు

కందుకూరు పట్టణంలో వైసీపీకి కంచుకోటగా ఉన్న బృందావనంలోనూ తెలుగుదేశం పార్టీలోకి వలసలు కొనసాగుతున్నాయి. బృందావనంకు చెందిన పలువురు వైసీపీ నేతలు, కార్యకర్తలు ఆపార్టీని వీడి శనివారం టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వైసీపీ జిల్లా ప్రచారకమిటీ కార్యదర్శి సుదర్శి శ్యాం, జంగాల వెంకటరావు, పాలేటి కరుణాకర్, సత్యనారాయణ, కట్టా వెంకటనారాయణ, గుమ్మడి సురేష్, అల్లాడి అజయ్ తదితరులు టీడీపీ కార్యాలయానికి రాగా వారందరికీ నాగేశ్వరరావు పసుపు కండువాలు వేసి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, షేక్‌ఫజల్, అశ్వక్, సలీం, సలాం, మున్నా, రూబీ, గౌస్, ఫిరోజ్, ఫాజల్, హర్షద్, చదలవాడ కొండయ్య, దాసరి ప్రమోద్, పాలేటి కోటేశ్వరరావు, గేరా నరేష్, జంగాల రాఘవ తదితరులు పాల్గొన్నారు.

● కరేడు వాసుల చేరిక

ఉలవపాడు : మండలంలోని కరేడు గ్రామానికి చెందిన మక్కే మోషే, కొల్లూరి మహేష్, పోలుబోయిన శ్రీనివాసులు, మరికొందరు శనివారం కందుకూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి ఆయన పసుపు కండువా కప్పి స్వాగతం పలికారు. రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ గెలుపు ధ్యేయంగా కష్టపడతామని ఈ సందర్భంగా పార్టీలో చేరినవారు తెలిపారు. స్థానిక నాయకులు పోలుబోయిన శ్రీనివాసులు, కొల్లి వెంకటరమణ, రేగలగడ్డ శ్రీను, మద్దెల శ్రీధర్, మల్లవరపు వెంకట్రావు, మక్కే వెంకటేశ్వర్లు, ఎం సాయి, బీ మురళి తదితరులు పాల్గొన్నారు.



ఉలవపాడు : టీడీపీలో చేరిన కరేడువాసులతో ఇంటూరి నాగేశ్వరరావు

ఇంటూరి సౌజన్య ఇంటింటి ప్రచారం



సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఇంటూరి సౌజన్య

కందుకూరు, ఏప్రిల్ 27: పట్టణంలోని కోవూరు రోడ్డు సాయిబాబా గుడి ప్రాంతంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి ఇంటూరి సౌజన్య శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ, సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఎమ్మెల్యేగా ఇంటూరి నాగేశ్వరరావులను సైకిల్‌గుర్తుపై ఓటువేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో 31వ వార్డు అధ్యక్షుడు అత్తంటి శివకృష్ణ, వరప్రసాద్, పీలా శ్రీనివాసులు, చుంచు వేణు, జమ్ము చైతన్య, సవిడిబోయిన వెంకటకృష్ణ, ముప్పవరపు వేణు, గుమ్మా శివ, మచ్చా మనోహర్, చల్లా మహేంద్ర, ముచ్చు లక్ష్మీరాజ్యం, కల్లూరి శైలజ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి మద్దతుగా బ్రాహ్మణ సమితి ప్రచారం

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులకు మద్ద తు ఇవ్వాలని కోరుతూ బ్రాహ్మణ బంధువుల ఆధ్వర్యంలో శనివారం రాత్రి కందుకూరు పట్టణంలో ప్రచారం నిర్వహించారు. గతంలో తెలుగుదేశం పార్టీకి పనిచేసిన వారితో పాటు నూతనంగా అనేకమంది ముందుకొచ్చి టీడీపీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచార కార్యక్రమంలో పాల్గొనటం విశేషం. పట్టణంలోని 26, 27 వార్డులు, జనార్ధనకాలనీ, బాలనాగేంద్రస్వామి గుడి ప్రాంతాలలో రిటైర్డ్ ఉద్యోగులు, ఉద్యోగులను కలిసి టీడీపీకి మద్దతివ్వాలని ప్రచారం నిర్వహించారు. జగన్మోహనరెడ్డి పాలనలో రిటైర్డ్ ఉద్యోగులకు, పెన్షనర్లకు తీవ్ర అన్యాయం జరిగిందని కనీసం దాచుకున్న సొమ్మును కూడా పొందలేని పరిస్థితి ఏర్పడినందున వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించటమే లక్ష్యంగా ప్రతిఒక్కరూ టీడీపీకి మద్దతివ్వాలని కోరారు. ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని, ఎమ్మెల్యేగా ఇంటూరి నాగేశ్వరరావును గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మంచిరాజు మురళీమోహన్, పెట్లూరి సుబ్బారావు, ఆర్. వెంకటేశ్వర్లు(ఆర్‌వీ), నారాయణం రాధాకృష్ణ, గుంటూరు పద్మనాభశర్మ, శ్రీరామచంద్రమూర్తి, రామచంద్రుని మోహనరావు, పొన్నగంటి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



కందుకూరులో టీడీపీ కూటమికి మద్దతుగా ప్రచారంలో పాల్గొన్న బ్రాహ్మణ రిటైర్డ్ ఉద్యోగులు

జనసేనలో చేరిన దారం సోదరులు



నాగబాబు సమక్షంలో జనసేనలో చేరిన దారం మాల్యాద్రి, కృష్ణ

కందుకూరు, ఏప్రిల్ 27: కందుకూరు పట్టణంలోని పడమర బలిజపాలెంకు చెందిన దారం మాల్యాద్రి, దారం కృష్ణలు తమ అనుచరులతో కలిసి జనసేన పార్టీలో చేరారు. వారు శనివారం పిఠాపురం వెళ్లి జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ సోదరుడు నాగబాబు సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. కందుకూరు సిటింగ్ ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డికి పట్టణంలో ముఖ్య అనుచరులుగా ఉన్న వీరు స్థానిక పరిస్థితుల దృష్ట్యా జనసేన, టీడీపీ కూటమికి మద్దతివ్వాలన్న నిర్ణయంతో జనసేనలో చేరగా ఇప్పటికే పడమర బలిజపాలెంలోని అధికశాతం మంది ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో టీడీపీ కూటమిలో చేరగా ప్రస్తుతం దారం సోదరులు జనసేనలో చేరడం విశేషం.

వడదెబ్బ తగలకుండా అవగాహన కల్పించాలి

● డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రియంవద



రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

ఉలవపాడు, ఏప్రిల్ 27 : రోజురోజుకు ఎండ తీవ్రత ఎక్కువవుతున్నందున ప్రజలకు ముఖ్యంగా చిన్న పిల్లలకు, వృద్ధులను వడదెబ్బ నుంచి కాపాడుకోడానికి అవగాహన కల్పించాలని కందుకూరు డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం ప్రియంవద వైద్య సిబ్బందికి సూచించారు. శనివారం ఉదయం కరేడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె సందర్శించారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలలోపు ముగించాలని ఆదేశించారు. వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలతోపాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని సూచించారు. వైద్యశాలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిని రమ్యజ్యోతి, ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు.

మద్యం అక్రమ రవాణా, నాటు సారాపై నిఘా పెంచాలి



మాట్లాడుతున్న సెబ్ ప్రత్యేకాధికారి దయాసాగర్

కావలి, ఏప్రిల్ 27: మే 13న జరుగనున్న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మద్యం అక్రమ రవాణా, నాటు సారాపై నిఘా పెంచాలని జిల్లా సెబ్ స్పెషలాఫీసర్ దయాసాగర్ చెప్పారు. కావలి శాంతినగర్‌లో ఉన్న సెబ్ కార్యాలయాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి పలు కేసుల వివరాలను సేకరించారు. అనంతరం ఎన్నికల సందర్భంగా నేరాలు అరికట్టేందుకు సెబ్ అధికారులు తీసుకోవాల్సిన చర్యలు గురించి వివరించారు. ఎన్నికలకు ప్రభావితం చేసే మద్యం ఎక్కడా అనధికారికంగా సరఫరా కాకుండా అలాగే నాటు సారా తయారీ, సరఫరాలపై గట్టి నిఘా ఉంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కావలి సెబ్ ఇన్‌స్పెక్టర్ టీ. లక్ష్మణస్వామి, ఎస్‌ఐ రాజశ్రీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ గుడిలో టీడీపీ నేతల పూజలు

కావలి, ఏప్రిల్ 27: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దగుమాటి వెంకట(కావ్య) క్రిష్ణారెడ్డి, నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలు విజయం సాధించాలని కోరుతూ శనివారం టీడీపీ నేతలు పాతూరులోని కాలేరమ్మగుడి వద్ద ఉన్న పోలేరమ్మ గుడిలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ బాధ్యులు టీడీపీ నేత జనిగర్ల మనోహర్‌ను సత్కరించారు. కాలేరమ్మగుంట గిరిజనులకు వైసీపీ పాలనలో ఎలాంటి మౌలిక వసతులు కల్పించలేదని టీడీపీ అధికారంలోకి రాగానే క్రిష్ణారెడ్డి ద్వారా ఈ ప్రాంత అభివృద్ధితో పాటు గిరిజనుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు రామిరెడ్డి క్రిష్ణారెడ్డి, జంపాని ప్రసాద్, వాకా శ్రీనివాసులురెడ్డి, దాసరి రవి, మధుసూదనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జలదంకి సొసైటీ మాజీ అధ్యక్షుడు కన్నుమూత

● కావ్య, వంటేరు, తదితరుల నివాళి

జలదంకి, ఏప్రిల్ 27: కావలి అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి బావ, జలదంకి సొసైటీ మాజీ అధ్యక్షుడు ముంగమూరి వెంకటేశ్వరరెడ్డి(70) అనారోగ్యంతో చెన్నైలో చికిత్స పొందుదతూ శుక్రవారం మృతి చెందారు. ఈయన మృతదేహాన్ని కుటుంబసభ్యులు కావలి పట్టణంలోని రామ్మూర్తిపేటలోని వారి నివాసానికి తీసుకువచ్చారు. శనివారం టీడీపీ కావలి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి, కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, ఉదయగిరి టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్ సోదరుడు సునీల్, కావలి మాజీ ఏఎంసీ చైర్మన్ మలిశెట్టి వెంకటేశ్వర్లు, మాజీ మున్సిపల్ చైర్మన్ పోతుగంటి అలేఖ్య, కావలి పట్టణం, జలదంకి మండలంలోని పలు రాజకీయపార్టీల నాయకులు, ప్రముఖులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని హిందూ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

ఎమ్మెల్యే రామిరెడ్డి, పసుపులేటిల..

నేర చరిత్ర తెలుసుకోవాలి

● టీడీపీ కావలి అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి



కావలి : ఎమ్మెల్యేపై కేసులతో కూడిన అఫిడవిట్ పత్రాన్ని ప్రదర్శిస్తున్న కావ్య కృష్ణారెడ్డి

కావలిటౌన్, ఏప్రిల్ 27: ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి, ఇండిపెండెంట్ అభ్యర్థి పసుపులేటి సుధాకర్‌ల నేరచరిత్ర ప్రజలు తెలుసుకోవాలని టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి పేర్కొన్నారు. శనివారం తన నివాసం వద్ద కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నామినేషన్ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి తనపై 7 క్రిమినల్ కేసులు, పసుపులేటి సుధాకర్ తనపై 8 క్రిమినల్ కేసులున్నట్లు స్వయంగా వారే తమ అఫిడవిట్‌లలో పొందుపరిచారన్నారు. అఫిడవిట్ నకళ్ల ప్రతులను ప్రదర్శిస్తున్నానని, వారిద్దరూ తోడు దొంగలన్నారు. పథకం ప్రకారం తనపై కేసులున్నట్లు తాను రౌడీనని దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తనపై రాష్ట్రంలో ఎటువంటి కేసులు లేనట్లు అన్ని జిల్లాల ఎస్పీలు డీజీపీ క్లీన్ చిట్ ఇచ్చారన్నారు. దొంగలిద్దరూ తనను దొంగ అనడం విడ్డూరమని, 2014 ఎన్నికల్లో ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి చీప్ లిక్కర్ పంపిణీ చేసి ఏడుగురి ప్రాణాలు బలిగొన్నారన్నారు. ఇటీవల దేవాలయం లాంటి సచివాలయంలో ఎమ్మెల్యే తన కార్యకర్తలచే చీప్ లిక్కర్ డంప్ చేయించి దొరికిపోయి బుకాయించడం దారుణమన్నారు. సుధాకర్‌పై హైదరాబాద్‌లో కబ్జాలు, దౌర్జన్యాలు తదితర కేసులున్నాయని గత ఎన్నికల్లో జనసేన తరుపున పోటీ చేసి అడ్రస్ లేకుండా పోయారని, తిరిగి ఇండిపెండెంట్‌గా ప్రత్యక్షమయ్యారన్నారు. టీడీపీని ఓడించేందుకు పసుపులేటికి విజయసాయిరెడ్డి, ఎమ్మెల్యే నుంచి దొడ్డిదారిన డబ్బులందుతున్నాయని ఆరోపించారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించాలని, మంచి చెడులు బేరీజు వేసుకోవాలని, తిరిగి వైసీపీని గెలిపిస్తే దోపిడీ దురాక్రమణలు పెట్రేగిపోతాయన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, బీజేపీ రాష్ట్ర నాయకులు కందుకూరి సత్యనారాయణ, టీడీపీ నేతలు మన్నవ రవిచంద్ర, గుత్తికొండ కిషోర్, రామకృష్ణ, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం టీడీపీని గెలిపించండి.

దగదర్తి(బిట్రగుంట) : అప్పుల్లో కూరుకుపోయిన ఆంధ్రరాష్ట్రాని అభివృద్ధి పథంలో నడిపేది నారా చంద్రబాబునాయుడు మాత్రమేనని, టీడీపీని గెలిపించి స్వర్ణాంధ్రప్రదేశంగా తీర్చిదిద్దుకుందామని టీడీపీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు అన్నారు. దగదర్తి ప్రధాన కూడల్లో శనివారం రాత్రి వారు ఎన్నికల ప్రచారం నిర్వహించచారు.. గ్రామానికి విచ్చేసిన కావలి వారితోపాటు సీనియర్ నేత రవీంద్రనాయుడు, బీజేపీ నేత కందుకూరి సత్యనారాయణను స్థానిక నేతలు పూలమాలు శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రజలను భయభ్రాంతులను చేస్తున్న వైసీపీ పాలన అంతమొందించటానికి టీడీపీని గెలిపించాలని కోరారు. వైసీపీ పాలనలో జరిగినన్ని మారణ కాండలు ఏ ప్రభుత్వంలో జరగలేదన్నారు. బెదిరించి భయపెట్టి డబ్బుల ఆశ చూపి పాలిస్తున్న వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు సరైన బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు, నందమూరి అభిమానులు పాల్గొన్నారు.



బిట్రగుంట : దగదర్తిలో ప్రజలకు అభివాదం చేస్తున్న దగుమాటి



బిట్రగుంట : ఏకే కండ్రిగలో ప్రచారం చేస్తున్న వేణుగోపాల్‌రెడ్డి

చంద్రబాబుతోనే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి

బిట్రగుంట : గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని టీడీపీ అభ్యర్థి దగుమాటి క్రిష్ణారెడ్డి సోదరుడు వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. బోగోలు మండలం ఇబ్రహీంపేట, అక్కరాజువారి కండ్రికల్లో టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బాబు ప్రవేశ పెట్టిన సూపర్‌సిక్స్ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఉమ్మడి పార్టీల టీడీపీ అభ్యర్థులు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావలి అసెంబ్లీ దగుమాటి క్రిష్ణారెడ్డిని గెలిపించి ఆంధ్రరాష్ట్రంలో టీడీపీ పాలన తీసుకొచ్చేందు అందరం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు కొడూరు వెంకటేశ్వర్లురెడ్డి, బోగిరి ప్రభాకర్, లేల్లపల్లి సుధీర్‌బాబు, బీజేపీ నేత గుర్రం వెంకటేశ్వర్లు, ఎంఆర్పీఎస్ నేత ఏసుపోగు జయరాజు తదితరులు ఉన్నారు.

టీడీపీ పాలనలోనే పల్లెల అభివృద్ధి



అల్లూరు : ప్రచారం నిర్వహిస్తున్న బినీత్‌రెడ్డి, చందన్‌రెడ్డి

అల్లూరు : టీడీపీ పాలనలోనే పల్లెల అభివృద్ధి సాధ్యమని, దీనికి నిదర్శనం గత తెలుగుదేశం పాలనలో జరిగిన అభివృద్ధి తప్ప గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో కనపడకపోవడమేనని కావలి అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి అల్లుడు వాకాటి బినీత్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం మండలంలోని బీరంగుంటలో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మేనల్లుడు చందన్‌రెడ్డితో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె ప్రాంతాల్లో టీడీపీకి స్పందన బాగుందని, అభివృద్ధికి నోచుకోని గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. టీడీపీ కావలి ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి, ఎంపీ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలను గెలిపించి అభివృద్ధికి తోడ్పాటును అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో రేబాల శంకర్‌రెడ్డి, శ్రీనివాసులు, జొన్నలగడ్డ రఘురామయ్య, తిరుమలశెట్టి నరేంద్ర, అంకిశెట్టి రాజేష్, కప్పిరి విష్ణు, ఏలూరు సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ ఏదైనా ప్రచారానికి ఓకే!

వలేటివారిపాలెం, ఏప్రిల్ 27 : ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి మందుబాబులకు ప్రతి రోజూ పండగే. మద్యం అందిస్తే చాలు పార్టీతో పని లేకుండా ఏ పార్టీకైనా ప్రచారం చేసేస్తున్నారు. రోజుకో పార్టీకి ప్రచారం చేస్తున్నారు. మరికొంత మంది మందుబాబులు ఉదయం ఓ పార్టీతో సాయంత్రం మరో పార్టీతో కలిసిపోతున్నారు. ఉచిత మద్యం పుష్కలంగా దొరుకుతుండడంతో మందుబాబులకు కిక్కు దిగడంలేదు. ప్రధాన పార్టీ కార్యాలయాల వద్ద వీరి సందడి అధికంగా ఉంది.

● కూల్‌గా ప్రచారం

ఎన్నికల పోలింగ్ కౌంట్‌డౌన్ మొదలైంది. గెలుపుకోసం బరిలో నిలిచిన అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారం చేస్తున్నారు. వారం రోజుల నుంచి ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. భానుడు ప్రతాపానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు అల్లాడిపోతున్నారు. ఈ నేపథ్యంలో అభ్యర్థులు ప్రచారం స్టైల్ మార్చారు. మునుపటిలా ఉదయం 9 గంటల నుంచి కాకుండా 7 గంటలకే ఇంటింటి ప్రచారం మొదలు పెట్టి 11 గంటలకే ముగిస్తున్నారు. తిరిగి సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రచారం కొనసాగిస్తున్నారు. బహిరంగ సభలు కూడా సాయంత్రం సమయాల్లోనే పెట్టుకొంటున్నారు. ఇక ప్రచారంలో ఖాళీ సమయం దొరికిందంటే పార్టీ కార్యాలయాల్లో సమావేశాలు పెట్టి భవిష్యత్ వ్యూహాలపై చర్చించుకుంటున్నారు. అదే సమయంలో పార్టీల్లో స్తబ్దుగా ఉంటున్న వారిని కలిసి వారిని తమ వైపు తిప్పుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.

మాలకొండ ఆదాయం రూ.10,58,418

వలేటివారిపాలెం, ఏప్రిల్ 27 : మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి శనివారం భక్తుల నుంచి రూ.10,58,418 ఆదాయ లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కే.బీ శ్రీనివాసరావు తెలిపారు. అష్టోత్తరం టికెట్ల విక్రయంతో రూ.10,300, కుంకుమార్చనకు రూ.24,960, వివాహములకు రూ.10 వేలు, తలనీలాల సమర్పణకు రూ.65,175, వాహనపూజలకు రూ.3,700, ప్రత్యేక దర్శనానికి రూ. 3,81,800, స్థలపురాణం పుస్తకాలు విక్రయం ద్వారా రూ.540, రూము అద్దెలు రూ.36,830, కవర్లు విక్రయం రూ.6,600, లడ్డూ ప్రసాదం ద్వారా రూ. 2,11,540, అన్నదానం ద్వారా రూ. 2,66,973, విరాళముల ద్వారా రూ. 40 వేలు ఆదాయం లభించినట్లు ఆలయ తెలిపారు.

నేడు కాకర్ల ఎన్నికల ప్రచారం

జలదంకి, ఏప్రిల్ 27: మండలంలోని జమ్మలపాలెం, ఎల్‌ఆర్ అగ్రహారం, రామవరప్పాడు, చోడవరం గ్రామాలలో ఆదివారం ఉదయగిరి టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్ ఎన్నికల ప్రచారం చేయనున్నట్లు టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి నాయకులు ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ ప్రచారంలో ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ చెంచలబాబుయాదవ్ పాల్గొంటారని తెలిపారు.

కాంగ్రెస్‌కే మద్దతు : వామపక్షాలు

కావలిటౌన్, ఏప్రిల్ 27: కాంగ్రెస్ అభ్యర్థులకే తమ మద్దతు అని వామపక్షాల నేతలు సీపీఎం జిల్లా నాయకులు పసుపులేటి పెంచలయ్య, సీపీఎం నియోజకవర్గ ఇన్‌చార్జ్ నాగరాజు, సీపీఎంఎల్ న్యూడెమ్రసీ రాష్ట్ర నాయకులు కరవది భాస్కర్, దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి, తదితరులు తెలిపారు. శనివారం కావలి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పొదలకూరు కల్యాణ్ ఎన్నికల కార్యాలయంలో వామపక్ష పార్టీలతో కలిసి కల్యాణ్ విలేకర్లతో మాట్లాడారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతనిధి లేళ్లపల్లి సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

మందాటి చెరువును కాపాడుకుందాం

● చెరువు పరిరక్షణ కమిటీ నిరసన



మందాటి చెరువు వద్ద నిరసన తెలుపుతున్న చెరువు పరిరక్షణ కమిటీ సభ్యులు

కావలిటౌన్, ఏప్రిల్ 27: ముసునూరు మందాటి చెరువును ఆక్రమణదారుల నుంచి కాపాడుకుందామనే నినాదంతో శనివారం మందాటి చెరువు పరిరక్షణ కమిటి నిరసన ప్రదర్శన నిర్వహించారు. కమిటీ కన్వీనర్ కనుమూరు భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ముసునూరులో మందాటి చెరువు దాదాపు 130 ఎకరాలకు పైగా ఉండేదని 50 ఎకరాలు ఆక్రమణకు గురైందన్నారు. చెరువును పరిరక్షించాల్సిన పాలకులు అధికారులే ఆక్రమణలను దొడ్డి దారిన ప్రోత్సహించడం దుర్మార్గమన్నారు. అక్రమార్కులు చెరువు స్థలాన్ని ఆక్రమించి నివాసాలు షోరూమ్‌లు నిర్మిస్తున్నారని క్రయవిక్రయాలు జరుగుతున్నాయని కోట్ల రూపాయలు చేతులు మారుతున్నాయని ఆరోపించారు. చెరువును పరిరక్షించాల్సిన అధికారులు చోద్యం చూడడం దారుణమని రెవెన్యూ అధికారులు రికార్డులకెక్కించకుండా అనధికారికంగా పొజిషన్ సర్టిఫికేట్లు ఇస్తున్నారని వాటి ఆధారంగా అక్రమార్కులు రెచ్చిపోతున్నారని ఎన్నికల సమయంలో మరింత రెచ్చిపోయి బహిరంగంగా నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని ఆక్రమణలు అడ్డుకోవాలని చెరువును పరిరక్షించాలని లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కమిటి సభ్యులు మందా కిరణ్, ఇంటూరు రమణయ్య, దుగ్గిరాల జార్జ్, రవినాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల ఇంటింటా ప్రచారం

లింగసముద్రం, ఏప్రిల్ 27 : లింగసముద్రం ఎస్టీ కాలనీలో టీడీపీ మండల అధ్యక్షుడు వేముల గోపాలరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు గాలంకి ప్రసాద్, తెలుగు యువత మండల అధ్యక్షుడు అడపా రంగయ్య, ఇతర టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. రాబోయే ఎన్నికల్లో నెల్లూరు ఉమ్మడి ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కందుకూరు అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావులను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో కండే మాలకొండయ్య, అడపా నర్సయ్య, ఏ చినకొండయ్య, మాజీ ఎంపీపీ పీ బాలకోటయ్య, సీహెచ్ బాలకోటయ్య, బింకం శేషయ్య, ఈ శ్రీనివాసులు, చెంబేటి రమేష్, రాధాకృష్ణయ్య, కొట్టే శేషాద్రి, ఉన్నం వీరాస్వామి, బొచ్చు మాల్యాద్రి, ఏ పెదసత్యం తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని పెదపవని గ్రామంలో శనివారం రాత్రి గ్రామ పార్టీ అధ్యక్షుడు గొర్రెపాటి సాంబయ్య ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేశారు. రాబోయే ఎన్నికల్లో నెల్లూరు ఎంపీ, కందుకూరు ఎమ్మెల్యే ఉమ్మడి అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావులను గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ధనుం మధు, పఠాన్ హిదాయతుల్లా తదితరులు పాల్గొన్నారు.



సూపర్ సిక్స్ పథకాలు వివరిస్తున్న గోపాలరావు

జన చైతన్యం



పార్టీ ఏదైనా ప్రచారాల పేరుతో బేరం

రామయ్య: ఏందిరో నరసయ్య యాడికి బోతున్నవు
నరసయ్య: యాడికుందిలే మామా.. పనికే కదా !
రామయ్య: ఓర్నాయాలా.. ఈ ఎండలో పనికేం పోతావురా ?
నరసయ్య: మరి ఇంకేం చేయమంటావు ?!
రామయ్య: పిచ్చి నాయాలా పెచారానికి పోదాం రా..
నరసయ్య: పెచారమా.. మాకెందులేబ్బా..
రామయ్య: అబ్బేలేదు.. గిబ్బే లేదు పోదాంపా..
నరసయ్య: జేబులో డబ్బులేవ్ మామా..
రామయ్య: డబ్బు లెందుకురా పిచ్చోడా.. అంతా వాళ్లే చూసుకుంటారు.
నరసయ్య: వాళ్లెవరు సామి మధ్యలో...?
రామయ్య: అదేరా ఆ పార్టీ వాళ్లు
నరసయ్య: ఎంతిస్తారేంది?
రామయ్య: రోజుకూలీ, మందు సీసా, బిర్యానీ పొట్లం... చాలదా ?
నరసయ్య: అవునే.. ఇదేందో బాగుందే.. పద !
పుల్లయ్య: ఓరే యాడికిరే ఇద్దరూ సైయిగ్గా బోతుండ్రు
రామయ్య: యాడికి లేదులే రా పెచారినికే..
పుల్లయ్య: నీ పని బాగుంది కదరా.. రోజూ భలే బేరం తగులుద్దే
నరసయ్య: ఇట్టాంటప్పుడే లేవోయ్.. వాళ్లు కూడా మనల్ని గమనించేది !
పుల్లయ్య: అట్టయితే అగండ్రా ఇప్పుడే వస్తా...
రామయ్య: మళ్లీ ఎక్కడికి రా... లేటవుద్ది !
పుల్లయ్య: పిల్లోడు సెలవులని ఇంటికాడే ఉన్నాడు. వాడ్ని తోడనొస్తా..
నరసయ్య: కక్కుర్తి నాయలా...? సరేలే తొందరగా పో...
పుల్లయ్య: ఇంతకీ ఏ పార్టీ వాళ్లది పెచారం ?
రామయ్య: ఏదయితే నీకెందురా మనం పోతున్నాం..
నరసయ్య: అంతేలేరా.. పెద్ద పెద్దోళ్లే తినంగా మనమెంత.. పదండి తొందరగా...!




- వరికుంటపాడు

రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే జైలుకే!

కొంతమంది అభ్యర్థులు సెంటిమెంట్‌ను రెచ్చగొడితే ఓట్లు పడతాయని భావించి కులం,మతం, వర్గం, ప్రాంత బేదాలతో ఇష్టారాజ్యంగా మాట్లాడుతుంటారు. ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు అరికట్టేందుకు ఎన్నికల సంఘం కఠిన నిబం ధనలను రూపొందించింది. ఎన్నికల్లో ఎవరైనా జాతి, మతం, కులం, భాష, సమాజం పేరుతో రెచ్చగొడితే ఐపీఎస్ సెక్షన్ 158ఏ ప్రకారం మూడేళ్ల జైలుశిక్ష, జరిమానా విధిస్తారు. ఓటుకోసం మద్యం, డబ్బులు, ఇతర వస్తువులను తీసుకున్న వారిని కూడా నేరస్థులుగానే పరిగణి స్తారు. ఐపీఎస్ సెక్షన్ 171బీ, 171హెచ్ ప్రకారం లంచంగా పరిగణించి ఏడాది జైలుశిక్ష విధిస్తారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రవాహాలపై నిఘా పెంచారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేసిన వారు కూడా భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు.

- ఉదయగిరి

ఆ రోజుల్లో కక్షలు ఉండేవి కాదు!



నేను తొలిసారిగా 1972లో ఓటు వేశాను. మా రోజుల్లో ఎన్నికలు ఎంతో స్నేహపూర్వక వాతావరణంలో జరిగేవి. పోటీ చేసే వారి మధ్య కక్షలు ఉండేవి కాదు. ఉదయాన్నే ఓటు వేయడానికి వచ్చిన వారికి పోటీ చేసిన వారు భోజనాలు ఏర్పాటు చేసేవారు. ఇది లంచం కింద కాదు. రిక్షాలు ఏర్పాటు చేసేవారు. ఏ రిక్షాలో వెళ్లినా మరో పోటీదారు ఫలానా వారు ఆ రిక్షాలో వెళ్లారని అసూయ పడేవారు కాదు. అలా వెళ్లిన వారిపై కక్ష సాధింపునకు దిగే వారు కాదు. ఇప్పుడు అలా కాదు. వీళ్ల మనోళ్ల, వారు వాలోళ్ల అని గిరి గీసుకుంటు న్నారు. గెలుపు కోసం అడ్డదారులు తొక్కుతు న్నారు. నాడు ఎన్నికల్లో ఫలితాలు కోసం బ్యాలెట్లు లెక్కింపు పూర్తయ్యే సరికి దాదాపు రెండురోజులు ఎదురు చూసేవాళ్లం. ఇప్పుడు ఈవీఎం మెషీ న్లు రావడంతో ఎవరు గెలిచారో తొందరగా తెలిసిపోతోంది. ఎన్నికలు ముగిసిన తరువాత అభివృద్ధి కోసం విజేత, పరాజితులు కృషి చేయాలి.

- చలమయ్య, అన్నారెడ్డిపాళెం, సంగం

ఇంతవరకు అతీగతీ లేదు...

రైతునెత్తిన రాళ్లపాడు

- రాళ్లపాడు కాలువ పొడిగింపు పనులు
- కందుకూరు ఉత్తర బైపాస్ నిర్మాణం
- రెండింటి పూర్తికి మాటిచ్చి 22 నెలలు

కందుకూరు, ఏప్రిల్ 27: సాక్షాత్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డే బహిరంగ సభలో ఇచ్చిన హామీలకు అతీగతీ లేదు. కందుకూరు నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు ఆరునెలల్లోగా నిధులు మంజూరు చేసి, టెండర్లు పిలుస్తామని ఆయన ప్రకటించారు. అయినా ఇంత వరకు అడుగు ముందుకు పడలేదు. కందుకూరు నియోజకవర్గ అభివృద్ధిలో ఎంతో కీలకంగా భావించే రాళ్లపాడు ఎడమ కాలువ పొడిగింపు పనులు, కందుకూరులో ఉత్తర బైపాస్ రోడ్డు నిర్మాణ పనులకు ఆరునెలల్లోగా నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటానని, 2022జూన్‌లో రామాయపట్నం పోర్టు భూమిపూజ సందర్భంగా జరిగిన సభలో జగన్ ప్రకటించారు. అదే సభలో ఎమ్మెల్యే మహీధరరెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసం రాళ్లపాడు ఎడమ కాలువ పొడిగింపు పనులకు, కందుకూరుకు ఉత్తర బైపాస్ నిర్మాణానికి, కందుకూరు మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనుల కోసం, కరేడు పీహెచ్‌సీ భవనాల నిర్మాణాలను నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. వీటిలో రాళ్లపాడు ఎడమ కాలువ పొడిగింపు, ఉత్తర బైపాస్‌లకు 2009లోనే మంజూరు ఉత్తర్వులు వచ్చాయని, సర్వే కూడా పూర్తి అయిందని, నిధుల కొరతతో భూసేకరణ జరగలేదని వివరించారు. తక్షణం ఆ పనులు ప్రారంభమ్యేలా అవసరమైన సుమారు రూ. 90 కోట్లు మంజూరు చేస్తానని జగన్ హామీ ఇచ్చారు. అలాగే కందుకూరు మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే మహీధరరెడ్డి కోరిన రూ.26కోట్లు నిధులు విడుదల చేయటం జరుగుతుందని, కరేడు పీహెచ్‌సీకి భవనాల నిర్మాణానికి నిధులిస్తానని హామీ ఇచ్చారు. అయితే మున్సిపాలిటీలో అభివృద్ధికి నిధులు మంజూరు చేయటం మినహా ఏ ఒక్క హామీ అమలు కాలేదు.



రాళ్లపాడు ఎడమ కాలువ (ఫైల్)

మూడు వేల ఎకరాలకు నీరు

రాళ్లపాడు ఎడమ కాలువ పొడిగింపు పనుల పూర్తయితే రెండువేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుంది. అంతేకా మరో మూడువేల ఎకరాల అదనపు ఆయకట్టుకు సాగునీరందుతుంది. ఈ కాలువ పొడిగింపు ద్వారా వీఆర్ కోట, శాఖవరం, నలదలపూరు, కళవళ్ల చెరువుల పరిధి లో ఉన్న ఆయకట్టును స్థిరీకరించటంతో పాటు మరికొన్ని గ్రామాలకు సాగునీరందుతుంది. ఈ కాలువ పొడిగింపు ద్వారా పోకూరు, నేకునాంపురం చెరువుల ఆయకట్టును స్థిరీకరించాలన్న ప్రతిపాదన కూడా ఉంది. రాళ్లపాడు ఎడమ కాలువ పొడి గింపు పనులకు గతంలోనే మం జూరు ఉత్తర్వులు ఉండటంతో పాటు కాలువ డిజైన్‌కు సంబం ధించిన సర్వే, భూసేకరణ కోసం సామాజిక, ఆర్థిక సర్వే కూడా పూర్తయిం ది. ఎంతో ఉపయోగకరమైన ఈ కాలువ పనులకు నిధుల విడుదలకు ఇచ్చిన హామీ కార్యరూపం దాల్చలేదు.



బైపాస్ ఎంతో అవసరం

మోసం గురూ!

కందుకూరులో ట్రాఫిక్ సమస్య నియంత్రణకు ఉత్తర బైపాస్ నిర్మాణం ఎంతో అవసరం. పట్టణంలో రెండు దశాబ్దాలుగా ట్రాఫిక్ సమస్య పెరిగిపోయింది. పట్టణానికి ఉత్తరం వైపున పలు పరిశ్రమలు రావడంతో నిత్యం లారీలు, ట్రాక్టర్లు, ఇతర వాహనాల్లో జామాయిల్ కర్ర, పొట్టు, ఇతర వ్యవసాయ ఉత్పత్తుల వాహనాలు పెద్దఎత్తున తిరుగుతున్నాయి. బైపాస్ నిర్మాణం జరిగితే ఈ వాహనాలన్నీ పట్టణంలోకి రాకుండా పోవడం ద్వారా ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభి స్తుంది. కానీ నిధుల కొరతతో పనులు ప్రారంభంకాని వైనాన్ని ఎమ్మెల్యే మహీధరరెడ్డి వివరించగా, తక్షణం నిధుల కేటాయింపు చేస్తానని సీఎం జగన్ హామీ ఇచ్చారు. కానీ అమలుకు నోచుకోలేదు. అలాగే కరేడు పీహెచ్‌సీకి భవనాల నిర్మాణానికి కూడా నిధులు విడుదల కాలేదు.

స్టార్ క్యాంపెయినర్ల ప్రచారం

- కోడ్ ఉల్లంఘున జరగకుండా పరిశీలించాలి
- నోడల్ అధికారుల సమీక్షలో కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం); ఏప్రిల్ 27: స్టార్ క్యాంపెయినర్లు ప్రచారానికి వస్తున్నందున కోడ్ ఉల్లంఘన జరగకుండా నిశితంగా పరిశీలించాలని కలెక్టర్ ఎం. హరినారాయణన్ అధికారులను ఆదేశిం చారు. కార్పొరేషన్‌లోని కమాండ్ కంట్రోల్ రూంలో శనివారం నోడల్ అధికారులతో సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతున్నందున కోడ్ అమలును అత్యంత జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. ఇంటలిజెన్స్ విభాగం అధికారులు మద్యం డంప్‌లు ఎక్కడున్నాయో గుర్తించి సీజ్ చేయాలన్నారు. చెక్ పోస్టుల దగ్గర ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలన్నారు. ఆటోలు, ద్విచక్ర వాహనాలను తప్పనిసరిగా తనిఖీ చేయాలన్నారు. జిల్లాలో ఎన్నికల విధులు కేటాయించ బడిన వారు మే 1వ తేదీలోగా పోస్టల్ బ్యాలెట్ కోసం ఫామ్ 12 అందచేయాలన్నారు. సమావేశంలో డీఆర్వో లవన్ననోడ్ అధికారులు బాపురెడ్డి, వెంకట్రావు, పద్మావతి, అనిత రాణి, ఎస్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్



పరిశీలకుల నోడల్ అధికారిగా డీఎస్వో



నెల్లూరు(హరనాథపురం): పరిశీలకుల నోడల్ అధికారిగా జిల్లా పౌరసరఫరాల అధికారి డీవీ రమణను కలెక్టర్ హరినారాయణన్ శనివారం నియమించారు. రమణ ఏపీ టూరిజం హోటల్‌లో ప్రజలకు అందుబాటులో ఉంటారు. 80083 01500 నంబరులో ఆయన్ను సంప్రదించవచ్చు.

ఫిర్యాదుల స్వీకరణకు ఎన్నికల పరిశీలకులు వీరే!

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 27 : ఎన్నికల ప్రక్రియను పూర్తిస్థాయిలో పర్యవేక్షణకు, పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం జిల్లాకు ఎన్నికల పరిశీలకులను నియమించిందని, వీరు ప్రజలకు, రాజకీయ పార్టీలకు అందుబాటులో ఉంటారని జిల్లా పరిశీలకుల నోడల్ అధికారి డీవీ రమణ ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గాల పరిధిలో ఏమైనా ఫిర్యాదులు ఉంటే వెంటనే ఫోన్ ద్వారా లేదా, అర్జీల రూపంలో సంబంధిత పరిశీలకులకు తెలియచేయాలని కోరారు.

- ఆత్మకూరు, కోవూరు, నెల్లూరు సిటీ, నెల్లూరు రూరల్ అసెంబ్లీ నియోజకవర్గాలకు నితిన్ బదారియా నియమితులయ్యారు. 6281209403 నెంబరుకు ఫోన్ చేసి, ఫిర్యాదు చేయవచ్చు
- నెల్లూరు పార్లమెంటు, కందుకూరు, కావలి, ఉదయగిరి నియోజకవర్గాలకు రామ్‌కుమార్ నియమితుల య్యారు. ఈయన ఫోన్ నంబరు 9014504275.
- నెల్లూరు పార్లమెంటు, కందుకూరు, కావలి, ఆత్మకూరు, కోవూరు, నెల్లూరు సిటీ, నెల్లూరు రూరల్, ఉదయగిరి నియోజకవర్గాలకు అశోక్‌దుదే పోలీసు పరిశీలకులుగా నియమితులయ్యారు. ఫోన్ నెం.7569618685.
- నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గానికి వ్యయ పరిశీలకులుగా గోరసె ప్రసాద్ దత్తాత్యేయ నియమితులు కాగా, 8008292237 నెంబరుకు ఫోన్ చేసి, ఫిర్యాదులు చేయవచ్చు.
- కోవూరు, నెల్లూరుసిటీ, రూరల్, సర్వేపల్లి నియోజకవర్గాలకు కంచన్‌రామ్‌మీనా సాధారణ పరిశీలకులుగా నియమితులయ్యారు. ఫోన్ నెం. 8247832811.
- కందుకూరు, కావలి, ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాలకు వ్యయపరిశీలకులుగాజ్యోతిమోయ్ బైలుంగ్ నియమితులుకాగా, ఫోన్ నెం.8639687940.
- తిరుపతి పార్లమెంటు నియోజకవర్గం, సర్వేపల్లి నియోజవర్గానికి సాధారణ పరిశీలకులుగా కె.జ్యోతి (9912340472), పోలీసు పరిశీలకులుగా అరవింద్ సాల్వే (9154141876) నియమితులయ్యారు. తిరుపతి పార్లమెంటు వ్యయపరిశీలకులుగా పరదీప్ కూమార్ (9032666742) నియమితులయ్యారు.

అప్పట్లో 21 ఏళ్లకు ఓటు

మీకు తెలుసా..!

దేశంలో మొదటిసారిగా సాధారణ ఎన్నికలు 1952లో జరిగాయి. కేంద్ర ఎన్నికల కమిషనర్‌గా సుకుమార్ సేన్ ఆధ్వర్యంలో 17.90 కోట్ల మందికి ఓటు వేసే అవకాశం కల్పించారు. 1985 వరకు ఓటు హక్కు కనీస వయసు 21 ఏళ్లుగా ఉండేది. 1988 లో 61వ రాజ్యాంగ సవ రణ చట్టం ద్వారా ఓటు హక్కు వయసు 18 ఏళ్లకు తగ్గించారు. ఎన్నికల నిర్వహణలో సమూల సంస్కరణలు అమలు చేసిన ఘనత 1990 దశకంలో ఎన్నికల కమిషనర్‌గా పనిచేసిన టీఎన్ శేషన్‌కు దక్కు తుంది. మొదటిసారి జరిగిన ఎన్నికల్లో 55 పార్టీలు బరిలో నిలవగా, 2014 నాటికి ఆసంఖ్య 370కి చేరింది. నాడు బ్యాలెట్ పేపర్‌తో ఎన్నికల నిర్వహించే విధానం నుంచి నేడు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం) అమల్లో వచ్చింది. 2019 ఎన్నికల నుంచి ఓటు ఎవరికి వేశారో తెలుసుకునేందుకు ఓటర్ వెరిఫైడ్ పేపర్ ట్రయిల్ (వీవీ ప్యాడ్) యంత్రాలను వినియోగిస్తున్నారు.

- అనంతసాగరం/ ఉదయగిరి



నామినేషన్ దాఖలు చేసిన పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థి రాజేశ్వరి (ఫైల్)

ఆత్మకూరు బరిలో తొలిసారిగా నారీ

ఇప్పటి వరకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆత్మకూరు నుంచి ఎందరో ఉద్ధండులు పోటీ చేసి, తమ రాజకీయ భవితకు బాటలు వేసుకున్నారు. అయితే మహిళలకు మాత్రం ఇక్కడ నుంచి పోటీ చేసే అవకాశం ఏపార్టీ కూడా ఇవ్వలేదు. తాజా ఎన్నికల్లో మాత్రం పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా బీ రాజేశ్వరి బరిలో నిలిచారు. ప్రస్తుత ఎన్నికల్లో టీడీపీ నుంచి ఆనం రామనారా యణరెడ్డి, వైసీపీ నుంచి మేకపాటి విక్రమ్ రెడ్డి, కాంగ్రెస్ నుంచి చేవూరు శ్రీధర్‌రెడ్డి బరిలో ఉన్నారు. నియోజకవర్గంలో 2,14,582 మంది ఓట్లు ఉండగా, వారిలో 1,05,444 మంది పురుషులు కాగా, 1,09,130 మంది స్త్రీలు ఉన్నారు. పురుషుల కంటే స్త్రీల ఓట్లే ఆధిక్యత ఉన్నా ఏ రాజకీయ పార్టీ మహిళలకు అసెంబ్లీ సీటు కేటాయించలేదు.

- ఏళ్ల తరబడి నిరాశే..

1955 నుంచి 2019 వరకు జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల తీరుతెన్నులను పరిశీలిస్తే ఒక్కసారి కూడా ఏ పార్టీ తన అభ్యర్థిగా మహిళలను నిలబెట్టిన దాఖలాలు కనిపించడం లేదు. ముఖ్యంగా 12 సార్లు గెలిచిన కాంగ్రెస్ పార్టీ గానీ, ఐదు సార్లు పోటీ చేసిన టీడీపీ నుంచి గానీ, మూడుసార్లు పోటీ చేసిన వైసీపీ నుంచి గాని, నాలుగు సార్లు పోటీ చేసిన బీజేపీ నుంచి గానీ, సీపీఎం, సీపీఐ నుంచి గానీ ఇంతవరకు ఆత్మకూరులో మహిళకు అసెంబ్లీ టికెట్ కేటాయించిన దాఖలాలు లేవు. కాగా ప్రస్తుత ఎన్నికల్లో పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా బీ రాజేశ్వరి పోటీలో ఉండడం గమనార్హం. అసెంబ్లీలో ఆత్మకూరు మగువ వాణి ఎప్పుడు వినిపిస్తుందో వేచిచూడాల్సిందే.

ఎవరు ఏ పార్టీయో..?

- రోజుకో జెండా, పూటకో కండువా మార్చుతున్న నేతలు
- అధినేతల బాటలోనే ద్వితీయశ్రేణి నేతలు

జంపింగ్ జపాంగ్

ఎమ్మెల్యేగా పోటీచేసే నేతలే పార్టీలు మారుతున్నారు. వారిని ఆదర్శంగా తీసుకుని కావలి నియోజకవర్గంలో దిగువ స్థాయి నాయకులు కూడా జెండాలు మార్చేస్తున్నారు. దీంతో ఏ నాయకుడు ఏరోజు ఏ పార్టీలో ఉంటారో అంతు బట్టడంలేదు. 2009లో కావలి నుంచి ఎమ్మెల్యే అభ్యర్థులుగా టీడీపీ నుంచి బీద మస్తాన్ రావు, కాంగ్రెస్ నుంచి కాటం రెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రజారాజ్యం పార్టీ నుంచి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిలు పోటీ చేశారు. అయితే ఇప్పుడు ఈ ముగ్గురు ఒకటై వైసీపీలో కొనసాగుతున్నారు. వైసీపీ అభ్యర్థి ప్రతాప్‌కుమార్ రెడ్డి గెలుపునకు కృషిచేస్తున్నారు. 2014లో టీడీపీ నుంచి బీద మస్తాన్ రావు, వైసీపీ నుంచి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి పోటీ పడ్డారు. వారిద్దరి గెలుపు కోసం ఇరుపార్టీల కేడర్ ద్వేషాలు పెంచుకుని పోరాడారు. ఇప్పుడు వారిద్దరూ ఒకటయ్యారు.2019లో టీడీపీ తరుపున కాటం రెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, వైసీపీ తరపున రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అసెంబ్లీకి పోటీపడగా, టీడీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా బీద మస్తాన్‌రావు పోటీ చేశారు. ప్రస్తుతం ఈ ముగ్గురు ఒకటై వైసీపీలో పనిచేస్తున్నారు. ఇలా వివిధ పార్టీల తరుపున పోటీ చేసిన నేతలే ఒకటి అవుతుండటంతో వారిని ద్వితీయ, తృతీయశ్రేణి నేతలు ఫాలో అవుతున్నారు. ప్రస్తుతం కావలిలో టీడీపీ తరపున దగుమాటి వెంకట(కావ్య) క్రిష్టారెడ్డి, వైసీపీ తరపున రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి పోటీ చేస్తున్నారు.ఈ ఇద్దరు ఆర్థికంగా పరిపుష్టి కలవారు. అలాగే స్వతంత్ర అభ్యర్థి పసుపులేటి సుధాకర్ కూడా ఆర్థికంగా బలంగా ఉండటంతో అన్ని పార్టీలలోని నేతలు, కార్యకర్తలు ప్యాకేజీలు తీసుకుని పార్టీలు మారుతున్నారు. దీంతో వివిధ పార్టీలకు చెందిన నేతలు ఎప్పుడు ఏ పార్టీలో ఉంటారో అర్థం కాక రాజకీయ పరిశీలకులు సైతం తలలు పట్టుకుంటున్నారు. సహజంగా ఓటర్లు ఏ పార్టీకి ఓటు వేస్తారో వారి నాడి అంతుపట్టక అయోమయంలో ఉంటే, వారి కన్నా ముందు నేతలు నాడి అంతుపట్టక పలువురు గందరగోళంలో పడ్డారు.



- కావలి



నీడలా వెన్నాడుతున్న నిఘా !

- అభ్యర్థుల ఖర్చులపై ఆరా

సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల పర్వం పూర్తయింది. ఏ పార్టీ తరుపున ఎవరు పోటీలో ఉంటారనేది కూడా తేలింది. నామినేషన్లకు సుమారు నెల ముందు నుంచే అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం చేపట్టారు. ఇక రెండోరౌండ్ సాదాసీగా ప్రచారం చేస్తే చాలదు. పోలింగ్ రోజు వరకు భారీ ఖర్చు తప్పదు. ఖర్చుల విషయమంలో ఎన్నికల సంఘం అధికారులు అభ్యర్థులను నీడలా వెంటాడుతారు. ఎన్నికల సంఘం మార్గదర్శక సూత్రాల మేరకు ఖర్చు చేస్తున్నారా? అని పరిశీలించేందుకు వాళ్ల బృందాలు పరిశీలిస్తున్నాయి. గెలుపు కోసం అభ్యర్థులు ఎన్ని కోట్ల ఖర్చుకైనా వెనుకాడరు. ఫ్లయింగ్‌స్క్వాడ్, ఎస్ఎస్‌టీ బృందాలు, కోడ్ ఆఫ్ కాంటాక్ట్ బృందం, వీడియో వీక్షక బృందం, అకౌంటింగ్ బృందం వీడియో సర్వేలియన్స్ బృందం పోటీలో ఉన్న అభ్యర్థుల కదలికలను గమనిస్తూ ఉంటాయి. ప్రచార ఖర్చును అంచానవేయడంతోపాటు అభ్యర్థులు ఎన్నికల నియమావళిని పాటిస్తున్నా.. లేదా ? నిఘా వేస్తారు. వాహనాల తనిఖీలు నిర్వహించి పరిమితికి మించి డబ్బు మద్యం, ఇతర విలువైన వస్తువులు రవాణా చేస్తుంటే స్వాధీనం చేసుకుంటారు. నీడలా వెంటాడే ఈ బృందాలు మధ్య అభ్యర్థులు పోలింగ్ ముగిసే చాలా జాగ్రత్తగా ఉండాలి.

-ఉదయగిరి